**కథాకాలం**

అప్పటికింకా లూనాలే బైకులు. పక్కకు వంచి కొడితేగానీ స్టార్టవని స్కూటర్లే రోడ్డు కింగులు. మొబైల్‌ఫోన్ కాదు కదా ఈ మెయిళ్లు కూడా పాపులర్ కాని కాలము. అమ్మాయిలు అప్పుడప్పుడే వోణీలు విడిచి చుడిదార్లు వేస్తున్న రోజులు. అబ్బాయిలు ఎవడెంత ఎక్కువ బ్యాగీ పెట్టించుకున్నాడంటూ పాంట్‌లు చూసుకునే యుగము. లవ్‌లెటర్లు ఉండచుట్టుకుని విసురుకునే తరము. బైకున్నవాడిదే గాళ్ ఫ్రెండ్ అను సంప్రదాయపు తొలినాళ్లు. చిరంజీవి ఇంకా సుప్రీంహీరోగానే ఉన్నప్పటి జమానా. రోజా రమ్యకృష్ణ నగ్మాలు హెయిర్‌కటింగ్ సెలూన్‌లలో పెద్ద పెద్ద పోస్టర్లలో దర్శనమిచ్చే టైం....నైటు ఎయిటు దాటితే హాఫ్ చార్జీ కాల్స్‌కోసం టెలిఫోన్ బూతులముందు జనం బారులు తీరే డేస్.....అంటే ఈ పాటికి మీకు అర్థమైపోయి ఉండాలి ఇది నైంటీన్‌నైంటీఫోర్ ఎ లవ్‌స్టోరీ అని!

అప్పుడు ఒక కాలేజీలో.... ఒక రోజున......మొదలైంది ఒక కథ!

**ఒకటోరీలు**

సూరీ చందూ బెస్ట్ ఫ్రెండ్సన్నట్టు. వాళ్లిద్దరి స్నేహనౌకా.....వద్దులే ఇద్దరేగా..ఇద్దరికీ అంతపెద్దనౌక అక్కర్లేదు కాబట్టి డింగీ అందాం. అది పాతపూలదండలాగా హుసేన్‌సాగర్ అలలమీద అలా అలా తేలుతూ హాయిగా సాగిపోతోంది.

వాళ్లిద్దరూ క్లాసులోనూ సెంటర్లోనూ కలిసి బీటు కొట్టేవారు. ఏ అమ్మాయి ఏ నెంబర్ బస్సెక్కుద్దో, ఏ స్టాప్‌లో దిగుద్దో వాళ్ల పితా ఏం చేస్తాడో, బ్రదరంటూ ఎవడైనా ఉన్నాడో లేడో ఉంటే వాడు ఫైటరా లేక ఐస్‌బోయా ఇలా లెక్కలేనన్ని విషయాలు అడక్కుండానే కంప్యూటర్‌లా గడగడా చెప్పేయగలరు. కలరింగ్‌లో వాళ్ల అనుభవాలు మహత్తరమైనవని గుర్తించిన కెఎమ్ఎఫ్ఏ (కోతిమూకాఫ్రెండ్ససోసియేషన్) కార్యకర్తలు డాక్టర్ ఆఫ్ బీట్ మరియు సైటురత్న అనే అవార్డులిచ్చి వాళ్లను తస్కరించారు. ప్రేమసినిమా పోస్టర్లు చుట్టి సన్మానించారు. ఇలా ఆనందంగా సెలబ్రేట్ అవుతున్న వాళ్ల జీవితంలో ఒకరోజు పిడుఘు లాంటి వార్త పడింది.

విధి ఆడిన వింతనాటకం వాళ్ల జీవితంతో కోలాటం ఆడింది. అపూర్వ స్నేహితులిద్దరూ ఇక తామెంతమాత్రమూ కలిసి బతకలేమని తెలియగానే కుళ్లిపోయారు. విధి ఆడిన ఆ నాటకం పేరు: ది ట్రాన్స్‌ఫర్.

----

ఇంతకీ ఆ ట్రాన్స్‌ఫర్ సూరికి కాదు. వాళ్ల పితాకి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మారుమూల ఆఫ్రికా లాంటి ఓ ఊరికి వాళ్ల నాన్న బదిలీ. ఫలితంగా రేకులషెడ్డులతో కూలినగోడలతో విరిగిన బల్లలతో పశువులకొట్టంలా సీతాకోకచిలుకల్లాంటి స్టూడెంట్స్‌తో అలరారే గిస్సారార్ అండ్ గీబీయార్ ప్రభుత్వ కళాశాల నుంచి కారే కన్నీరు తోడురాగా సూరీ టీసీ తీసుకున్నాడు.

ఇల్లు ఖాళీ చేసి అమ్మానాన్న వెళ్లిపోగా ఓ రెండు రోజులు మిత్రులతో బరువుగా గడిపి బావురుమంటూ రైల్వేస్టేషన్‌కు బయలు దేరాడు. తోడుగా ప్రాణమిత్రుడు చందూ రాగా అతనితో కలిసి ప్లాట్‌ఫాం మీదకు ఎంటరయ్యాడు. అప్పటికే బయలుదేరుటకు సిద్ధముగా ఉన్న హింసాద్రి ఎక్స్‌ప్రెస్ జెన్‌రల్ కంపార్ట్‌మెంట్లో ముతామేస్త్రి టవల్ వేసి అమ్ముకున్న సీట్లో భారంగా కూర్చున్నాడు. బియస్సీ ఫస్టియర్‌నాటికే మన సూరి బరువు 73 కేజీల్స్. దాంతో రైలు కూడా అంతకన్నా భారంగా మూలుగుతున్నట్టు బద్ధకంగా కూతవేసింది. చూస్తుండగానే పట్టాలమీద పరుగెత్తి పారిపోయింది.

----

చందూ కళ్లు ఏడుపు కారణంగా మసకబారిపోవడంతో రైలు తొందరగా ఫేడవుట్ అయిన ఫీలింగ్ కలిగింది. వీడ్కోలు చెబుతూ అరగంట క్రితం ఎత్తిన చందూ చెయ్యి ఇంకా అలానే ఉండిపోయింది. ప్రయాణీకులందరూ తననే చూస్తున్నట్టు గమనించిన చందూ చెంపలమీదకు జారుతున్న కన్నీటి చుక్కల్ని లిప్స్‌తో సిప్ చేసి సిగ్గుపడుతూ చేత్తో ముక్కు తుడుచుకున్నాడు.
తన గుండె లాగనే భారంగా వెనుదిరిగి రైల్వేస్టేషన్ నుంచి బయటకొచ్చాడు. రిక్షా ఎక్కి మారుతీనగర్ పోనీ అన్నాడు. రిక్షా చక్రాలు ముందుకు తిరుగుతుంటే చందూ ఆలోచనలు వెనక్కు ఐ మీన్ గతంలోకి వెళ్లిపోయాయి. రిక్షా వేగం పుంజుకుంది. రోడ్డుకి రెండు వైపులా ఉన్న ఇళ్లూ బస్టాపులూ అంతే వేగంగా వెనక్కి వెళ్లిపోతుంటే రిక్షా మారుతీనగర్ దిశగా దూసుకెళ్లింది. క్లోజ్‌లో చందూముఖం. లాంగ్‌లో రిక్షా ఫేడవుట్ అయిపోయాయి.
-కట్.

## రెండోరీలు

'యువర్‌టెన్షన్ ప్లీజ్! శాడ్‌పేట నుంచి యానండ్‌పూర్ వచ్చు పన్నెండు వందల నూట పదకొండో నెంబర్ హింసాద్రీ సూపర్‌ఫాస్ట్ ఏడుగంటలు ఆలస్యంగా ఏడో నెంబర్ ప్లాట్ ఫాం మీదకు ఏడు నిమిషాల్లో వచ్చుటకు సిద్ధముగా ఉన్నది'
ఎనౌన్స్‌మెంట్ విన్న రైల్వేకూలీలంతా చుట్టలు నేలకు రాసి ఆర్పేసి జేబులో పెట్టుకుని ప్రయాణీకుల పెట్టెలు పట్టుకోడానికి లేచి రెడీ అయ్యారు. పకోడీలూ, పేపర్లూ, మేంగో జెల్లీలు, బ్రెడ్‌ఆమ్లెట్లూ అమ్మేహాకర్లంతా చేతుల్లో ట్రేలు ఎత్తిపట్టుకుని కోళ్లఫారాన్ని తలపించే సౌండివ్వడం మొదలుపెట్టారు. కీచుమని భీకర శబ్దం చేస్తూ ట్రైను ప్లాట్‌ఫాం మీద అంటే పట్టాల మీద సడన్‌గా ఆగింది.
ఎక్కేటప్పటిలాగనే దిగేటప్పుడు కూడా ఒకరినొకరు తోసుకుంటూ ప్రయాణీకులంతా దిగాక సూరిబాబు తీరిగ్గా దిగాడు. లగేజంతా అమ్మావాళ్లు ముందే తీసుకువెళ్లడంతో తన చేతిలో సింపుల్‌గా ఓ కేరీబాగ్ మిగిలింది. దాన్ని మోసే కూలీ కోసం చుట్టూ చూశాడు. ఆ బాగ్ ఆరుకేజీలపైనే బరువుంది మరి. సూరీ తీక్షణమైన చూపులను చూసి ఓ కూలీ

పరిగెత్తుకువచ్చాడు. చేతిలో బాగ్ తీసుకుని బయటకు నడిచాడు. సూరి రెండు చేతుల్నీ పాంట్‌పోకెట్స్‌లో పెట్టుకుని అతన్ని ఫాలో అయ్యాడు. బయటకు వెళ్లగానే ఎండకు తట్టుకోలేక కళ్లకున్న నల్లరేబాన్ గ్లాసెస్ తీసి చేత్తోపట్టుకున్నాడు. అప్పుడు తన ముందుకు ధన్‌మని ఓ ఆటోవచ్చి ఆగింది. కూలీ కేరీబేగ్ ఆటోలో పెట్టాడు. బదులుగా సూరీ కూలీ చేతిలో ఫైవ్‌రుపీస్ నోట్ పెట్టాడు. ఆటోఎక్కి చెప్పాడు...భూత్‌బౌలీ! రోడ్‌రోలర్ సౌండ్‌తో ఆటోకదిలింది ముందుకు. సూరీ ఆలోచనలు కదిలాయి వెనక్కు.

----

శాడ్‌పేటలో జీవితం చూస్తుండగానే ముగిసిపోయింది. ఇంటర్ ఫస్టియర్‌లో మొదలై కనీసం డిగ్రీ అన్నా అవకుండనే మూడేళ్లు ఆటోమీటర్లా తిరిగి గడిచిపోయాయి. ఆ మూడేళ్లలోనే చందూ తన జీవితంలో ఒక ఖాస్‌దోస్తులా ప్రవేశించాడు.
జాన్‌జిగర్‌రైపోయాడు. రోజులన్నీ ప్రేమసాగరం సినిమాలా నడిచిపోయాయి. ఆ ఆనంద ఉదయాలు, సంతోషసాయంత్రాలు, చిరంజీవి సినిమా రిలీజ్‌రోజున అడ్వాన్స్ టిక్కెట్లకోసం థియేటర్ గేటు ముందుగడిపిన తెల్లారుజాములు, పోలీసులు తరిమితే పోగొట్టుకున్న చెప్పులు, ప్రేమను సరిగ్గా కమ్యూనికేట్ చేయలేకపోడంతో లవ్ చేసిన అమ్మాయి రాఖీ కట్టడానికి వస్తుంటే తప్పించుకుని కారిడార్‌లో పిల్లర్ల వెనుక దాక్కుని పడ్డ తిప్పలు. తనతో సినిమా టిక్కెట్లు కొనిపించి వేరేవాడితో మోర్నింగ్‌షోకి చెక్కేసిన శ్రీలు. ఇలాంటి లస్కుటపాలెన్నో సూరి మదిలో పురుగుల్లా అటూ ఇటూ మెదిలాయి. తొలిచాయి.

----

ఆటో అదే సౌండ్‌తో వెళ్తూనే ఉంది. దసరా సీజన్‌కావడంతో యానండ్‌పూర్ రోడ్ల మీద వేసిన పందిళ్లలోంచి సిట్యుయేషన్‌కు తగ్గట్టుగా 'పోతేపోనీ పోరా ఈ పాపపు జగతిలో శాశ్వతమెవరురా' అని గుండెల్ని మెలిపెడుతూ ఘంటసాల పాట వినిపిస్తోంది. సూరి ఘట్టిగా నిర్ఘూర్చాడు.
ఆటో ధన్‌మని ఆగిపోయింది. కళ్లు తెరిచి ఈలోకంలోకి వచ్చి చూస్తే ఆటోముందు ఓ స్కూటరాగి ఉంది. దడుచుకున్నట్టు చెమటలుపట్టిన ఫేసుతో ఓ ఆగంతకుడు ఆటోడ్రైవర్ని తిడుతున్నాడు.
'ఏరా బుద్ధిలేదా, అంతఘట్టిగా హారణ్ కొట్టాలా'
డ్రైవర్ని కొడుతున్నట్టుగా అడిగాడు.
'నేనా, హారణ్ కొట్టానా'
బ్లాంక్‌ఫేసు పెట్టాడు ఆటో డ్రైవరు.
'హారనెప్పుడు కొట్టాను'
విసుక్కున్నాడు డ్రైవరు.
ఇంతలో సూరికి మేటర్ బ్రైట్‌గా వెలిగింది. ఆటోదిగి ముందుకువచ్చాడు.
'సారీసార్, అతను హారన్ కొట్టలేదు. నేనే నిర్ఘూర్చాను'

ఫర్మ్‌గా చెప్పాడు సూరి.
ఆ స్కూటరతను ఫేసు ఆశ్చర్యార్థకం షేపులో పెట్టాడు.
'యస్ అది నిర్టూర్పే. బాధతో కూడిన నిర్టూర్పు.'
కన్‌ఫర్మ్‌గా చెప్పాడు సూరి.
స్కూటరతను తేరుకున్నాడు. ఫేస్‌రీడింగ్ తెలిసిన వాళ్లెవరైనా అతని ఫేస్ కవళికలు చూస్తే అతను మనసున్న మనిషని సెంటిమెంటలనీ అర్థం చేసుకుంటారు. సో నేచురల్‌గానే అతను–
'బాధా? ఎందుకు బాబూ బాధ. ఏంటి నీ గాథ'
అనడిగాడు.
'అవును. నా గతం సినిమా రీళ్లు కళ్లముందు తిరిగితే, ఆ బాధలో నిట్టూర్చాను'
వివరించాడు సూరి.
'నిట్టూర్పా! మా నాయినే అంత ట్రాజెడీనా బాబూ నీ గతం?'
ఉబికివస్తున్న కన్నీళ్లతో అడిగాడు ఆ స్కూటరాయన.
ఇక అందుకున్నాడు సూరి.
'అవును సారూ, నాదొక వింతకథ. విధి విషసర్పంలా కాటేసిన గాథ. అవి నేను ఎట్లాగో కష్టపడి చివరకు టెంత్ గట్టెక్కిన రోజులు. అప్పుడు.....'
ఇంతలో 'ఆపాలీ....ఆపాలీ' అంటూ హోరెత్తుత్ను నినాదాలు వినిపించాయి.
వాళ్లల్లోంచి ఓ కార్యకర్త ముందుకు వచ్చాడు. అతనన్నాడు–
'బాబూ నిన్ను చూస్తుంటే ఎవరో పెద్ద కుటుంబం నుంచి వచ్చినట్టున్నావ్, ఈ నిరుపేద స్కూటర్లూ లూనాల మీద, సాటి ఆటోప్రయాణీకుల మీద దయ తలచి నీ గతం విప్పకు. సామాజిక భద్రతకు హానికలిగించకు. ఇప్పటికే ట్రాఫిక్ అరకిలోమీటర్ ఆగిపోయింది'
అంటూ రోడ్డు వెనక్కి చూపించాడు.
సూరిబాబు చలించిపోయాడు. స్కూటరాయనకేసి చూసి–
'సరే మాస్టారు. కష్టాలు మనకే కాదు రోడ్డు యూజర్లకూ ఉంటాయి. మీ ఫోన్ నెంబరివ్వండి. రాత్రికి ఫోన్ చేసి నా గతమంతా చెబుతా. మనసారా ఏడుద్దురుగాని'
అన్నాడు.
స్కూటరిస్టు కళ్లు తుడుచుకుని–
'అలాగే బాబూ, అలాగే... తప్పకుండా ఫోన్ చేస్తావు కదూ. బిందెడు కన్నీళ్లు కార్చేలా చెబుతావు కదూ. నాలుగురోజులైంది ఈ ఊళ్లో పంపులొచ్చి' అన్నాడు.
ఆపై, తన స్కూటర్‌ను పక్కకు వంచి కిక్ కొట్టడం మొదలుపెట్టాడు. వెంటనే పదినిమిషాల్లోనే స్కూటర్ స్టార్టయింది. సూరిబాబు ఎక్కిన ఆటోకూడా. ట్రాఫిక్ క్లియరయ్యేసరికి గడియారం ఒంటిగంట కొట్టింది. మెస్సులన్నీ లంచ్ చేసేవారితో నిండిపోయాయి. యానండ్‌పూర్‌లో పౌరజీవనం యధాస్థితికి వచ్చింది.
–కట్

**మూడోరీలు**

ఆటో కొట్టుకుంటూ కొట్టుకుంటూ భూత్‌బౌలీ చేరింది. ఓ పాతబిల్డింగ్ ముందు ఆగింది. సూరి ఫ్యామిలీ పేరెంట్స్ అక్కల్స్ చెల్లెల్స్ అంతా వారం ముందే షిఫ్టయిపోయారు. సూరీ మాత్రం లతీఫ్‌లా ఈరోజు ఎంట్రీ కొట్టాడు. వాళ్ల పితా పెద్ద ఆఫీసర్ కాబట్టి ఇల్లు దొరకడం, సర్దుకోడం, సెటిలైపోడం చక్‌చకా జరిగిపోయాయి. సూరీ ఆటోదిగాడు. సాయంత్రమైంది. మసకచీకటి చలిగాలితో గుసగుసలాడుతోంది. కూలింగ్ గ్లాసెస్ పెట్టుకుని ఓ సారి చుట్టూ చూశాడు. ‘ఫర్లేదు ఏరియా బాగానే ఉంది. అమ్మాయిల జనాభా తగినంత ఉంటుందో లేదో’ అని మనసులో అనుకున్నాడు. ఇంతలో బాల్కనీలోంచి వాళ్లక్క చూసింది. ‘తమ్ముడూ’ అని ఆప్యాయంగా అరిచింది. ‘అక్కా’ అని సూరి రిటన్‌గా అరిచాడు. చుట్టూ పాత బిల్డింగులుండటంతో సౌండు రీసౌండుగా మారింది. ఆ వీధిలోని వాళ్లు తలుపులు తెరుచుకుని బయటకు వచ్చి చూశారు. సినిమాల్లోనే కాక నిజజీవితంలో కూడా ఇంత సెంటిమెంటు పండేలా పిల్చుకునే అక్కాతమ్ముళ్లు ఉన్నారని తెలియగానే వాళ్లంతా వీళ్లని వేనోళ్లా పొడిగేసి తలుపులేసుకుని ఇంట్లో కెళ్లి పన్నుసుకోసాగారు.

----

సూరి స్లోమోషన్‌లో మెట్లెక్కుతూ ఇంట్లో అడుగుపెట్టాడు. బాగ్ ఓ మూల పడేసి సోఫాలో తూలిపడ్డాడు. సోఫా కొంచెం బెదిరింది. వెంటనే సర్దుకుంది. ఆ అలజడికి కిచెన్‌లోంచి బయటకొచ్చింది వాళ్ల మమ్మీ.

సూరి ఫేసులో అలసట అద్దంలో కనిపించినట్టు కనిపించింది. ఆమెలో ఆదుర్దా పెరిగింది. ‘నాన్నా అసలే గంటలు గంటలు ప్రయాణం చేసొచ్చావు. చూడు ఎంత అలిసిపోయావో, స్నానం చేసి అన్నం తిని డబుల్‌కాట్ మీద కాళ్లు చాపుకుని పడుకుందుగాని పద’ అంటూ తొందరపెట్టింది మమ్మీ.

‘కరెక్టమ్మా నేనూ అదే ఫీలవుతున్నాను. ఒకసారి ఆత్రేయగారు ఒకపాటలో ఏమన్నారో గుర్తుందా మమ్మీ’ అనడిగాడు సూరి.

‘లేదు బాబూ లేదు. నేను చూసే సినిమాలే వేరు. జామాతపూజ, విష్ణుకథ లాంటి భక్తి సినిమాలు తప్ప ప్రేమ సినిమాలు నేనెక్కడ చూశాను బాబూ. అంతా నా తలరాత. ఒక్కగానొక్క కొడుకు అడిగిన సినిమా పాట గురించి కూడా చెప్పలేని స్థితిలో ఉన్నాను’ అంటూ యమా ఇదైపోయిందామె.

సూరి షార్ప్‌గా రియాక్టయ్యాడు ‘అమ్మా ఆగమ్మా. ఇందులో ఇంతగా కుమిలిపోవాల్సిందేముంది. అంతగా బాధపడకు’ అని వారించాడు.

‘అలాగేరా చిట్టికన్నా నీ మాట నేనెప్పుడు కాదన్నానని’ కళ్లు తుడుచుకుంటూ చెప్పింది మమ్మీ.

'ఆ పాట నేనే గుర్తు చేస్తా వినమ్మా విను. కునుకు పడితె మనసుకాస్త కుదుట పడతది కుదుట పడ్డ మనసు తీపి కలలు కంటది అన్నాడమ్మా ఆయన. అందుకే ఇప్పుడు నాకు నిద్రకావాలి. స్నానందేముందిలే మొన్నేగా చేసింది. ఇప్పుడు సింపుల్‌గా ఫేస్ కడుక్కుంటాలే' అంటూ సైడు బాల్కనీలో సింక్ దగ్గరకెళ్లాడు సూరిబాబు. ఫేసు మీద నీళ్లు చల్లుకుని సబ్బు తీసుకున్నాడు. ఆకాశంలో మబ్బు కదిలినట్టనిపించింది. ఏదో డౌటొచ్చి కొంచెం లెఫ్ట్‌కు తిరిగాడు. పక్కనే సేమ్‌హైట్‌లో ఓ బిల్డింగ్. దాంట్లో సేమ్ హైట్‌లో కిటికీ. ఆ కిటీకీ వెనుక కాటుక కళ్లు. దట్‌మీన్స్– ఓ అమ్మాయి సూరీ కేసి చూస్తూ కనిపించింది. సూరీ అటు లుక్కేసుకునే టయానికి సర్రమని శబ్దం చేస్తూ లాగేసింది కర్టెన్ని. లైట్ తీసేసింది.
కానీ, ఆ కిటీకీయే తన జీవితాన్ని సంచలనాత్మక మలుపు తిప్పుతుందని సూరీ మాత్రమే కాదు, ఆ అమ్మాయి కూడా ఊహించలేదు.
–కట్

**నాలుగోరీలు**
సూరీ తన బాడీని బెడ్ మీద పడేసి నిద్రకు ఉపక్రమించాడు. మెల్లగా మగతలోకి జారిపోతుండగా ఎవడో కొట్టినట్టు సడన్‌గా లేచాడు. బెడ్ కెదురుగా వాళ్లక్క ఆల్రెడీ తనకిష్టమైన కొటేషన్‌ను అంటించింది. ఆ కొటేషన్‌కేసి కమిట్‌మెంట్ నిండిన కళ్లతో చూశాడు.

## so many promises to keep

## and miles to go before i sleep

తన కర్తవ్యమేంటో సూరికి షాకులా గుర్తొచ్చింది. చేతిలో చెయ్యేసి చెప్పు బాబూ అంటూ ప్రాధేయపడిన స్కూటరిస్టు ఫేస్ సూరి బాబు ఐస్ ముందు కదిలింది. వెంటనే బెడ్ మీదనుంచి లేచాడు. కాళ్లకు షూస్ నడుముకు బెల్ట్ వేసుకుని చాకులా కిందకు దిగాడు. ఏ బండి వేసుకెళ్లాలా అని ఆలోచిస్తుండగా ఆకాశవాణి 'ఇందులో ఆలోచించడానికేముంది మీ నాన్నగారు వాడిన సువేగా ఇప్పటికీ చెక్కు చెదరలేదు. పైగా మీ ఫ్యామిలీకి ఉన్నదే ఒక్క బండి. ఛాయిస్‌లేదు' అంటూ అడ్వయిజ్ చేసింది. ఓహ్ కరెక్టేకదూ అనుకుని పెడల్ తొక్కి తొక్కి మోపెడ్ స్టార్ట్ చేసి స్టాండ్ తీసి దూసుకుపోయాడు.
––––
స్ట్రీట్ చివరున్న టెలీఫోన్ బూత్ ముందు స్టాండేశాడు. తలుపేసి లోపల గడిపెట్టాడు. ఇంటికి ఇంకా లాండ్‌లైన్ ట్రాన్స్‌ఫర్ కాకపోడంతో సూరి ఇలా బూత్‌కు రావాల్సి వచ్చింది. సూరి చకచకా స్కూటరాయన నెంబర్ కొట్టాడు. ఆయన ఎత్తాడు. మనోడు మొదలుపెట్టాడు. ఫ్లాష్‌బాక్ బిగినైంది. శాడ్‌పేటలో తన జీవితం గురించి, చందూ అనే

ప్రాణస్నేహితుడితో తన అనుబంధం ఆప్యాయత గురించి వివరంగా చెప్పాడు. తను ఎలా ఎంజాయ్ చేసిందీ, ఒకే కంచం, ఒకే మంచం, ఒకే సీటులో సినిమా ఎలా నడిచిందీ చెప్పసాగాడు. అటువంటి ప్రాణస్నేహితుడ్ని నాన్న ట్రాన్స్‌ఫర్ రూపంలో విధి ఎలా దూరం చేసిందీ తన తలరాత గురించీ చేతిరాత గురించీ ఏడుస్తూ విషాదభరితంగా చెప్పసాగాడు. చందూ శాడ్‌పేటలో తాను యానండ్‌పూర్‌లో ఉండి ఇప్పటికే నలభైఎనిమిది గంటలుగా ఒకరినొకరు చూసుకోకపోడంతో తను ఎంత క్షోభ అనుభవిస్తున్నదీ పూసగుచ్చినట్టు చెబుతుంటే అవతల ఫోనులో కోరస్‌లో వెక్కిళ్లు వినిపిస్తున్నాయి. కేవలం ఆ స్కూటరాయనే కాక ఇంటిల్లిపాదీ స్పీకర్‌లో విని ఏడుస్తున్నారని అర్థమైపోతుంది. గడియారం ముల్లు తిరుగుతూనే ఉంది. బిల్లు లెక్కచేయకుండా సూరీ మాట్లాడుతూనే ఉన్నాడు. బహుశా అక్కడ ఓ ట్యాంకు నిండిపోయి ఉండొచ్చు. సూరి తన బాధంతా చెప్పుకున్నాక మనసు కుదుటపడింది.

----

ఫోన్‌పెట్టి బూత్ తలుపు తెరిచి అడుగు బయటపెట్టేసరికి చుట్టూ జనం! కాళ్లకు తడిగా తగిలి తలవంచి చూస్తే నేలమీద నాలుగంగుళాల ఎత్తున నిలిచిన నీరు! తలెత్తి చూస్తే జనం 'వచ్చాడు వచ్చాడు' అంటూ మీద పడ్డారు. వాళ్ల అరుపులతో శ్మశానంలో నక్కఊళ విన్నోడిలా జడుసుకున్నాడు సూరి. ఎక్కడో సన్నగా భయం మొదలైంది. తేడా వచ్చింది. తెలిసిపోతూనే ఉంది. ఇంతలో ఒక బక్కపలచని ముసలాయన సూరిని చూసి ఇలా అన్నాడు.

'చూడు మిస్టర్, ఇది ఫ్యామిలీలుండే వీధి. అసలే రోడ్డు బాగాలేదు. మున్సిపాల్టీవాళ్లు బాగుచ్చైరు. వానపడితే ఇక్కడంతా కర్ఫ్యూ వాతావరణం నెలకొంటుంది'

ఈ డైలాగవగానే మరో రిటైరయిన టీచరొచ్చి సూరిని చూసి ఇలా అన్నాడు.

'ఎవడ్రా నువ్వు. వర్షానికి చెట్టుకింద చేరినోడి నెత్తిన పిట్టలు రెట్టేసినట్టు ఈ కాల్నీకి ఇప్పుడు నువ్వొకడివి తగలడ్డావ్ కొత్తగా'

ఈ డైలాగు అయిపోగానే

తినే అన్నం మధ్యలో వదిలేసినట్టు ఫేసుపెట్టిన మరో మధ్యవయస్కుడు సూరిని చూసి ఇలా అన్నాడు.

'నీ యబ్బ ఏడికెల్లొస్తారు గురూ, నువ్వు గంటసేపట్నించీ ఫోన్‌లో నీ కథ చెప్తుంటే ఈ బూతు పక్కన ఇళ్లలో ఆడోళ్లంతా అన్నాలు పెట్టడం మానేసి శోకాలు పెట్టారు. ఆ కర్చీఫులు పిండి ఆరేస్తే వచ్చిన నీళ్లే ఇప్పుడు ఈ రోడ్డు మీద పారతన్నయి. దేవుడి దయ వల్ల నీ ఫోను ఓ గంటలో అయిపోయింది. లేకపోతేనా, పల్లపు ప్రాంతాలవాళ్లని రక్షిత ప్రాంతాలకు తరలించాల్సి వచ్చేది'

ఇలా నలుగురూ నానా మాటలు అనడంతో సూరిబాబు మరోసారి మనోవేదనకు గురయ్యాడు. వాళ్లకు సారీ చెప్పి పక్కకెళ్లి సువేగా మీద చేయివేశాడు. కానీ, అనూహ్యంగా అతని భుజం మీద చేయిపడింది. తలతిప్పి చూస్తే క్లోజ్‌షాట్లో ఒక యువకుడి ఫేసు

కనిపించింది. అతని కళ్లు చీకట్లోనూ ఎర్రగా కాలిపోతున్నాయి. అతను కోపంతో ఉడికి పోతున్నాడని ఉబ్బిపోయిన అతని ముఖమే చెబుతోంది. సూరి తేరుకునేలోగా అతను కాలర్ పట్టుకున్నాడు. ఇంతతొందరగా ఫస్ట్ విలన్ ఈ స్టోరీలో ఎంట్రీ ఇస్తాడని సూరి అనుకోలేదు. దాంతో షాక్ తిన్నాడు.

'ఏరా ఎంతమంది జీవితంతో ఆడుకుంటావ్‌రా' కోపంతో నిలదీశాడా యువకుడు.

'నేనా? జీవితాలతోనా? ఆటలా!' వెర్రిచూపులు చూశాడు సూరి.

'అవున్రా నా కొండిగా, ఈ ఫోనేమైనా నీ బాబుగాడి సొంతమనుకున్నావా గంటలతరబడి సినిమా స్టోరీలు చెప్పుకోడానికి? పబ్లిక్‌ఫోన్రా అరేయ్. నీయబ్బ, తొమ్మిదింటికల్లా ఫలానా ఫోన్ దగ్గరుండూ ఫోన్ చేస్తానని నా గాళ్‌ఫ్రెండ్‌కి చెప్పాను. ఇప్పుడు పదిన్నరైంది. నేను తలుపులు బాదుతున్నా నువ్వు ఫోన్ పెట్టలేదు. ఇప్పుడు తను వెయిట్ చేసీ చేసీ చేసీ వెళ్లిపోయి ఉంటుంది. దానికసలే కొంచెం మెంటల్. రేపు మా మధ్య గొడవేమైనా వచ్చిందో నీ ఎండింగ్ చూస్తా. పాలలాంటి మా ప్రేమ విరిగిందంటే, అప్పుడు చెబుతా నీ సంగతి. మర్డర్లయిపోగలవు జాగర్త' అని వార్నింగ్ ఇచ్చి వెళ్లిపోయాడు ఆ యువకుడు. సూరిబాబు మనసంతా అదో టైపులో అయిపోయింది. సిక్త్‌సెన్స్ మాత్రం ఎక్కడో షార్ట్ సర్క్యూట్ అయిందని చెబుతోంది. కానీ అదేంటో ఊహించలేకపోతున్నాడు. ఇంటికెళ్లి బార్లా పడుకున్నాడు ఎప్పటికో నిద్రపట్టింది.

–కట్

**అయిదోరీలు**

ముఖం మీద ఆమ్లెట్ వేసినట్టనిపించింది సూరికి. కళ్లు తెరిచి చూశాడు. కళ్లల్లో సూర్యకిరణాలు గుచ్చుకున్నాయి. టైం రెండయింది. ఆ గది పడమర బెడ్‌రూం కావడం వల్ల ఎండ ఆ రూంలో పడటానికి ఇంతసేపు పట్టింది. సూర్యుని తొలికిరణాలు మీద పడగానే లేవడం సూరికి అలవాటు. శాడ్‌పేటలో తన రూం తూర్పున ఉండేది. ఇక్కడ దిక్కుమారింది. ఇకపై తనకు డే బిగినైయ్యేది సెకండ్ షిఫ్టులోనే!

ఆకలికూడా అదే స్థాయిలో మండేసరికి సూరి లేచాడు. తినేముందు బ్రష్‌చేసుకుంటే బెటరనే ఉద్దేశంతో సైడు బాల్కనీలోకి వెళ్లాడు. అలా బ్రష్‌మీద పేస్ట్ వేశాడో లేదో పక్కనుంచి సర్ర్‌మంటూ సౌండొచ్చింది. బ్రష్‌నోట్లో పెట్టుకోడం ఆపి అటువైపు చూశాడు. సేమ్ సీన్. కిటికీ కర్టెన్ తెరుచుకుంది. కిటికీ వెనుక అమ్మాయి. అదే టైంకి జనరంజనిలో 'తొలిసారి మిమ్మల్ని చూసింది మొదలు' అనే పాట వినిపిస్తోంది. ఇంతలో సూరి తన జన్మలో ఊహించని సంఘటన జరిగింది. ఆ కిటికీలో అమ్మాయి పల్లూ అంచును చేత్తో పట్టుకుని ముళ్లు వేస్తూ మనోడికేసి చూసి సెక్సీగా నవ్వింది. సూరికి కళ్లు తిరిగాయి. అసలు ఒకమ్మాయి తనకేసి చూడడమే పెద్ద భాగ్యం అనుకునే సూరికి ఆ పిల్ల చూడడమే కాక ఓ స్టెప్పు పైకేసి నవ్వడం, అదీ సెక్సీగా నవ్వడం మైండ్‌బ్లాకయ్యేంత ఎఫెక్ట్ కలిగించింది. అసలు ఒకమ్మాయి తన మీద ఇంటరెస్ట్ చూపిస్తుందనే ఆలోచన

వచ్చే అవకాశమే లేని వ్యక్తి మన సూరిబాబు. కాలేజీలో మనోడు క్లాస్‌లో హోల్ మొత్తం అమ్మాయిలకూ మాస్‌గా అన్న. హైయెస్ట్ రాఖీలు పడేది సూరిబాబు చేతికే. అన్నయ్యా అని అప్యాయంగా పిలిచే అమ్మాయేగానీ అలా సినిమాకెళ్దామా అన్న కేసే లేదు. కొన్ని ఫేసులంతే మరి. ఈ బ్యాక్‌గ్రౌండ్ కారణంగా సూరి ఆ కిటికీ అమ్మాయి తనను టీజ్ చేయడానికి నవ్విందని అనుకున్నాడు గానీ ఆ నవ్వులో లవ్వుందని అనుమానించలేకపోయాడు. అందుకే ఆ అమ్మాయి ఆ తర్వాత మరో రెండు మూడు పూలబాణాలు వేసినా మనోడికి గుచ్చుకోలేదు. పూర్తిగా లైటు తీసుకున్నాడు. అఫ్‌కోర్స్ ఇన్ ఫ్రంట్ క్రోకడైల్ ఫెస్టివల్! ఈ కథలో హీరోయిన్ ఎంట్రీ జరిగిపోయిందనే విషయం అతనికి బుట్టలేదు.
–కట్.

**ఆరోరీలు**

యానండ్‌పూర్‌లో ఆనందమే కరువైంది. ఎండిపోయిన బోరుబావి లాంటి జీవితం బోరు కొట్టేస్తోంది. పోనీ బయటికెళ్లి ఎవరితోనైనా గోడు వెళ్లబోసుకుందామంటే ఎటెల్లి ఎటొస్తదోననే భయం వెన్నాడుతోంది. ఏ పని చేద్దామన్నా–ఏ పొరపాటు చేసేస్తానో, సామాజిక భద్రతకు ఎక్కడ భంగం కలిగిస్తానో, ప్రజాప్రతిఘటన ఎంత తీవ్రంగా ఉంటుందోననే బెరుకుతో ఇంటిపట్టునే వేలాడుతున్నాడు గబ్బిలంలా. జల్దీగా కాలేజీ అడ్మిషన్ అయిపోతే బాగుండు కాస్తన్నా టైంపాసవుతుందనిపిస్తోంది మన సూరిబాబుకి. కానీ అందుకింకా చాలా టైం పడుతుంది.
అప్పటి దాకా
తప్పదు
నిరీక్షణ!
దీనికితోడు సూరీ ఈవారం రోజులుగా చందూని బాగా మిస్సవుతున్నాడు. రెండువారాలు దాటినా వాడి నుంచి ఉత్తరం రాకపోడంతో బెంగ మొదటి ప్రమాదహెచ్చరికను ఎగరేసింది. పోనీ తనే ఫోన్ చేద్దామంటే వాళ్లింట్లో ఫోన్ లేదు. పక్కింటి ఆంటీ వాళ్లింట్లో కూడా లేదు. తన బాలమిత్ర నుంచి చిన్న ఉత్తరం కూడా రాకపోడంతో సూరి మానసికంగా కుంగిపోసాగాడు.
చందూ అంటే సూరికి ప్రాణం. ఆమ్లెట్‌లో ఉల్లిపాయలా పెనవేసుకుపోయిన బంధం వాళ్లిద్దరిది. ఇంటర్‌లో ఎంటర్ కొట్టి కాలేజీలో అడుగుపెట్టగానే మొట్టమొదటగా పలకరించి షేక్‌హ్యాండ్ ఇచ్చింది చందూనే. అలాంటి వాడు సూరీకి ట్రాన్సఫర్ అయిపోయినంతమాత్రాన మరిచిపోయి హ్యాండివ్వడు కదా! కానీ, సూరికి ఏదో అనుమానం.
చందూ చదువులో ఎంత ఫస్టుండేవాడో చత్తర్ బిత్తర్ గత్తర్‌గా అల్లరి చేయడంలో కూడా అంతే ఫాస్టు. చందూతో చాలామంది అమ్మాయిలు మాట్లాడేవాళ్లు. చందూ మాత్రం ఒక్క

అమ్మాయికి కూడా పడలేదు. అతను కొంచెం బక్కీస్ కావడంతో ఫ్రెండ్స్ చందూకి టార్జాన్ అని నిక్‌నేమ్ పెట్టారు. చందూ ఎముకలు తిరిగి బలంగా బోన్‌బిల్డర్‌లా ఉండేవాడు లే.

లైఫ్ ఇతరులకంటే డిఫరెంట్‌గా ఉండాలంటే ఏం చేయాలో ఎలా ఉండాలో ఎలా మాట్లాడాలో అన్నీ సూరికి నేర్పించింది చందూనే. చాలా విషయాల్లో సూరీ చందూ సలహాలమీదే నడుచుకుంటాడు. అందుకే అతన్నుంచి లెటర్ రాకపోడంతో సూరికి ఇంత బాధ. గుండెల్ని పిండేంత బాధ. చందూ ఎందుకు ఉత్తరం రాయడం లేదో ఎంత బుర్రబద్దలు కొట్టుకున్నా సూరికి క్లూ దొరకడం లేదు.

----

రోజులు గూడ్స్ బండిలా కదులుతున్నాయి. చివరకు కాలేజీ ఓపెన్ చేశారు. డిగ్రీ సెకండియర్‌లో చేరిన సూరీ మళ్లీ కాలేజీ జీవితాన్ని ప్రారంభించాడే కానీ మనసు మాత్రం ఇంకా క్షోభను అనుభవిస్తోంది. ఆ బాధ తట్టుకోలేక శరీరం శుష్కించింది. ఐరన్‌లెగ్ శాస్త్రిలా ఉండేవాడు కాస్తా శుభలేఖ సుధాకర్‌లా తయారయ్యాడు.

అందుకు కారణం

ఒక్కటే

ఉత్తరం!

అవును నెలా పదిహేను రోజులు గడిచినా చందూ రాయని ఉత్తరం. దాని కోసమే సూరి చెవులు రిక్కించి పోస్ట్‌మాన్ కోసం చూస్తున్నాడు.

చందూ ఉత్తరం రాయకపోడానికి కారణం ఏమై ఉంటుందా అని తీవ్రంగా ఆలోచించడం మొదలుపెట్టాడు. అదే ప్రశ్న అతన్ని పదేపదే వేధిస్తోంది. ఇంట్లో కాలేజీలో మార్కెట్లో ఎక్కడున్నా అదే ఆలోచన!

ఒకరోజు లెక్చరర్ బీటాలజీ క్లాసులో నోట్సు చెబుతున్నాడు. అంతా నిశ్శబ్దంగా రాసుకుంటున్నారు. సూరి మాత్రం ఎక్కడో ఆలోచిస్తున్నాడు. చేతిలో పెన్ను అతని మెదడులోని ఆలోచనల్లా పిచ్చిగీతలు గీస్తోంది. ఆ టైంలో గనక ఇఇజి (ఎలక్ట్రో ఎన్‌సెఫాలో గ్రామ్) తీస్తే దాన్ని చూసి ఎంతటి న్యూరాలజిస్టయినా నాలిక బయటపెట్టి ఢమాల్‌మని నేలమీద పడికొట్టుకుని చచ్చిపోతాడు. పిచ్చిరాతలు రాస్తూ సూరి తనలో తాను గొణుక్కోడం మొదలు పెట్టాడు.

'చందూ ఎందుకు రాయలేదు'

'చందూ నువ్వు రాయకపోతే నేను బతకలేను'

'చందూ ఎందుకిలా చేశావ్'

'చందూ చందూ చందూ' అంటూ గొణుక్కుంటున్నాడు.

పక్క బెంచీలో సీరియస్‌గా రాసుకుంటున్న అమ్మాయికి ఈ గొణుగుడు వినిపించింది. ఆ పిల్ల కొంచెం అటెన్షన్ ఇటుపడేసి గొణుగుడు విన్నది. అంతే, పాములా లేచి సూరి చెంప మీద ఛఢేల్‌మని పీకింది. అనుకోకుండా సడన్‌గా జరిగిన ఈ హఠాత్‌పరిమాణానికి

సూరి ఫేసు మాడిపోయింది. నోట్లో ఒకేసారి మైసూర్‌బోండా పెట్టుకున్నట్టు చెంపవాచి ఉబ్బిపోయింది.
అంతే....
ఓ రెండు నిమిషాలపాటూ క్లాసంతా గందరగోళం. ఏం జరిగిందో ఎవరికీ అర్ధంకాలేదు. ఎందుకు జరిగిందో కూడా అర్ధంకాలేదు. వాళ్లంతా మాట్లాడుకుంటుంటే నక్కల అరుపులు కుక్కల మొరుగులు కలగలిసిన సౌండ్ వచ్చింది. ఆ శబ్దాన్ని ఛేదిస్తూ...ఆ కొట్టిన అమ్మాయి నోరు విప్పింది. కొంగు నడుముకి చుట్టి గాజులు మోచేతి వరకూ లాక్కొని ఏందిబే అన్న ఎక్స్‌ప్రెషన్ పెట్టి –
'ఏరా వళ్లు బలిసిందా, నీకు అక్కాచెల్లెళ్లు లేరా?' అని అడిగింది.
ఏం జరిగిందో పాఠకులకే కాదు అక్కడ ఉన్నవాళ్లకు కూడా అర్ధం కాలేదు.
మేటరేంటంటే ఆ అమ్మాయి పేరు వెంకట లక్ష్మి నాగమల్లేశ్వర సాయి చాందిని. ముద్దుగా చందూ అని పిలుస్తారు.
సూరిబాబు తన ఫ్రెండయిన చందూని తలుచుకుని గొణుక్కోడం విన్న వెంకట లక్ష్మి నాగమల్లేశ్వర సాయి చాందిని సూరి తనను ఏదో అంటున్నాడని, బనాయిస్తున్నాడని భ్రమపడింది.
దానికి రిజల్టే!
అరటికాయ బజ్జీలా వాచిపోయిన సూరి చెంప.
ఈ సమ్ ఘటనతో సూరి మనసులో చెలరేగుతున్న అగ్నిగుండం మరింత రగులుకుంది. అవమాన భారంతో కుంగి కృశించి బరువు తగ్గిపోయి ఏనుగులాంటోడు పీనుగులా తయారయ్యాడు. చెంపవాపు మాత్రం ఇంకా తగ్గలేదు. గొల్లపూడి మారుతీరావు బుగ్గలా తయారైంది. దాని వల్ల సూరి ముఖం కొంచెం వంకరగా మారింది.
'దీనంతటికీ కారణం చందుగాడే, వాడే గనక ఉత్రం రాసుంటే ఇంతగొడవ జరిగేది కాదు' అని మనసులో అనుకున్నాడు సూరి. ఆ క్షణంలోనే అతని మనసులో చందూ మీద ద్వేషానికి తొలిసారి బీజం పడింది.
----
కానీ, చందూ లెటర్ రాయకపోడం వెనుక బలీయమైన కారణం ఉందనీ, సూరి వాళ్ల పితాకు ట్రాన్స్‌ఫర్ అయి వీళ్లిద్దరూ విడిపోయిన నాటి నుంచీ చందూ సూరీ కంటే పదహారూ పాయింట్ ఏడూ నాలుగు రెట్లు ఎక్కువ క్షోభని అనుభవిస్తున్నాడనీ, బాధ మర్చిపోడానికి లైటుస్తంభం కింద ఊరకుక్క పిల్లని ఒళ్లో కూర్చోబెట్టుకుని బీరులో నీరు కలుపుకోకుండానే రా తాగేస్తున్నాడనీ, కుంచెం కుంచెం తాగి సోలిపోతున్నాడనీ, కడుపులోంచి ఉబికి వస్తున్న కన్నీళ్ల కారణంగా పేపర్లు తడిసి ఉత్తరం రాయలేకపోతున్నాడనీ డనీ డనీ డనీ ఇంకా ఇంకా చాలా నగ్నసత్యాలు సూరికి తెలీదు. తెలిస్తే ఏం జరిగేదో తెలీదు గానీ ఈ కథ మాత్రం ముందుకు సాగేది కాదు.
–కట్

## ఏడోరీలు

మనం కాసేపు యానండ్‌పూర్‌లో ఫేడవుట్ చేసి శాడ్‌పేటలో చందూ ఇంట్లో సీన్ ఓపెన్ చేద్దాం.

'నాయనా చందూ, సూరి అడ్రస్ ఇవ్వు బాబూ ఉత్తరం రాసి పిలిపిస్తాను. అప్పుడైనా నీలో ఆనాటి చందూని చూస్తాను బాబూ చూస్తాను' అంటూ గుమ్మడి మాడ్యులేషన్‌లో కన్నీటితో అడిగాడు చందూ తండ్రి.

చందూ వెంటనే జవాబు చెప్పలేదు. కాసేపు మౌనం వహించాడు. నిశ్శబ్దం రాజ్యమేలింది. దొడ్లో గేదెలు నెమరువేస్తున్న చప్పుడు కూడా వినిపించేంత నిశ్శబ్దం.

కొన్ని థర్డ్‌ల తర్వాత చందూ నోరు తెరిచాడు మౌనాన్ని వీడి.

'వద్దునాన్నా, వద్దు వాడిని పిలిపించవద్దు. నన్నీ స్థితిలో చూస్తే వాడు తట్టుకోలేడు. ఇంట్లోంచి మకాం మార్చి బారులో సెటిలైపోతాడు. వాడసలే స్థూలకాయుడు (సూరి బక్కచిక్కిపోయి శల్యమైన సంగతి చందూకి తెలియదు) తాగిపడిపోయాక ఎత్తుకొచ్చి రిక్షాలో పడేయడం కష్టం. ఒక్కడే కొడుకు అన్నదమ్ములేరు' అంటూ నీరసంగా మత్తుగా మూలుగుతూ గద్గదస్వరంతో చెప్పాడు.

దీంతో వాళ్లనాన్నకు యమా ఖోపం వచ్చింది. పరాగ్గా పడుకున్న చందూకేసి చిరాగ్గా చూసి–

'చావరా చావు, నీకు మాకంటే సూరిబాబే ఎక్కువైనప్పుడు ఈ కొంపను విడిచి వెళ్లిపో. ఏ వీధిలాంపు కిందో ప్లాట్‌ఫాం మీదో పడి ఇలా జీవితాంతం కృశించిపో. నాకసలు మూడో కొడుకు పుట్టలేదనుకుంటాను' అంటూ గుండెమీద చెయిపెట్టి మెలికలు తిరిగిపోసాగాడు. గుండెపోటొచ్చిందని గమనించిన చందూ వాళ్లన్న గిందూ వెంటనే 'బిందూ ఓ టాబ్లెట్ పట్టుకురా' అని అరిచాడు. వెంటనే చందూ చెల్లెలు బిందూ సార్బిట్రేట్ ఇచ్చింది. చందూ వాళ్ల నాన్న తేరుకున్నాడు.

ఇది చూసిన చందూ మారు మనసు పొందాడు. తన సెంటిమెంటు కోసం తండ్రి ప్రాణాన్ని ఫణంగా పెట్టాలా అని ఆలోచించాడు. అతని మనసు 'నిజమే పెట్టకూడదు' అని చెప్పింది. సరిగ్గా అదే టయానికి జనరంజనిలో శ్రోతలు కోరిన పాటలు శీర్షికన 'పోతేపోనీ పోరా ఈ పాపపు జగతిన శాశ్వతమెవరురా' అంటూ పాట వినిపిస్తోంది. దాన్నే సిచ్యుయేషన్ సాంగ్ అంటారు.

ఆ పాట చందూ చెవిని తాకింది. ఒక్కసారి చెవి గోక్కున్నాడు. తర్వాత తలగోక్కున్నాడు. కప్పుకున్న శాలువా గుంజేసి విసిరేశాడు (మంచం మీద పడేలా). బీరు కలిసిన నీళ్లతో నిండిన గ్లాసుని పక్కకి తోసేశాడు. అతని మెదడులో కొత్త నిర్ణయం పొడుచుకొచ్చింది. మోకాలు నిమిరి ఆలోచనలకు మరింత పదును పెట్టాడు. వెనువెంటనే ఆ నిర్ణయాన్ని ఆచరణలో పెట్టాల్సిన విధానం కూడా ఐడియాకి తట్టింది.

ఏమా నిర్ణయం ఏంటా ఐడియా?

ఏం లేదు. 'ఇంతమందిని బాధపెట్టి తానూ బాధపడి ఏం సాధించానబ్బా' అన్న ప్రశ్న చందూ మెదడులో మొలకెత్తింది. మళ్లీ బుర్రగోక్కున్నాడు. గోళ్లకు చుండ్రు తగిలింది. బల్బెలిగింది.
తను కూడా యానండ్‌పూర్ వెళ్లి సూరీ చేరిన కాలేజీలోనే చేరాలని నిర్ణయించుకున్నాడు. సూరీ ఇక్కడ ఉన్నప్పుడు ఛాయ్ మొదలు సినిమా వరకూ ప్రతి ఖర్చుకూ సూరీ మీద వాలిపోయిన అనుభవం ఎలానూ ఉంది. సూరీ కూడా వాళ్లనాన్నని పీడించి పట్టిన పాకెట్ మనీ అంతా ఇతరులకోసం చిమ్మిచిమ్మి ఖర్చుపెట్టే అలవాటున్నోడే. కాబట్టి యానండ్‌పూర్‌లో తను మైంటేన్ అయిపోడం పెద్ద కష్టం కాదనుకున్నాడు చందూ. సో జల్దీగా బయల్దేరి తన స్నేహ డింగీని తిరిగి ఒడ్డునుంచి నీళ్లలోకి లాగడమే తన తక్షణ కర్తవ్యమని నిర్దేశించుకున్నాడు.
నిజానికి చందూ వెంటనే బయల్దేరాలనుకున్నాడు కానీ అద్దంలో తన ఆకారం భీకరంగా కనిపించడంతో నిర్ణయాన్ని వాయిదా వేసుకున్నాడు. మరో కఠిన నిర్ణయం తీసుకున్నాడు. తిరిగి తేటగా పాత చందూలా తయారయి బయల్దేరాలనుకున్నాడు. ప్రస్తుతం తనున్న పరిస్థితిలో సూరి చూశాడంటే వేదన భరించలేక ఏడ్చిఏడ్చి తుంగభద్రకు ఉపనదిని పుట్టిస్తాడని భయపడ్డాడు. పాలు కర్డ్ కోడి ఎగ్స్ మేక మటన్ బాగా తిని పాత స్టేజికి పయనించాలని నిర్ణయించుకుని ఇఖ ఆ పని మీద పడిపోయాడు. కానీ, ఈ నిర్ణయం వల్ల జరిగే ఆలస్యమే కొంపముంచుతుందనీ క్లయిమాక్స్‌ని లేటు చేస్తుందనీ ఆ క్షణంలో చందూ ఊహించలేదు. ఊహిస్తే ఈ కథేలేదు.
–కట్

## ఎందోరీలు

చెంపదెబ్బ ఎపిసోడ్ పరాభవం నుంచి తేరుకోడానికి సూరీకి వారం రోజులు పట్టింది. ఆ వారమంతా కాలేజీకి ఆబ్సెంట్ అయ్యేలా చేసింది. బాబు బాధలో ఉన్నాడని వాళ్ల మమ్మీ కూడా ఏమీ అనలేదు. ఆ వీక్‌లో ఒకరోజు మిట్టమధ్యాహ్నం సూరీ డాబా మీద ఎండలో కుర్చీవేసుకుని కూలింగ్ గ్లాసుల ద్వారా పుస్తకపఠనం చేస్తుంటే ఎక్కడి నుంచో గజ్జెల సౌండ్ వినిపించింది. ఆ సౌండ్‌కి కిందకు చూసిన సూరీ కళ్లకు పక్కింటి కిటికీ అమ్మాయి వీధిలో బండి మీద కూర్గాయలు కొంటూ కనిపించింది. సూరీ తనను చూస్తున్నాడని రూఢీ చేసుకున్న అమ్మాయి బుట్ట అక్కడొదిలేసి పడేసి ధన్‌మని ఇంట్లోకెళ్లింది. సూరీ చకచకా మెట్లు దిగి సైడు బాల్కనీలోకి అడుగుపెట్టేసరికి ఆ అమ్మాయి యాజ్ యూజువల్‌గా సర్ర్ మని శబ్దం చేస్తూ కిటికీ కర్టెన్ ఓపెన్ చేసి తొంగిచూసింది. సూరి అటు చూడగానే కొన్ని సెకండ్లు టైమిచ్చి చూడనిచ్చి పర్ర్‌మనే సౌండుతో కర్టెన్ గుంజేసింది.
సూరి మనసు డైవర్ట్ అయింది. డల్ అయిపోయిన ఫేసులో లైటు వెలిగింది. మొద్దుబారిన మెదడు తిరిగి పనిచేయడం మొదలు పెట్టింది. మెల్లగా నీక్యాప్ రబ్

చేశాడు. మెమొరీ యాక్టివైంది. దానికి రిజల్టుగా సూరికి ఎక్కడో ఎప్పుడో చదివిందో విందో సినిమాలో చూసిందో యాదికొచ్చింది.
'యస్, ఒకమ్మాయి కిటికీలోంచి చూసిందంటే అది లవ్‌లో తొలిస్టెప్పు. చూసి కర్టెన్ లాగేస్తే రెండో స్టెప్పు. మనం చూసినపుడు సిగ్గుపడి నవ్వుకుంటూ లోపలికెళ్లిపోతే మూడోస్టెప్పు. మూసిన కిటికీ మళ్లీ వెంటనే ఓపెన్ చేసి చూసిందంటే నాలుగో స్టెప్పు. దారిలో ఎదురైనపుడు తల దించుకుని ఓ క్షణం నిలబడి చున్నీకి స్కూల్లో నేర్పించే ముడులన్నీ వేసి తలెత్తి చూసిందంటే అయిదో స్టెప్పు. వెనక్కి తిరిగి మనం చూస్తున్నామో లేదో గమనించిందంటే ఆరో స్టెప్పు. ఇన్ని స్టెప్పుల తర్వాత కూడా మనోడు ఓ అడుగు ముందుకు వేయలేదంటే వాడిదే తప్పు. అనగా లస్కుటపా అని అర్థం. ఇక కుర్రోడు చేయాల్సింది ఆ అమ్మాయి వెనుక డప్పుకొట్టుకుంటూ లవ్‌సాంగ్ పాడుతూ తిరగడమే' ఇది గుర్తుకురావడంతో పాలిపోయిన సూరి కళ్లలో కొద్దిగా రవ్వంతంటే రవ్వంత ఆశ చిగురించింది. మళ్లీ వెంటనే 'ఆ మనఫేసుకి లవ్వేంటిలే!' అనుకుని 'ఎందుకైనా మంచిది అటు నుంచి ఇంకా రెస్పాన్స్ ఉంటే అప్పుడు ట్రై చేస్కోవచ్చులే' అని కేసు వాయిదా వేసేశాడు.

----

మరో నలభైఎనిమిది గంటలు గడిచాయి. చెంపదెబ్బనీ చందూ ఆలోచనల్నీ పక్కన బెట్టి రొటీన్‌గా కాలేజీకి వెళ్లేందుకు మెంటల్‌గా ప్రిపేరయిపోయాడు. గడియారం పదికొట్టగానే మెట్లు దిగి స్టార్ట్ చేశాడు–బండి.
ఇంటికి రెండు కిలోమీటర్ల దూరంలోని కాలేజీకి శరవేగంగా కేవలం గంటసేపట్లో చేరింది సూరీ తోడూ నీడా అయిన మోపెడ్. మోపెడ్ శబ్దం విన్న వాచ్‌మన్ కన్‌ఫ్యూజ్ అయిపోయి కష్టపడి ఏకంగా మెయిన్‌గేటే తీశాడు. తీరా మోపెడ్‌ని చూడగానే–
'ఏం బాబూ కొత్త బండా! లారీలా చిన్నగా సౌండ్ చేస్తూ వచ్చింది?' అని వెటకరించాడు. కానీ సూరీ ఆ వెటకారాన్ని గమనించకుండా–
'లేదు తాతా పాతదే. దీన్ని నేను ఒకటో తరగతిలో ఉన్నప్పుడు మా పితా కొన్నారు' మోపెడ్ హెడ్‌లైట్‌ను ప్రేమగా నిమురుతూ ఆర్ధ్రత నిండిన గొంతుతో చెప్పాడు సూరి.
'చెప్పావులే హిస్టరీ. వెళ్లు లోపలికి' ఆప్యాయంగా కసిరాడు వాచ్‌మన్.
సూరి కదిలించాడు మోపెడ్‌ని–సైకిల్‌స్టాండ్ దిశగా!
క్లాసురూంలోకి లెగ్గుపెడుతుండగా 'హలో' అంటూ వినిపించింది. రైటుకి చూశాడు.
'రైటు కాదు లెఫ్టు' మళ్లీ అదేగొంతు ఎక్కడో ఎప్పుడో విన్న గొంతు. గట్టిగా విన్నగొంతు. సూరి లెఫ్టుకు తిరిగాడు. షాక్ తిన్నాడు. చెంపదెబ్బ కొట్టిన చాందిని అలియాస్ చందు కనిపించింది. భయంతో సూరి డింగుమని వెనక్కు గెంతాడు.
వెంటనే మనసులో డైలాగ్ గుర్తు తెచ్చుకుని అన్నాడు.
'చూడండీ చెంపదెబ్బ కొట్టారు. బుగ్గవాచిపోయిందీ తగ్గిపోయిందీ. కానీ..కానీ...హృదయానికి చేశారు చూశారా....ఆ ఘాయం....అది మాత్రం మానిపోదండీ మానిపో...'

డైలాగ్ పూర్తికాకుండానే చాందిని అడ్డుపడింది.
'సారీ, అన్నయ్యా నీ విషాదగాథ తెలియక ఆరోజు నిన్ను కొట్టాను. నన్ను మన్నించాననే దాకా ఇక్కడినుంచి కదల్ను' అంది.
సూరి హృదయం పుల్ల ఐస్ లాగా కరిగిపోయింది. ఫ్లోర్ మీద నీటి చుక్కలు కనిపించాయి కూడా.
కానీ సూరీకి డౌటొచ్చింది. 'నేను చెప్పకుండానే నాదొక విషాదగాధని దీనికెలా తెలిసింది? అమ్మో ఈ కేండెట్ లేడీ గూఢచారి టైపులా ఉంది' అని మనసులోనే అనుకున్నాడు.
పైకేమో 'సరేనమ్మా! సరే! చింతచెట్టు పులుపనీ చీకటంటే నలుపనీ చెప్పందే తెలియని చిన్నపిల్లవి. జరిగింది మర్చిపో. నేనూ వారం రోజుల్లోనే మర్చిపోగలిగాను. మనసు పాడు చేసుకోకు. పద వెళ్దాం. అసలే ఫస్టవరు చాలా ఇంపార్టెంట్ క్లాసు సైటాలజీ! ఆ తర్వాత బీట్‌రూట్ సెంటర్లో బీటాలజీ ప్రాక్టికల్స్ కూడా ఉన్నాయి. ఛలో' చురుగ్గా అన్నాడు సూరి.
'చెట్టంతదాన్ని పట్టుకుని చిన్న పిల్లవంటాడేంటి, వీడేదో తేడా' అని మైండ్లో అనుకుంటూ సూరిని దాటుకుని క్లాసులో తన బెంచీలో కూర్చుంది చాందిని.
----
కాలేజీ విడిచిపెట్టారు. తన బండి తీద్దామని సైకిల్‌స్టాండ్‌కి వెళ్లిన సూరికి అక్కడ గుమిగూడిన గుంపు కనిపించింది. కొంచెం కళ్లు చికిలించి చూస్తే వాళ్లంతా తన బండి పార్క్ చేసిన చోటే ఉన్నారని అర్థమైంది సూరికి. దగ్గరకు వెళ్లి చూస్తే కొంతమంది అమ్మాయిలూ అబ్బాయిలూ తన మోపెడ్‌ను చూస్తూ స్కెచ్‌లు గీస్తూ నిలబడి ఆసక్తిగా చూస్తూ ఇంట్రస్టుగా చర్చించుకుంటున్నారు.
'ఎక్స్‌క్యూజ్ మీ'
సూరిగొంతు విని వాళ్లంతా వెనక్కు తిరిగారు. సూరీ చేతిలో కీ చూసి ఆ మోపెడ్ ఇతనిదేనని అండర్‌స్టాండయిపోయి అతనికేసి ఆరాధనా పూర్వకంగా చూశారు.
'మీదేనా ఈ బండి?' అని కోరస్‌గా అడిగారు వాళ్లు.
'అవున్నాదే' గర్వంగా చెప్పాడు సూరి.
'అబ్బ ఎలా దొరికిందండీ మీకు' కళ్లు పెద్దవి చేసుకుని రెండు చేతులూ మెడదగ్గర పెట్టుకుని అడిగింది ఓ స్టూడెంట్ సుందరాంగి.
'ఊరుకోవే, నువ్వెప్పుడూ ఇంతే, కనపడ్డంలా మెహెంజొదారో తవ్వకాల్లో బయల్పడిన మోపెడ్ ఇది' అంటూ ఎక్స్‌ప్లయిన్ చేసింది మరో అమ్మాయ్.
'చూడు బ్రదర్ ఇంతకీ ఈ మోపెడ్‌ని లండన్ మ్యూజియంలోనా లేక న్యూయార్క్ మ్యూజియంలోనా ఎక్కడ వేలం వేశారు? అసలు పురాతన వస్తువులు సేకరించే హాబీ మీకెప్పటి నుంచి వచ్చింది?' అడిగాడు మరో స్టూడెంట్ ఇంటర్వ్యూ చేసే రిపోర్టర్‌లా పోజుపెట్టి.
'ఆ...ఫండి!'

దిక్కులు పిక్కటిల్లే సూరి అరుపుకు అబ్బాయిలు అదిరిపడ్డాడు. అమ్మాయిలు ఆరడుగుల దూరానికి విసిరేయబడ్డారు.

'ఇది మా నాన్న కొనిచ్చింది. ఏ తవ్వకాల్లోనూ బయటపడలేదు, ఏ మ్యూజియంలోనూ వేలం వేయలేదు. మురిపెంగా మెయింటేన్ చేయడం వల్ల మొద్దుబారిందంతే. దీన్ని అవమానిస్తే ఊరుకోనంతే'

సూరి వివరణతో వాళ్లు సారీ చెప్పారు.

'క్షమించుబాస్ మేం ఇదే కాలేజీలో ఆర్కియాలజీ చదువుతున్నాం. నీ మోపెడ్‌ని చూసి ఇది ఖడ్గతిక్కన డాగర్, శ్రీనాధుడి పెన్ను, షాజహాన్ పెగ్గులా బహుశా యాంటిక్ అయ్యుంటుందని భ్రమించాం. నువ్వేం ఫీలవకు' అంటూ ఎక్స్‌క్యూజ్ చెప్పాడు ఆ టీం లీడర్.

సూరి శాంతించాడు. మౌనంగా బండి పెడల్ తొక్కి స్టార్ట్ చేశాడు. నిశబ్దాన్ని భీకరంగా ఛేదిస్తూ బయల్దేరాడు–ఇంటికి. సూరి కనుమరుగయ్యేదాకా అక్కడే నిలబడి సైలెంటుగా సైడయిపోయారు ఆ విద్యార్థులు.

––––

తన బండికి జరిగిన అవమానం గురించే తలుచుకుంటూ బండితోలుతున్న సూరి మనసులో రోడ్డు మధ్యలో అకస్మాత్తుగా వానపాములా దూరిందొక ఆలోచన. ఇంతకాలం ఒక్క అమ్మాయి కూడా తనను ఎందుకు లైన్లోపెట్టలేదో. అందరూ రాఖీ కట్టి చేతులు దులిపేసుకున్నారెందుకో సూరికి తెలిసిపోయింది. ఇక ముందు అమ్మాయిలు తనను ప్రేమించాలంటే ఏంచేయాలో, ఒక వేళ కిట్కీ అమ్మాయి మరికొన్ని స్టెప్పులు వేశాక వెనక్కి వెళ్లకుండా ప్రివెంట్ చేయడమెలాగో అర్థమైపోయింది. వెంటనే తన మెదడులో ఓ పథకం సిద్ధమవసాగింది. బండితో పాటూ సూరి ఆలోచనలు కూడా ఈసారి ముందుకే సాగాయి.

–కట్.

### తొందోరీలు

తే.గీ. వందసీసీల మోటారు వాహనంబు
లైను వేసేటి హీరోకు లాభకరము
బండిలేకున్న పర్లేదు బాధపడకు
మోపెడెక్కితె మాత్రము మోసమగును–

చిన్నప్పటి ఆ పద్యం గుర్తుకు రాగానే సూరికి అసలు విషయం అర్థమైంది. తను నడిపే మోపెడ్డే తన ప్రేమకి అడ్డమని అదే తన పాలిట శత్రువైందనీ తెలుసుకున్నాడు. ఇప్పటికీ మించిపోయిందేం లేదు. పితాని కాకాపట్టి లేటెస్ట్ కొత్త మోడల్ బైక్ తీసుకోవాలనీ అప్పుడుగానీ అమ్మాయిలు తనను ప్రేమించడానికి కావాల్సిన బేసిక్ అర్హత అమరదనీ సూరి నిశ్చయించుకున్నాడు.

ఇంటికి చేరగానే మోపెడ్‌ని స్టాండ్‌వేయకుండా వదిలేశాడు. అది డబ్బుమని కిందపడి దుబ్బరేపింది. ఆ దుమ్ము సూరి కళ్లల్లోనూ జుట్టుమీద పడటంతో నాలిక్కరుచుకున్నాడు. నాలిక నొప్పిపెట్టింది.
'అసలు ఈ ఫీలింగ్సన్నీ చూపించాల్సింది బయట కాదురా, ఇంట్లో! దట్ టూ పితా ముందు' అని సూరి అంతరాత్మ ప్రబోధించింది.
వెంటనే సూరి సీరియస్ మూడ్‌లోకి మారిపోయాడు. బాస్ తిట్ల వర్షంలో తడిసిపోయిన క్లర్కులా మెట్లెక్కి ఇంట్లో అడుగుపెట్టాడు. ఎదురొచ్చిన అక్కనూ ముందొచ్చిన అమ్మనూ కనీసం చూడనైనా చూడకుండా తన గదిలోకి డైరెక్టుగా వెళ్లిపోయాడు. బూట్లు కూడా విప్పకుండా కాళ్లు బయటా బోడీ బెడ్ మీదా పడేసి అశాంతిగా కళ్లమీద రెండు చేతులూ పెట్టుకున్నాడు.
వాళ్ల మమ్మీ ఏదో రాంగయిందనుకుని లోపలికి వచ్చింది.
'ఏంట్రా ఏమైంది. ఇలా ఉన్నావు?' కంగారుగా అడిగిన మమ్మీ మీద అంతెత్తున కుయ్‌కుయ్ మని లేచాడు సూరి.
'అదేంటి నాన్న అలా అంటావ్. ఏదో కోరుకుని దొరకనోడిలా ఫేసు పెట్టావ్, ఏం జరిగింది' అనునయిస్తూ అడిగింది మమ్మీ.
'ఏం చేయను నా ఖర్మ నా కోరిక ఎప్పుడైనా తీరుద్దా ఈ ఇంట్లో' అలకఫేసుతో అన్నాడు సూరి.
'మన ఇంట్లో తీరకపోతే ఏ ఇంట్లో తీరతాయి నాన్నా, పైగా ఈ ఇల్లు వాస్తు చూపించి మరీ తీసుకున్నాం' ఎక్స్‌ప్లయిన్ చేసింది మమ్మీ.
'యహే నేననేది అదిగాదు' విసుక్కున్నాడు సూరి.
'మరేదో చెప్పు. నీ కోరిక ఎప్పుడైనా మీ డాడీ కాదన్నారా. నువ్వడగాలే గానీ అవనిదంటూ ఉంటదా?' లాజికల్‌గా ప్రశ్నించింది మమ్మీ.
సూరికి కూడా 'అవున్నిజమే కదా, నాకీ ఆలోచన బుట్టలేదే, అడిగిన తర్వాత తీర్చకపోతే సీరియస్ అవ్వాలిగానీ, ముందుగానే ఎందుకబ్బా. నాకేం కర్మ పట్టింది. ఏంటో వెర్రివెంకయ్యని ఈ మధ్య మైండు దొబ్బుతోంది' అని మనసులో అనుకుని మూడ్ మార్చుకుని ప్లెజంట్ ఫేస్ పెట్టాడు.
'మమ్మీ మమ్మీ మరే మరే నాకూ నాకు కొత్త బైక్ కావాలి. కొంచెం డాడీతో చెప్పవా' గోముగా అడిగాడు సూరి.
మమ్మీ ప్రేమతో ఏదో అనబోతుండగా గట్టిగా నవ్వు వినిపించింది. అటు చూస్తే నాగలక్ష్మి, అంటే సూరి అక్క, పడీ పడీ నవ్వుతోంది. ఆపుకోలేకపోతోంది.
'ఏంటీ నా బాధ నీకు నవ్వులాటగా ఉందా' సీరియస్‌గా అడిగాడు సూరి.
నాగలక్ష్మి నవ్వాపుకుంటూ 'హది కాదురా హహహ్హా హది అది కాదురా సూరీ, నువ్వు డైరెక్టుగా.....హహహహహ్హా డాడీనే హహహ్హా హడగొచ్చుగా ఈ మాత్రం దానికి అమ్మ రికమెండేషనా' అంది నవ్వలేకచస్తూనే.

‘ఒరే తమ్ముడూ డైరక్టుగా డాడీని ప్రొసీడైపో నెక్ట్స్‌డే మోర్నింగ్‌కల్లా నీ చేతిలో కీస్ గేటు పక్క బైక్. రెండూ రెడీ’ షి కంటిన్యూడ్ టూ సే.
నాగలక్ష్మక్క చెప్పిన ఐడియా నచ్చింది సూరికి.

––––

ఆఫీసు అయిదింటికైపోతే అయిదూ అయిదుకే ఇంట్లోకి ఎంటరయ్యాడు పీటాంబర్.
సోఫాలో కూలబడి వంగి బూటు లేసులు విప్పుతుండగా సూరి సుడిగాలిలా వచ్చాడు.
‘ఉండండి డాడీ నేనిప్పుతాను’ అని ఆయన కాళ్ల దగ్గర వళ్లొంచి కూర్చుని విప్పడం మొదలు పెట్టాడు. ఈ హఠాత్‌సంఘటనతో పీటాంబర్ ఆశ్చర్యపోయాడు. సూరీ నెత్తిన రెండు నీటిచుక్కలు పడ్డాయి. పైకి చూశాడు. డాడీ కళ్లల్లో నీళ్లు.
‘డాడీ మీ కళ్లల్లో నీళ్లా, నేను మీ బూటు లేసులు విప్పడం చూసి తట్టుకోలేక సంతోషపడుతున్నారు కదూ’ అన్నాడు సూరి.
‘చస్ అలాంటిదేం లేదు, కంట్లో నలుసు పడింది. నువ్వు విప్పేహే’ అన్నాడు పీటాంబర్.
‘ఓహ్ సెంటిమెంటు వర్కవుటు కాలేదన్నట్టు’ అనుకున్నాడు సూరి.
సెంటిమెంట్‌తో కొట్టి మోటర్‌బైక్ కొట్టేయాలనుకున్న సూరి ప్లాన్‌కి ఆదిలోనే అరటితొక్క అడ్డం పడింది. స్లిప్ అయిపోయాడు.
‘సరే డిన్నర్‌టైంలో డాడీకా మూడ్ అచ్ఛా రహతా హై, లెటజ్ ప్రయత్న్ కరేంగే ఉస్ సమయ్‌మే’ అనుకుని సరిపెట్టుకున్నాడు.
సెవెన్‌థర్టీ కొట్టింది. భోజనాలటైంలో డాడీ ప్రేమగా పరవన్నం తింటుంటే సూరి మేటర్ కదిలించాడు.
‘డాడీ’
‘ఊ’
‘మిమ్మల్ని ఒకమాట అడగొచ్చా’
‘అడగరా దాందేముంది’
‘ఏం లేదు మీ కొడుక్కి నలుగురిలో అవమానం జరిగితే సహించగలరా?’
‘అవమానమా, నా కొడుక్కా! ఎవడు వాడు ఛీల్చి ఛెండాడేస్తా’ గర్జించాడు పీటాంబర్.
‘ఆవేశపడకండి డాడీ, జరిగిందంతా పూలుగుచ్చినట్టు వివరిస్తా’ అంటూ గొంతు సవరించుకుని ఆరోజు కాలేజీలో తన మోపెడ్ గురించి జరిగిన సీన్లన్నీ విడియో కేసెట్ వేసినట్టు కళ్లకు కట్టి చెప్పాడు సూరి.
అంతా విన్నాక డాడీ ముఖం గంభీరంగా మారిపోయింది. ఒక క్షణం ఆయన మౌనంగా ఉన్నాడు. ఆ ఒక్క క్షణం సస్పెన్స్‌కే సూరి చచ్చిపోయాడు.
అప్పుడాయన ఫేసు మాములు స్థితికి తెచ్చుకుని సూరి కేసి చూశాడు.
‘ఆఫ్టరాల్ నీక్కావాల్సింది ఓ మోటర్‌బైక్! అంతేకదా. వెళ్లి బెడ్‌మీద బోడీ పడేసి పడుకో. రేప్పొద్దున్న లేచి పళ్లు తోముకునే పేస్టు పక్కనే చూడు. నీ అధునాతన మోడ్రన్ మోటర్‌బైక్ తాళాల గుత్తి కనిపిస్తుంది. ఎత్తి జేబులో పడేస్కో. ఝుమాల్‌మని వేసుకుపో

కాలేజీకి. నిన్నవమానించిన వాళ్ల ముందు బండితోలు' స్పీచ్ ముగించి సింక్ దగ్గర చేతులు కడుక్కుని వెనక్కి చూడకుండా బెడ్రూమ్‌లోకి వెళ్లిపోయాడు పీటాంబర్–నిద్రలో మునిగిపోడానికి.

సూరి కూడా గబగబా భోంచేసి బెడ్‌రూంలోకెళ్లి ముసుగు తన్నేశాడు. ఎంత తొందరగా నిద్రపోతే అంత ఎక్కువసేపు నిద్రపోవచ్చనీ ఎంత ఎక్కువసేపు నిద్రపోతే అంత ఎక్కువగా బైక్‌మీద గాల్‌ఫ్రెండ్‌ని ఎక్కించుకుని ఊటీ ఘాట్‌రోడ్ మీద డ్యూయెట్ పాడుకుంటూ బండితోలినట్టు కలలు కనొచ్చనీ ప్లాన్‌తో చాలా ఎర్లీగా నిద్రపోయాడు.

----

కానీ అంతే ఎర్లీగా నిద్రలేచాడు. వెంటనే బాల్కనీలో సింకు దగ్గరకెళ్లి బ్రష్‌కంటే ముందు పేస్టుకేసి చూశాడు. పక్కనే తళాతళా మెరుస్తూ కనిపించింది–తాళాల గుత్తి! బ్రష్ చేసుకున్నట్టు నటించి తాళాలు తీసేసుకుని స్నానం సాయంత్రానికి వాయిదా వేసి ఇస్త్రీబట్టలేసుకుని సెంటుకొట్టుకుని ఇంటికిందకు వెళ్లి బైకెక్కి కొట్టాడు కిక్!

----

రాకెట్లా రయ్‌మని దూసుకెళ్లి కాలేజీ బైక్‌స్టాండ్‌లో స్టయిల్‌గా సైడ్‌స్టాండేసి కుడికాలుని చాపి బండి సీటు చుట్టూ తిప్పి నేలమీద దిగాడు. తన కిష్టమైన బీటాలజీ క్లాసు మాత్రం విని మిగిలిన క్లాసులన్నీ ఎగ్గొట్టి, రోడ్ల మీద పడి, పెట్రోలయిపోయేదాకా తిరిగి గూటికి చేరాడు. ఇక తను చిన్నప్పుడు విన్న పద్యం నిజమని రుజువైయ్యే టైం వచ్చేసింది. కానీ ఇంత ఇమ్మీడియట్ ఎఫెక్ట్ చూపిస్తుందనీ తన బైక్ తన ఫేట్‌ని ఫస్ట్‌డేనే మార్చేస్తదనీ సూరి ఊహించలేదు. దుమ్ముకొట్టిన ఫేసుని రుద్ది కడిగి, చేతిలో టీ కప్పుతో ఫ్రంట్ బాల్కనీలో నుంచున్న సూరికి ఎదురుగా కిటికీ అమ్మాయి కనిపించింది. ఒక్కటే కాదు. తన పక్కన ఇంకో అమ్మాయి ఉంది. కిటికీ అమ్మాయి అదిగో వచ్చాడు చూడమంటూ తన స్నేహితురాలికి సైగచేసింది. ఆ అమ్మాయి నిర్మొహమాటంగా సూరికేసి చూసింది. కిటికీ అమ్మాయేమో తలవంచుకునే ఉంది.

అప్పుడు సూరికి వాళ్లిద్దరూ మాట్లాడుకున్న మాటలు వినబడ్డాయి. జీవితంలో తొలిసారిగా విన్ని మాటలు. కిటికీ అమ్మాయి ఫ్రెండు మరోసారి సూరిని పరీక్షగా చూసింది.

'ఛీ, బాలకిష్ణ లాంటోడ్ని చూపిస్తావనుకుంటే బక్కోడ్ని చూపిస్తావా వీడినా నువ్వు ప్రేమించేది' అని ఆశ్చర్యపోయింది.

సూరికి 'వీడినా నువు ప్రేమించేది... వీడినా నువు ప్రేమించేది... వీడినా నువు ప్రేమించేది' అనే మాటలు రీసౌండ్‌రీసౌండ్‌గా వినిపించాయి. ఈ డైలాగ్‌తో సూరికి తనను కిటికీ అమ్మాయి టీజ్ చేయడంలేదనీ నిజంగానే ప్రేమిస్తుందనీ అర్థమైంది. వెంటనే ఇంట్లో కెళ్లాడు. ఎవరూ చూడట్లేదని మేక్ ష్యూర్ చేసుకుని బీభత్సంగా యాహూ అని అరుస్తూ ఎగ్గిరి దూకాడు. సూరి గెంతిన గెంతుకి కింద ఫ్లోర్ సీలింగ్ ఊడిపోయింది. దాంతో పాటూ సీలింగ్ ఫ్యాన్ కూడా కిందపడింది. పైగా వాళ్లావిడతో

అసుర సంధ్య వేళ సరసం చేస్తున్న ఆ ముసలాయన మీద పడింది. నడుం విరిగినంత పనైంది.
కట్ చేస్తే కింద నుంచి ఇంటి ఓనరు నడుం పట్టుకుని 'ఎవడ్రా అంత గెంతు గెంతింది' అంటూ పైకొచ్చేశాడు. నిప్పులు చిమ్మే కళ్లతో సూరిని అడిగాడు.
'నువ్వేనా, వచ్చినప్పుడు లావుగా ఉన్నావ్ ఇప్పుడేమో బక్కగా తయారయ్యావ్. అయినా ఏం బలంరా నాయినా. నీ గెంతుకు సీలింగూ సీలింగ్ ఫ్యానూ ఊడిపోయాయ్' అంటూ అంతెత్తున ఎగిరాడు.
సూరికి టెన్షన్ పట్టుకుంది.
'సారీ అంకుల్, ఏదో నా లవ్వు సక్సెస్ అయిన ఆనందంలో....'
'నీ లవ్వు నా కాపురంలో బండలేసిందిరా నాయినా, నీ కసలు ఆ ఫ్యాన్ గురించి తెలుసా, అది మా తాతగారు వాడిన ఫ్యాను ఇప్పటికీ చెక్కు చెదరలేదు. దానికిందే సంసారం చేయడం మా సెంటిమెంట్' ముసలోడి ముఖంలో కోపం తాండవం చేస్తోంది.
'సారీ అంకుల్ ఆ ఫ్యాను నేను బాగు చేయిస్తా'
'రిపేర్ చైడానికి పార్ట్లెక్కడ దొరుకుతాయిరా, అవి దొరక్కపోవాలి, నీ అంతు చూస్తా, నా ఫ్యాను పనికిరాకుండా పోయిందో అప్పుడు నీ వంటి మీద కాదురా మనసు మీద కొడ్తా'
'ఫ్యాన్దేముంది అంకుల్ మీ నడుం సంగతి చూసుకోండి. అది కదా సంసారానికి మెయిన్గా ముఖ్యం' అమాయకంగా టంగ్ స్లిప్పయి ఆయనకు లేనిపోని ఆలోచన తెచ్చాడు సూరి.
దీంతో ఇంటి ఓనరు ఇంకా రెచ్చిపోయాడు.
'అదే జరిగిందంటే నీ బతుకులో నిప్పులు పోస్తా. నీ లవ్వుని నువ్వులనూనె పోసి కాల్చేస్తా. నా సంగతి నీకు తెలీదు, నా సర్కిల్లో ఇంటర్నేషనల్ ఫ్యాక్షనిస్టులున్నారు జాగ్రత్త' వార్నింగిస్తూ వెళ్లిపోయాడు ఓనర్.
తెల్లముఖంతో, కంటిచూపే గానీ నోటమాటలేని కండిషన్లో పడిపోయాడు సూరి.
–కట్.

**పదోరీలు**

ఒకమ్మాయి ఎట్టకేలకు తుట్టతుదకు మొట్టమొదటిగా తొట్టతొలిగా సూరిబాబుని ప్రేమించింది. సూరి కొత్త బైకు ఎక్కిన రోజే ఆ విషయం బైటపడటం యాధృచ్ఛికం కాదు. ఈ ధరిత్రి ఉన్నంత వరకూ ప్రేమించడంలో పెద్దబైకుకు గల ప్రధానపాత్రకు తార్కాణంగా చరిత్రలో ఈ సంఘటన నిలిచిపోతుంది.
తెల్లారింది. లైఫ్ బిగినైంది. బాత్రూంలన్నీ బిజీగా ఉన్న వేళ, సూరి నోటిలో బ్రష్ బరబరా రుద్దబడుతున్న వేళ!
సరిగ్గా అదే సమయంలో....

కిటికీ తెరుచుకుంది. కర్టెన్ సర్రమని పక్కకు తొలగింది. తొంగిచూసింది కిట్కీ పిల్ల. యాజ్ యూజువల్ యాజ్ ఇట్ హేపెన్స్. బట్ ఈరోజు మజావేరు. ఎందుకంటే ఆమె తనను ప్రేమిస్తుందని సూరిబాబుకి తెలిసిన రోజు. భలేమంచి రోజు. పసందైన రోజు.
సూరిబాబు ధన్‌మని అటేపు చూశాడు. నవ్వాడు. ఫస్ట్‌టైం ఇన్ నెలరోజులు.
అటునుంచి రిప్లయి ముద్దుగా నవ్వుతూ వచ్చింది.
మ్చ్...అంటూ ఓ ఫ్లయింగ్ కిస్ కిటికీ వైపు గురిపెట్టాడు.
ఆ ముద్దు కిటికీ దాకా వెళ్లక ముందే సూరి డిప్ప పగిలింది. వెనక్కితిరిగి చూస్తే వాళ్లక్క నాగలక్ష్మి.
'ఏంటక్కా అలా డిప్పమీద జల్లకాయ కొట్టావ్, నేనేం పాపం చేశాను' కొశన్ చేశాడు సూరి.
'పాపం చేయక్కర్లేదు, పళ్లు తోముకునేటపుడు వొళ్లు దగ్గరపెట్టుకోకపోతే చాలు డిప్పమీద ఒకటి పీకడానికి' ఈసడించింది వాళ్లక్క.
'చూడు' అంటూ అప్పుడే కట్టుకున్న పట్టు పరికిణీ చూపించింది. దానిమీద పళ్లు తోముకుంటూ పడేసిన పేస్టు నురగ కనిపించింది.
'అసలు సింక్ దగ్గర నువ్వున్నావని తెలిసీ అద్దంలో చూసుకోడానికి వచ్చాను చూడూ నాదీ బుద్ధి తక్కువ' వాళ్లక్క వాపోయింది.
'సారీ అక్కా, ఏదో కిట్కీ ధ్యానంలో పడీ....'
'ఏంటీ కిట్కీ ధ్యానమా, ఈ మాటెక్కడా విన్లేదే'
'ఆ అదీ...అది పరధ్యానానికి పాలిష్‌డ్ వర్డ్ అన్నట్టు. ఈ మధ్యే బీట్స్‌ఫర్డ్ డిక్షనరీలో కొత్తగా చేర్చిన పదం. అవునూ అదేంటి నీ డ్రస్‌కీ నీ నెక్‌లేస్‌కీ మాచింగ్ కుదర్లేదే! అని మాటమార్చాడు సూరి.
ఒక్కసారిగా నాగలక్ష్మి అటెన్షన్ డైవర్టయిపోయింది.
'ఆ....మాచ్ అవలేదా, బతికించావ్ నేనింకా బయటకు వెళ్లకముందే చెప్పావ్ థాంక్స్' అని చెప్పి బిసబిసా వెళ్లిపోయింది– వేరే చైన్ మెడలో వేస్కోడానికి.
మళ్లీ ఎవరోఒకరు రాకముందే టకటకా కిట్కీ అమ్మాయికి కొన్ని సైగలు చేసి సాయంత్రం ఆరింటికల్లా ఫలానా పార్క్‌కు రమ్మని చెప్పాడు సూరిబాబు.
----
ఎప్పుడు సాయంత్రమవుతుందా...ఫస్ట్‌గాళ్‌ఫ్రెండ్‌తో ఫస్ట్ డేటింగ్ ఎప్పుడు చేస్తానా అని కిందామీదా అయిపోయాడు సూరి. ఆ ఆత్రం నిండిన ఆలోచనలతో ఆ మధ్యాహ్నం సూరికి ఒక్క క్షణమ్మైనా కునుకు పట్టలేదు. ప్రేమలో పడ్డోడికి నిద్రపట్టకపోడం మోస్ట్‌కామన్ సైడెఫెక్టులాంటిదని సూరికి ముందుముందు బాగా తెలుస్తుంది
చందూ ఉత్తరం రాయలేదనే బాధతో

ఆలోచనలతో చిక్కిబక్కగా అయిపోయిన సూరి శరీరంలో రాత్రికి రాత్రే మార్పులు వచ్చి మళ్లీ మునుపటిలా బొద్దుగా అవడం మొదలుపెట్టాడు. దీంతో ఆ అమ్మాయి కూడా 'పోన్లే బక్కోడు కాస్త బండోడవుతున్నాడ'ని సంతోషపడటం గ్యారంటీ.
వాల్‌క్లాక్ ఫైవోక్లాక్ చూపించేసరికి సూరి గుండె నిమిషానికి 117సార్లు కొట్టుకోడం మొదలైంది. బెడ్‌మీద నుంచి బాడీని లేపాడు. కొత్త ఉత్సాహం, కొత్త ఫీలింగూ కలిగింది సూరీకి. ఏదో తెలియని ఉత్తేజం ఆవరించింది మత్తుగా. దాంతో చందూనీ వాడు ఉత్రం రాయలేదనే బాధనీ చెత్తబుట్టలో పడేశాడు. కొత్త జీవితానికి ఆ సాయంత్రం వెల్‌కం చెప్పడానికి రెడీ అయిపోయాడు. ఎందుకైనా మంచిదని అరనిమిషం కూడా స్నానం చేయనోడు అరగంటపాటూ పాటలు పాడుకుంటూ వళ్లు రుద్దుకున్నాడు. తనకిష్టమైన యెల్లో షర్టూ వైట్ బ్యాగీ పాంటూ వేసుకున్నాడు. పాటల కేసెట్టంత పెద్ద బకిల్ ఉన్న వెడల్పాటి బెల్టు పెట్టుకుని పొట్టను కవర్ చేశాడు. ఆ బెల్ట్‌ను సూరిబాబు ఎప్పుడు పడితే అప్పుడు వాడడు. ప్రత్యేకమైన సందర్భాలలో మాత్రమే బయటకు తీస్తాడు. ఎర్రటిసాక్స్ నల్లటి హైహీల్ షూస్ వేసుకున్నాడు. నైన్‌టీన్ సెవెంటీనైన్‌లో వచ్చిన సర్కస్‌రాముడు సినిమా ఈ మధ్య టీవీలో వచ్చింది. ఆ హీరో టేస్టూ తన టేస్టూ మేచ్ అవడంతో ఆ బూట్లు ముచ్చటపడి మురిపెంగా కొనుకున్నాడు. ఫినిషింగ్ టచ్‌గా తను ఎన్నో ఏళ్లుగా పొదుపుగా వాడుకుంటున్న చార్లీ సెంట్ కొట్టుకున్నాడు. అంతా ఓకే కదా అనుకుంటూ అద్దంలో చూసుకుని 'డామిట్ అంతా ఛకాభికా అయిపోయింది' అని తిట్టుకున్నాడు. అంటే రివర్సయిందని అర్థం. స్నానము చేసెను ముఖము కడుగుట మరచెను. వెంటనే సింక్ దగ్గరకు జంప్ చేసి సోప్‌తో ముఖాన్ని రుద్దసాగాడు. కొన్ని నిమిషాలు గడిచాక వెనుదిరిగాడు.
ఇదంతా అబ్‌జర్వ్ చేసిన నాగలక్ష్మక్క స్టన్నయిపోయింది. స్నానం చేసేటపుడు కూడా 'అబ్బా ఇప్పుడు సబ్బేం రుద్దుకుంటాంలే' అని బద్దకించేవాడల్లా రెండంగుళాల సబ్బుని అంగుళం అరగదీసేసరికి ఆశ్చర్యం తట్టుకోలేక శిలలా నిలబడిపోయింది. సూరిబాబు మాత్రం ఇవేమీ పట్టించుకునే మూడ్‌లో లేడు. బ్యాక్ టూ మిర్రర్ వెళ్లి మళ్లోసారి వళ్లంతా చూసుకుని ఓ ముప్పయిరెండు సెకండ్ల పాటూ మురిసిపోయాడు–తన రూపాన్ని చూసుకుని.
ఫినిషింగ్ టచ్‌గా వాచ్ పెట్టుకుంటూ ఒకసారి టైం చూసుకున్నాడు. అంతే సూరి గుండె ఠారుమంది. ముల్లు 5 మీద నుంచి 6 మీదకు చేరి ఆల్రెడీ వన్నవరయింది. అంటే టైమ్ ఏడయింది.
దీంతో సూరి మునుపెన్నడూ లేనంత తీవ్రంగా తనను తాను తిట్టుకోడం మొదలుపెట్టాడు.
'అమ్మో ఇలా తిట్టుకుంటూ ఉండిపోతే ఇంకా లేటయిపోద్ది' అని తేరుకొని కిందకెళ్లి బండెక్కి కిక్ కొట్టి మున్సిపాలిటీ పార్క్ దిశగా దూసుకుపోయాడు.
----

పార్కింగ్‌లో బండి పెట్టి గేటు దాటి అన్నివైపులా చూశాడు.
కనిపించలేదు. సామ్ సే వాలే కిట్కీ మే రహెనే చాంద్ కా తుకడా ఎక్కడా కనిపించలేదు.
అసలు ఏ మూలా కనిపించలేదు.
ఒక్కసారిగా నీరసం వచ్చేసింది సూరిబాబుకి. తన ప్రేమాయణ ప్రారంభోత్సవానికి ఇదొక అపశకునంలా తోచింది. రాయి తీసి కోపంగా నేలకేసి కొట్టాడు. అది బంప్ అయి జంప్ చేసుకుంటూ వెళ్లి తుప్పలచాటున జంటగా కబుర్లు చెప్పుకుంటున్న లవర్స్‌లో ఓ లవర్‌కి తగిలింది. పైగా ఫిమేల్‌కి. ఫలితంగా సూరిబుగ్గ మరోసారి బజ్జీలా వాచింది.
'ఛ ఏం చేసినా రివర్సవుతోంది' అంటూ సూరి తనను తాను మరింత తీవ్రంగా తిట్టుకోడం మొదలుపెట్టాడు. డిప్రెస్ అయిపోయి పార్క్ బయటకు వచ్చేశాడు.
అశాంతితో కసిగా బైక్ కిక్ కొట్టాడు–కాదు కొట్టబోయాడు.
ఇంతలో పిలుపు వినిపించింది 'ఏమండీ' అని. అది ఫిమేల్ వాయిస్ అవడం వల్ల చేత వెనక్కి చూశాడు మన హీరో సూరి. ఆ పిలుపు ఎవరిదో కాదు. హీరోయిన్‌దే.
'ఒహ్ మీరా! మీ కోసం పార్క్‌లో ఎవ్రీ నూక్ అండ్ కార్నర్ తిరిగాను. తుప్పలన్నీ వెతికాను. కనిపించకపోడంతో రిటనైపోయాను. అయాం సారీ లేటయిపోయాను' తనదైన స్టయిల్‌లో ఎక్స్‌ప్లనేషన్ ఇచ్చుకున్నాడు సూరిబాబు.
'అలాగా, నేను కూడా ఇప్పటిదాకా పార్కంతా ఒక్కదాన్నే తిరిగి మీ కోసం వెయిటింగ్ చేసీచేసీ బోరుకొట్టి పల్లీలు కొనుక్కుందామని బండి దగ్గరకెళ్లొస్తున్నా. అంతా నా అదృష్టం వన్ మినిట్ లేటయి ఉంటే మీరు నాకు దక్కేవారు కాదు, అది సరే మీ బుగ్గ ఎరుపెక్కిందేమిటి, ప్రేమలో సిగ్గుతో బుగ్గలు ఎర్రబడాల్సింది అమ్మాయికి కదా?' లెవెల్‌గా అడిగింది కిట్కీ గాళ్.
'ఆ..... అదీ.....దెబ్బా....హబ్బే....హబ్బే అలాంటిదేం లేదు. ఇదీ...ఇదీ...ఆ...గుర్తొచ్చింది. కానీ రేపు చెబుతా దాని విషయం. ఇప్పుడు టైమయిపోయింది. కొత్తలో రోజుకు గంటసేపే ప్రేమించుకోవాలి. ఇవాల్టికిది చాలు ఓకేనా! బై బై సీయూ' అంటూ కిట్కీగాళ్ పిలుపు వినిపించుకోకుండా బైకెక్కి కిక్ కొట్టి వెళ్లిపోయాడు సూరి.
'ఈ కుర్రోడు ఫాస్టనుకున్నా గానీ మరీ కుందేలు టైపులా కనిపిస్తున్నాడే, సరే కొంచెం టైమిద్దాం' అనుకుని వెనక్కితిరిగింది ఆ అమ్మాయి.
కానీ వీళ్లిద్దరి మాటల్నీ చెట్టుచాటున దాక్కుని ఒక గడ్డంగాడు విన్నాడన్న సంగతి వాళ్లకు తెలీదు. తెలిస్తే ఏం జరిగేదో ఆ గడ్డంగాడికి కూడా తెలీదు.
ఇక ముందు ముందు ఏ లస్కుటపా ఉందో. న అల్లా జానే క్యా హోగా ఆగే, నా మౌలా జానే క్యా హోగా ఆగే!
–కట్!

**పదకొండోరీలు**

సూరికి ఆరోజు పగలే కాదు రాత్రి కూడా నిద్రపట్టలేదు. ఒకవైపు ప్రేమలో పడ్డ పరమానందం. మరోవైపు సిగ్గుతో బిగ్గయిపోయిన బుగ్గలా ఎర్రగా యాపిల్స్ కాయంత వాచిపోయిన చెంప గురించి చింత. ఒకటి లెఫ్ట్ నుంచి మరొకటి రైట్ నుంచి వాయించేస్తుండగా ఎప్పటికో పదిగంటలకు గానీ సూరి కన్ను మూతపడలేదు! అప్పటి వరకూ మేలుకొనే గడిపాడు. భరించలేని రాతిరి. చెప్పలేని వేదన. మండిపడి ఎండకాసిన వెన్నెల.

----

ఎలాగైతే నైటు గడిచి తెల్లారింది. లేచీలేవంగనే ముందుగా అద్దం ముందుకు వెళ్లాడు సూరి–వాచిన చెంప ఏ స్టేజిలో ఉందో చూసుకోడానికి. మిర్రర్లో తన రిఫ్లెక్షన్ చూసి బిత్తరపోయాడు. తత్తరపడ్డాడు. 'నేనా నేనేనా నేనూ నేనేనా' అని ఆశ్చర్యం ఆనందం మిక్సయిన ఫీలింగ్కి లోనయ్యాడు. కారణం, పార్కులో చెళ్లుమన్న చెంప పొద్దున్నే చూసేసరికి నార్మలైపోయింది. వరద తగ్గిన గోదారిలా వోల్డ్ పరిస్థితికి వచ్చేసింది. తిరిగి చెంప సుతారంగా మారిపోయింది. ఎగిరి గంతేయబోయి ఫ్లోరింగ్ దెబ్బతినే అవకాశం ఉందని భయపడి తనను తాను సెల్ఫ్కంట్రోలు చేసుకున్నాడు. ఊపూఉత్సాహంతో కాలేజీకి రెడీ అవడం మొదలుపెట్టాడు.

----

ఆ రోజు కాలేజీలో సూరిబాబుని చూసి స్టూడెంట్స్తో సహా లెక్చరర్లూ, క్లర్కులూ, అటెండర్లూ మాత్రమే కాక ప్రిన్సిపాల్ కూడా ఆశ్చర్యపడిపోయాడు. ముందుగా తేరుకున్న ఓ యంగ్లెక్చరర్ ఆశ్చర్యపడిపోయిన ప్రిన్సిపాల్కు చేయందించి లేపి నిలబెట్టాడు.

సూరిబాబు బైకు దిగగానే, హుషారుగా ఈలవేస్తూ

'లవ్వుతూ బతకాలిరా
తమ్ముడూ లవ్వుతూ చావాలిరా
చచ్చినంక ఎవ్వడూ లవ్వలేడురా
చావకముందే లవ్వూ చేయరా'

అని పాడుతూ పుస్తకాలను డప్పులా పట్టుకుని డింకు డకా డింకు డకా మని మ్యూజిక్ కొట్టుకుంటూ,  స్లోమోషన్లో స్వింగ్ డాన్స్ చేసుకుంటూ రావడమే వాళ్లందరి ఆశ్చర్యానికీ ఈ ఉత్పాతానికీ కారణం.

పోన్లే కుర్రాడు ఫస్ట్లవ్లో పడుంటాడులే అని తమకు తాము చెప్పుకుని బట్టలకు అంటిన దుమ్ము దులుపుకొని తమతమ పనులు చూస్కోసాగారు వాళ్లంతా. కానీ ఒక వ్యక్తి మాత్రం ఇంకా అక్కడే నిలబడి ఉంది. ఆ ఎంటర్టైన్మెంట్ను ఎంజాయ్ చేస్తోంది. ఆమె ఎవరో కాదు చాందిని.

ఇదంతా చూసిన చాందిని మెల్లగా సూరిబాబు వెనక్కి వచ్చింది. బొటనవేలిమీద మిడిల్ ఫింగర్ పెట్టి సూరి డిప్పమీద టిక్కుమని కొట్టింది. దాంతో పాట ఆపేసిన సూరిబాబు టక్కుమని ఈలోకంలోకి వచ్చాడు.

'ఏంటన్నాయ్యా, ప్రేమలో పడ్డావా' సినిమా చెల్లెమ్మ టైపులో అడిగింది చాందిని.

'అవునమ్మా నీకెలా తెలిసిందీ' సినిమా అన్నయ్యలా మురిపెంగా అడిగాడు సూరి.

'నీ కళ్లు చెబుతున్నాయి నువు ప్రేమించావని. ఇంతకీ ఆ కేండెట్ పేరేంటి ఊరేంటి?' కొశన్ చేసింది చాందిని.

సూరికి ఏదో వెలిగింది. ముక్కు మీద వేలు పెట్టుకుని, నడుంమీద చేయివేసుకుని ఆకాశం కేసి ఆలోచనగా చూశాడు.

'ఆహా ఏం వెరయిటీ ఎంత వెరయిటీ' తనలో తానే ఆశ్చర్యపోయాడు.

'పేర్లు తెలియకుండానే ప్రేమించుకోడం మొదలుపెట్టిన కపుల్స్‌గా ప్రపంచ రికార్డు స్థాపించే అవకాశం మనకే వచ్చినట్టుంది' అని ఆనందంగా గొణుక్కున్నాడు. అలా రెండు నిమిషాలు తన్మయంలో మునిగిపోయాడు.

చాందిని సూరి భుజం పట్టుకుని కుదిపింది. సూరి సోయిలోకి వచ్చాడు.

'ఏంటమ్మా, మొత్తానికి ప్రేమ ముదిరినట్టుందే, పేరేంటన్నయ్యా అని అడిగితే స్వీట్‌నథింగ్స్ గుర్తొచ్చినట్టున్నాయే' టీజింగ్‌గా అడిగింది చాందిని.

'ఛీ పో చెల్లెమ్మా, నువ్వెప్పుడూ ఇంతే. నాకు సిగ్గేస్తోందమ్మా' అంటూ తుర్రుమని క్లాసురూం వేపు పారిపోయాడు సూరి. తనలో తాను ఓ సారి లాఫుకుని అతడ్ని ఫాలో అయింది చాందిని.

----

ఇక ఆ సాయంత్రం ఊపూఉత్సాహం నిండిన మానసికస్థితిలో పార్కులోకి అడుగుపెట్టాడు సూరి. సూరికోసం ఎదురుచూస్తూ ఏటో చూస్తోంది కిట్కీగాళ్.

'హాయ్ డాలింగ్' వెనకనుంచి నెత్తిమీద కొట్టి టప్‌మని కింద కూర్చున్నాడు సూరి. నన్నుకొట్టే మగాడెవడ్రా అన్నట్టు చూసింది ఆ అమ్మాయి. సూరిబాబు కనిపించలేదు. ఎందుకంటే మనోడు కొంచెం డార్క్‌షేడు. దానికి తోడు ఈవెనింగ్ మసకచీకటి. ఇక లాభం లేదని సూరిబాబే ఆ అమ్మాయి ముందుకు వచ్చాడు.

'హాయ్ స్వీటీ'

బుంగమూతి పెట్టింది అమ్మాయి.

'ఏమ్మా కోపమా?'

'మరి కోపం రాదా, నిన్నా లేటే ఇవాళా లేటే'

'సారీ అయాం సారీ, నీ లాంటి బ్యూటీ పక్కన ఉండేవాడు నీ లెవల్‌కు తగ్గట్టు స్మార్ట్‌గా తయారవ్వాలి కదా, ఆ కార్యక్రమంలో భాగంగా లేటయింది' సర్దిచెప్పాడు సూరి. తనను బ్యూటీ అని అనడంతో ఇంప్రెస్ అయి సర్దుకుంది ఆ కిట్కీగాళ్.

‘అది సరేగానీ మన లవ్‌కి ఓ ఘొప్ప స్పెషాలిటీ ఉంది తెలుసా’ ఎక్సయిటింగ్‌గా చెప్పాడు సూరి.
‘ఏంటది’ నార్మల్ ఫీలింగ్‌తో అడిగింది కిట్కీగాళ్.
‘ఎవరైనా ఫస్ట్ పరిచయం అయినప్పుడు ఏం మాట్లాడుకుంటారు?’
‘నా పేరు ఫలానా మీ పేరు వాట్‌లానా? అని’
‘కదా, మరి నువ్వు నన్ను నేను నిన్ను అలా అడుక్కున్నామా’
‘అడుక్కోలేదే’
‘అంటే పేర్లు అడుక్కోకుండా లవ్‌లో పడిన ఫస్ట్ కపుల్ మనమే కదా’
‘వావ్ నిజమే. మనది ఎంతో యస్పీ లవ్వో’
‘యస్పీ లవ్వేంటి’ సూరి డౌట్ వ్యక్తం చేశాడు.
‘అదే అక్కడ టీస్టాల్‌లో యస్పీ టీ యస్పీ కాఫీ అమ్ముతారే అలాగే మనది యస్పీ లవ్ అంటే స్పెషల్‌లవ్’
‘అబ్బ నీలో ఇంత క్రియేటివిటీ ఉందా....మ్మ్....’ ముద్దుగా అన్నాడు సూరి.
‘సరే ముందు మనం పరిచయం చేసుకుందాం, ఆ తర్వాతే ముద్దయినా ముచ్చటైనా’ ప్రతిపాదించింది కిట్కీగాళ్.
‘సరే, నా పేరు కాజ వెంకట సూర్యనారాయణ పెట్‌నేమ్ సూరి’
‘సరే, నా పేరు పంబా వీరభాగ్యలక్ష్మి పెట్‌నేమ్ భాగీ’
‘సూరీ భాగీ, అబ్బ ఎంత బాగుందో ఈ కాంబినేషన్, లైలామజ్నూ, దేవదా పార్వతీ రోమియో జూలియెట్.....’ చెప్పుకు పోతున్నాడు సూరి
‘ఓయ్ ఓయ్ ఊరుకో వాళ్లంతా లవ్‌ఫెయిలయిపోయిన కేసులు, మనల్ని ఆ సెక్షన్‌లో ఇరికించకు’ అడ్డంగా అడ్డుపడింది భాగీ.
‘య్యా..నువ్వే కరెక్టు, మరిప్పుడేంచేద్దాం’ అడిగాడు సూరి.
‘ఏముంది ఇంతకథ నడిచినా మనం సాంగేసుకోలేదు కదా, పద షూరీ డాలింగ్ పక్కనున్న పొదలో దూరి కాశ్మీరెళ్లి డ్యూయెట్ పాడినట్టు ఊహించుకుని కౌగిలిలో కరిగిపోదాం’ అడ్వాన్సయిపోయింది భాగీ.
‘వద్దు భాఘీ డాలింగ్, ఈ సీజన్‌లో కాశ్మీరెళ్లినట్టు ఊహించుకోకూడదు. కరిగిపోడం కాదు, చలికి గడ్డకట్టి శిలాజం టైపులో మంచులో డిపాజిట్ అయిపోతాం. కొన్నేళ్ల తర్వాత ఎవడో ఒక ఆంత్రోపాలజిస్టు మనల్ని కనిపెట్టి సింపుల్‌గా ఓ పిహెచ్‌డీ కొట్టేస్తాడు’
‘అలాగా అయితే వద్దులే, వాడెవడికో ఎందుకంత ఛాన్సివ్వాలి. మరైతే ఏం చేద్దాం’ అంది భాగీ.
‘ముందు మనిద్దరం ఒకర్నొకరు అర్ధం చేసుకుందాం’ సూరి ప్రపోజ్ చేశాడు.
‘ఎక్కడ అర్ధం చేసుకుందాం?’ ఫేస్‌లో కొశన్‌మార్క్ పెట్టింది భాగీ.
‘ఇక్ కడే ఈ పక్ కనే ఈ తుప్ పల చాటునే కూచుని అర్ధం చేసుకుందాం’ డిక్లేర్ చేశాడు సూరి.

ఇద్దరూ కొంచెం మూలకెళ్లి చెత్తకోసం పెట్టిన పెద్ద కోతిబొమ్మ వెనక ఆనుకుని సెటిలయ్యారు. భాగీ భుజం తగులుతుంటే సూరికి ఎక్కడో జిల్లు మంటోంది.
'ఊ ఇప్పుడు చెప్పు నీ టీ ఇష్టవా కాఫీ ఇష్టవా' ఫస్ట్ కొశనేశాడు సూరి.
'కాఫీ' టక్‌మని చెప్పింది భాగీ
'అరే నాక్కూడా, వావ్' వండరయ్యాడు సూరి.
ఆ తర్వాత ఇద్దరూ టిఫిన్ గురించీ కూరల గురించీ చట్నీల గురించి స్వీట్ల గురించీ మాట్లాడుకున్నారు. అన్నిట్లో ఇద్దరి ఇష్టాలూ ఒకటే అని తేలాక ఇక ఇద్దరూ అలవాట్ల గురించి మాట్లాడుకున్నారు. ఇద్దరూ పొద్దున్న ఎండపడే దాకా లేవరనీ లేచాక గంటన్నర దాకా బ్రష్ చేయరనీ పదింటికి టిఫినూ పన్నెండున్నరకి లంచీ మూడింటికి మళ్లీ టిఫినూ అయిదింటికి పకోడీగానీ కారంబూందీగానీ తింటారనీ ఎనిదింటికి డిన్నరు చేస్తారని ఇలా ఇద్దరి అభిరుచులూ శబరీ గోదారిలా కలుస్తాయనీ తెలిశాక వాళ్లిద్దరి ఆనందం హద్దులు తెగింది. వీటన్నిటికీ మించి వాళ్ళ బంధాన్ని అందమైన అనుభవంగా మార్చే అసలు మేటరొకటుంది.
అదే తెలుగు సీరియల్. కనీసం మూడు సీరియళ్లు చూడకపోతే వాళ్ల కళ్లకు నిద్రరాదు. ఇలా ఒకరినొకరు అర్థం చేసుకోగానే కోతిబొమ్మ దగ్గర నుంచి లేచారు. ఇద్దరూ ఒకరికి దూరంగా ఒకరు కొన్ని గజాలు వెనక్కు నడిచారు. వెంటనే భాగీ పాటందుకుంది.
'సండే అననురా మండే అననురా ఎన్నడూ నీ దానరా, నా రాజా రా ఇటురా' అంటూ కాలుదువ్వింది. ఇద్దరూ ముందుకు పరిగెత్తుకు వచ్చి ఒకరినొకరు గట్టిగా గుద్దుకుని పడిపోయారు. పడిపోయినా అలాగే కౌగిలిలో ఉండిపోయారు. కాసేపటికి వాళ్లకి గుర్తుకొచ్చింది–అది మున్సిపాలిటీ పార్కనీ, పబ్లిక్ రొమాన్స్ నిషేధమనీ. పెనవేసుకున్న చేతులు విడిపోయాయి. భాగీకి సడన్‌గా సిగ్గేసి తలవంచుకుంది.
'ఏయ్ ఏంటమ్మా సిగ్గా, ఇంతకాలం ఏమైందీ సిగ్గు' అంటూ పాత సినిమాలో యంటీయార్‌లా భాగీ ఫేసుని గడ్డం కింద చేయిపెట్టి పైకి లిఫ్ట్ చేశాడు సూరి.
ఆమె కళ్లను చూసి షాక్ తిన్నాడు.
ఇంతసేపూ మత్తుగా ఉన్న ఆమెకళ్లు ఇప్పుడు భీతావహమై ఉన్నాయి.
'ఏంటి డాలింగ్ ఏమైంది' కంగారుగా అడిగాడు సూరి.
అటు చూడు అన్నట్టుగా భయంగా సైగ చేసింది భాగీ. ఆ వైపు చూశాడు సూరి.
గడ్డంగాడు. ముందురోజు సాయంత్రం వీళ్లకు తెలియకుండా వీళ్లను ఫాలో అయిన గడ్డంగాడు. ఈ రోజు ఏకంగా వీళ్ల ముందే ఉన్నాడు. చెట్టుకానుకుని నిలబడి నోట్లో సిగరెట్ పెట్టుకుని! వాడికంటే వాడినోట్లో సిగరెట్ నిప్పు ఇంకా భయంకరంగా కనిపిస్తోంది.
వాడిని ఎక్కడో చూసినట్టయితే అనిపిస్తోంది కానీ ఎక్కడో గుర్తుకురావడం లేదు సూరికి. మొత్తానికి ఎక్కడో ఏదో తేడా మూమెంట్‌లోనే చూసిన గుర్తు.

'సర్లే ఈ రోజుకి ఈ ప్రేమించుకోడం చాలు. ఈ ప్లేస్ చూస్తే నా మనసేదో డీకు శంకిస్తుంది. రేపటి నుంచి లొకేషన్ మారుద్దాం' అన్నాడు సూరి. తల ఊపింది భాగీ. ఇద్దరూ బయల్దేరారు ఇంటికి.
సిగరెట్‌ను నేలకేసి విసిరి కసిగా కాలితో నలిపి కదిలాడు బయటికి ఆ గడ్డంగాడు ఆల్సో.
–కట్.

## పన్నెండోరీలు

సూరికీ భాగీకీ పడిన బంధం రెండు మూడు రోజులకే గడ్డకట్టి గట్టిపడిపోయింది. దాన్ని కరిగించి వాళ్లని విడగొట్టే గట్స్ ఎవరికీ ఉండవన్నంతగా పెరిగిపోయింది. వారి లవ్వుచెట్టు మర్రిచెట్టులా మూడు పార్కులూ ఆరుసినిమాలుగా సాగింది. వాళ్ల లవ్‌స్టోరీకి రెండోవారం పోస్టరు పడిన సందర్భంగా ఇద్దరూ కలిసి పార్టీ చేస్కోవాలని డిసైడ్ చేసుకున్నారు. అనుకున్న ప్రకారం సందుచివర బడ్డీ కొట్టుపక్కన నిలబడి సూరిబాబు కోసం ఎదురుచూడ్డం మొదలుపెట్టింది భాగ్యలక్ష్మి అను భాగీ. 'నాలుగున్నరకల్లా వస్తాను. ఆరుగంటల వరకూ రెస్టారెంట్‌లో ఆ తర్వాత ఏదైనా ఖాళీగా ఉండే సినిమాహాల్లో ఎంజాయ్ చేస్కుంటూ ప్రేమించుకుందాం' అని ప్రామిస్ చేశాడు సూరి. కానీ ఇంతలేటయినా రాలేదు. టైం చూసుకుంది భాగీ. పావుతక్వ అయిదయింది. అమెలో క్షణక్షణానికి అసహనం పెరుగుతోంది. ఇక అది పీక్‌కు చేరే టైంకి తన ముందు డుగ్ డుగ్ డుర్ సక్ జిసిక్ అని పెద్ద సౌండయింది. తిక్కరేగిన పోలీసులు బాష్పవాయుగోళాలు ప్రయోగించినట్టు దుమ్మురేగింది. ఆ దుమ్ము సెటిలయ్యాక బండి మీద కూర్చుని కనిపించాడు సూరి. 'ఎంట్రీ అదిరింది' అని మనసులో అనుకున్న భాగీ సెకండ్ థాట్ లేకుండా ఒక్క సెకండ్‌వేస్ట్ చేయకుండా బండెక్కేసింది.
సూర్ జప్‌మని గేరేసి సుర్‌మని యక్సెలేటర్ రేజ్ చేశాడు.
భాగీ మౌనంగా ఉంది. రైడ్ ఎంజాయ్ చేస్తుందేమోలే అనుకున్నాడు సూరి. రియర్ మిర్రర్‌ను ఎడ్జస్ట్ చేశాడు సూరి. లవర్స్ ఒకరి ఫేసులు ఒకరు చూసుకునే సూపర్ టెక్నిక్ అది. కానీ రియర్ మిర్రర్‌లో పిక్చర్ డిఫెరెంట్‌గా కనిపించింది. భాగీ బుంగమూతితో కూర్చుంది.
'క్యా యార్ పావుగంట ఆలస్యానికే అరకేజీ కోపమొచ్చినట్టుందే అమ్మాయిగారికి'
'రాదా మరి. గంటా రెండు గంటలా? ఏకంగా పావుగంట లేట్ చేశావ్'
'సారీ డోళింగ్ నేనేం చేసినా అది నీ కోసమే. లేట్ కూడా నీ కోసమే. నీకో సర్‌ప్రయిజింగ్ గిఫ్ట్ తెచ్చాను తెల్సా. ప్రేమించుకునే టైంలో అవి ఎంతో పనికొస్తాయి తెల్సా' కేజీ ప్రేమతో చెప్పాడు సూరి.
'అబ్బ నిజమా డాలింగ్, సూరీ డాలింగ్, సూరీ డాలింగ్ అదేంటో చెప్పవా' మూడు లీటర్ల ప్రేమతో అడిగింది భాగీ.

'నేను చెప్పను నువ్వే చూసుకో' పజిలేశాడు సూరి.
'ఎక్కడ పెట్టావో తెలీకుండా ఎలా చూస్తానమ్మా' బుంగమూతి పెట్టింది భాగీ.
'ఓ నిజమే కదూ. ఇదీ పాయింటే. సరే చూస్కో. నా పాంట్ లెఫ్ట్‌సైడ్ జేబు మీద చెయ్యిపెట్టు'
'ఆ పెట్టాను'
'తడుము'
'ఆ తడిమాను'
'ఏమున్నాయ్'
'ఏవో చిన్న స్టీల్‌బాల్స్‌లా ఉన్నాయ్'
'పిచ్చిభాగీ అవే నీకు నా ప్రేమకానుక'
'ఏంటీ ఇనపగుళ్లా'
'అదిగో ... అదిగో అక్కడే బురదలో కాలేశావ్'
'అబ్బ ఏంటో చెప్పు సూరీ. సస్పెన్స్ తట్టుకోలేకపోతున్నా'
'అవి నీ ఫేవరెట్ చిరుతిండి మెటీరియల్'
'ఆ....ఆగాగు చెప్పొద్దు నేనే చెబుతా....అవీ...ఆ అవీ ఆ! పల్లీలూ' చప్పట్లు కొడుతూ చెప్పాలనుకుని బండి మీదనుంచి పడతానేమోనని ఆగిపోయింది భాగీ.
'య్యస్...నా కిస్సుల రాణి ఎప్పుడూ కరెక్టే. బయట కొంటే క్వాలిటీ క్వాంటిటీ రెండూ తక్కువే. పైగా డబ్బులు వేస్టని మా మమ్మీ స్లీప్ చేస్తున్న టైంలో నేనే స్వయంగా డబ్బాలోంచి కొట్టేసి గప్‌చిప్‌గా ఫ్రై చేసుకొచ్చేశా'
'సూరీ యార్ నువ్వు నన్ను ప్రేమిస్తున్నావని తెలుసుగానీ, ఇంత ఇదిగా ప్రాణంకన్నా మిన్నగా ప్రేమిస్తున్నావని ఇప్పుడే తెలుసుకున్నాను' భాగీ బుగ్గమీద రెండు కన్నీటి చుక్కలు జారాయి. అవి ఆనందాశ్రువులు.
బండి కాకా హోటల్‌ముందు ఆగింది. ఇద్దరూ లోపలికి అడుగుపెట్టారు. మూలనున్న టేబుల్ మీద సెటిలయ్యారు.
కుర్రాడొచ్చి' ఏం కావాలి సార్' అని స్పీడుగా మెనూ చదివాడు. వాడి కళ్లల్లో వీళ్లెక్కడి లవర్స్‌రా బాబూ కాకాహోటల్‌కొచ్చారు అన్న చులకన భావం కన్పిస్తోంది.
సూరి అదేం నోటీస్ చేయకుండా 'రెండు ప్లేట్ సాంభారిడ్లీ' ఆర్డరిచ్చేశాడు.
ఇంతలో భాగీ అనూహ్యంగా అడ్డుపడింది. 'రెండు ప్లేట్లెందుకు డాలింగ్, డబ్బుల్స్ వేస్టయిపోతై. నీకో సింగిల్ నాకో సింగిల్ చెప్పు చాలు. కావాలంటే సాంబార్ ఎక్స్ట్రా తీస్కుందాం' అంది.
తనకు కాబోయే శ్రీమతి ఇంత పొదుపరి అని సూరీ ఊహించలేదు.
'అయినా మనకి పొదుపుతో పనేముంది. నేను మా నాన్నకి ఒక్కడినే కొడుకుని కదా' అన్నాడు సూరి.

'లేదు సూరీ నువ్వు ఉద్యోగం సంపాదించి నీ సొంత డబ్బులు జేబులో ఉంచుకోడం స్టార్టయ్యేవరకూ మనం పొదుపునే పాటిద్దాం. నా అసలు తడాఖా అప్పుడు చూద్దువుగానిలే' అంది భాగీ.
ఈలోపులో టిఫినొచ్చింది. తినిలేచారు. బిల్‌కట్టేసి బైక్ ఎక్కేసి కిక్ కొట్టేసి బయల్దేరారు–వేంకటాచలా పిచ్చర్ ప్యాలెస్ దిశగా.
ఇంతవరకూ వాళ్లని ఫాలో అవుతూ అదే హోటల్లో సాంబారిడ్లీ తిన్న ఆగంతకుడు కూడా లేచాడు. నోట్లో బీడీని కిందపడేసి ఆఖరి పొగ ఉఫ్ మని ఊదేసి అదే థియేటర్ దిశగా బయల్దేరాడు. అయితే అతను గడ్డంగాడు కాదు, వేరే వాడు! బట్టతలగాడు.
మరోవైపు గడ్డంగాడు కూడా వీళ్లని ఫాలోఅవుతున్నాడు: మరో సైడు నుంచి.
సూరీ బండి పార్క్‌చేసి వచ్చేసరికి భాగీ టిక్కెట్లు తీసుకుని రెడీగా ఉంది.
'అదేంటీ నేను తీసుకునే వాణ్ని కదా' అన్నాడు సూరి.
భాగీ ఏమీ మాట్లాడకుండా అటుచూడు అంటూ వేలు పెట్టి మగాళ్ల బుకింగ్ కేసి చూపించింది. అరమైలుంది ఆ క్యూ. ఆడాళ్లు తక్కువ మంది ఉన్నారు. అందుకే టిక్కెట్లు తీసుకుంది భాగీ.
హీరోహీరోయిన్లు టెలీఫోన్ బూత్ దగ్గర కలుసుకుని తమ ప్రేమని ఒకరికొకరు ఎక్స్‌ఛేంజ్ చేసుకోడంతో 'బూత్‌లవ్' సినిమా మొదలైంది. పల్లీలు తింటూ పరపరా సొండిస్తూ సిన్మా చూశారు. చివరకు విలన్స్ కూడా అదే బూత్ దగ్గర హతం కావడంతో సినిమా అంతమైంది. అనంతరం బయటకొచ్చాక అలవోకగా రైటుకి చూసిన భాగీ అవాక్కయింది. సూరీని పక్కకి తీసుకెళ్లి 'డాలింగ్ మా అన్నయ్యొచ్చాడు. నేను గప్‌చుప్‌గా సిటీబస్సెక్కి ఇంటికెళ్లిపోతా. రేపు సాయంత్రం చేపల్‌మార్కెట్ పక్కనున్న పార్కులో కలుసుకుని ప్రేమించుకుందాం. ఓకే. బై' అనిచెప్పి ఆన్సర్ కోసం కూడా చూడకుండా బస్టాప్ సైడు మూవయింది.

----

స్కూటర్‌స్టాండ్ నుంచి మోటర్‌సైకిల్ తీస్తున్న సూరి, భుజం మీద చేయిపడేసరికి వెనక్కి తిరిగి చూశాడు.
గడ్డంగాడు!
కొన్ని రోజులుగా వీళ్లిద్దర్నీ ఫాలో అవుతున్న గడ్డంగాడు!
'ఏరా లవ్వునెక్కించుకుని రివ్వుమని దూసుకుపోదామనుకున్నావా' అన్నాడు ఆ గడ్డం.
'చూడండీ మీరెవరో నాకు తెలియదు' మర్యాదగా చిరంజీవి మాడ్యులేషన్‌లో అన్నాడు సూరి.
'ఏంది బే నీకు మర్యాద. నేనెవరో గుర్తురాడం లేదా. ఆలోచించు గుర్తొస్తుంది. ఫోన్‌బూత్, గంటన్నర వెయిటింగ్, ఆడవాళ్ల కన్నీటితో పొంగిన వరదా…'
'అంటే మీరు….'
'ఆ నేనేరా'

'కానీ అప్పుడిలా లేరే' సందేహించాడు సూరి
'లవ్ బ్రేకయినోడు గడ్డం పెంచక ఇంకేంచేస్తాడ్రా. నువు గంటన్నర సేపు ఫోన్లో మాట్లాడేసరికి నేను నా గాళ్‌ఫ్రెండుకి చెప్పిన టైంకి కాల్ చేయలేకపోయాను. ఆ అమ్మాయి చాలా పంక్చువల్. నలందా స్కూల్లో డ్రిల్‌టీచర్. ఒక్క నిమిషం తేడా వచ్చినా సహించదు. దాంతో ప్రేమకారుకి పంక్చర్ అయిందిరా, మా ప్రేమకనెక్షన్ కట్ అయింది. పైగా నాకు వేరే సెటప్ ఉందనీ అందుకే నేను కాల్ చేయలేదనీ అనుమానించింది. అందుకు కారణం నువ్వే. చూస్తా. నీ అంతు చూస్తా. నీ లవ్వు ఎంతకాలం సాగుద్దో అదీ చూస్తా. రెడీగా ఉండు మీ ఇద్దరి జీవితాలతో జజ్జినకడి జనారే ఆడుకుంటా'
అని స్ట్రాంగ్‌గా వార్నింగ్ ఇచ్చాడు.
సూరిబాబుకి మైండ్ బ్లాకయింది. గుండె బేజారైంది. తాళం పెట్టకుండా బైకు కిక్ కొట్టీకొట్టీ చివరకు గుర్తొచ్చి తాళంతో స్టార్ట్ చేసి వెనక్కి తిరిగి చూడకుండా వెళ్లిపోయాడు–ఇంటికి.

----

ఈ సీనంతా బట్టతలగాడు చాటు నుంచి చూశాడు. గడ్డంగాడు కూడా సూరీభాగీలను ఫాలో అవడం అతను ముందే చూశాడు. నిజానికి కాకాహోటల్లో వీళ్లిద్దరూ ఎదురుపడ్డారు కూడా. కానీ, వాళ్లకి తెలీదు ఇద్దరూ సూరీనీ భాగీనీ ఛేజ్ చేస్తున్నారని.
బట్టతలగాడు గడ్డంగాడి దగ్గరకొచ్చాడు.
'హలో నాపేరు రాఘవేందర్ నీతో మాట్లాడాలి. కొంచెం పక్కకొస్తావా' అన్నాడు.
'ఎందుకు' అడిగాడు గడ్డం
'నువ్వు ఎవరిమీద పగబట్టావో నేనూ వాడిమీదే పగబట్టానని నీ మాటలు విని అర్థం చేసుకున్నాను. వయసులో పెద్దవాడిని. నా బుర్రకి నీ భుజబలం తోడైతే మనిద్దరం చాణక్యచంద్రగుప్త టైపులో పగసాధించొచ్చు' వివరించాడు రాఘవేందర్.
'మీరేమంటున్నారో నాకర్థం కాలేదు'
'మందుకొడుతూ మాట్లాడుకుంటే బాగా అర్థమవుద్ది. అదిగో ఆ కనిపించే చవకబార్‌లో కూర్చుందామా' పిలిచాడు రాఘవేందర్.
'ఓకే బైదిబై నాపేరు ఆనంద్, జీవితంలో ఆనందం లేని ఆనంద్' అంటూ షేక్‌హ్యాండ్ ఇచ్చాడు ఆనంద్ అనే గడ్డం గాడు.
–కట్.

**పద్మూడోరీలు**

ఆనంద్, రాఘవేందర్ ఇద్దరూ కలిసి చవకబార్‌లో ఓ మూలనున్న టేబుల్ మీద కూర్చున్నారు. అది నిజానికి టేబుల్‌కాదు నాలుగు ఇటుకల మీద నాపరాయి వేసిన కట్టడం. ఇద్దరూ చెరో ఓల్డ్‌మాంక్ రమ్ ఆర్డరిచ్చారు.
'ఇప్పుడు చెప్పు ఏంటి సంగతి ' అడిగాడు ఆనంద్ ది గడ్డంగాడ్.

'శత్రువుకి శత్రువు మనకి మిత్రుడు అనే సిద్ధాంతం వినలేదా' ఎదురు అడిగాడు రాఘవేందర్ ది బట్టతలగాడ్.
'సిద్ధాంతాలూ గిద్ధాంతాలూ మన దగ్గర కుదరవ్, డైరెక్టుగా పాయింటుకొచ్చేయ్' సిగరెట్ టిప్ మీదున్న బూడిద రాలుస్తూ చెప్పాడు ఆనంద్.
'సరే వస్తున్నా, సూరిబాబంటే నీకు మంటకదూ' పెగ్గు కిందపెట్టి నాలుగు పల్లీలు మంచింగ్ చేస్తూ అడిగాడు రాఘవేందర్.
'మంటకాదు దురద కూడా'
'యస్. మనిద్దర్నీ కలిపే ఐక్యవేదికకు అదే పునాది'
'అంటేవాడు నీ ప్రేమని కూడా నాశనం చేశాడా?' ఎంక్వైరింగ్‌గా అడిగాడు ఆనంద్.
'ప్రేమా ఈగా దేవుడెరుగు ఏకంగా సంసారాన్నే కూల్చేశాడు' వాపోయాడు రాఘవేందర్.
'వాడికంత సీనుందా'
'లేదు అంతసీను లేదు. కానీ, వాడు చేసే పనుల పర్యవసానాలే అదర్స్ జీవితాల్ని కూల్చేస్తుంటాయ్'
'నాకు అర్థం కాలే' పెగ్గుఖాళీ చేశాడు ఆనంద్.
'వివరంగా చెబుతావిను' మరో సిగరెట్ వెలిగించాడు రాఘవేందర్.
మరో రెండు పెగ్గుల రమ్ము వచ్చింది. వాటిలో ఇద్దరికీ కొంచెం కొంచెం థమ్సప్‌అప్‌పోశాడు సర్వర్.
పెగ్గు చేతబట్టి మొదలుపెట్టాడు రాఘవేందర్.
'నేనెవరో కాదు వాళ్లింటి ఓనర్‌ని. మాది కొంచెం పాతబంగళా. ఉద్యోగం లేక మా నాన్న ఇచ్చిన బంగళా అద్దెతోనే బతుకుతుంటా. సూరీ వాళ్ల డాడీ పెద్ద ఆఫీసరు. మా ఇంటిమీద రెంటుకుంటారు. మొన్నమొన్నే వచ్చారు. మా ఇంట్లో ఓ సీలింగ్ ఫ్యాన్‌ఉంది. దానికిందే సంసారం చేయడం మా తాతలనాటి నుంచీ వస్తున్న సంప్రదాయం. మా అవిడకు దానికిందే కొంచెం ఇదొస్తుంది. అలా అది డబల్‌సెంటిమెంట్ ఫ్యాన్‌గా మారింది. సీలింగ్ కొంచెం వీక్ కావడం వల్ల మేం ఒక ప్రత్యేకసందర్భంలో మాత్రమే దాన్ని పొదుపుగా వాడుకుంటాం. ఈ సూరిగాడు తనను ఒకమ్మాయి, ఆ పిల్లది కూడా మా పక్కిల్లేలే, ప్రేమిస్తుందని తెలిసి ఆనందం పట్టలేక ఎగ్గిరి దూకాడు. ఆ టైంకి నేనూ మా ఆవిడ ఓ ప్రత్యేకసందర్భంలో ఆ ఫ్యానుకిందే ఉన్నాం. వాడి గెంతుకి ఆ ఫ్యాను ఊడి నా నడ్డిమీద పడి బంప్‌కొట్టి జంప్‌చేసి నేలమీద పడి పగిలిపోయింది. పోన్లే పురాతనమ్మైనది రిపేర్ చేయించివాడుకోవచ్చులే అని మంచి మూడ్‌లో ఫ్యాన్‌ని మెకానిక్ దగ్గరకు తీసుకెళ్లాను. అతను నాకో ఘోరమ్మైన నిజం చెప్పాడు. ఆ ఫ్యాన్ని అమెరికా పంపినా రిపేర్ చైడం కష్టమన్నాడు. దాన్ని బాగుచేసే మగాడు ఈ భూమ్మీద పుట్టడడానికి కనీసం ఒక శతాబ్దం పట్టొచ్చన్నాడు. మా ఆవిడ ఆ ఫ్యానుకింద తప్ప మరో చోట కాపురం చేయనని భీష్మించుకు కూర్చుంది. ముట్టుకుంటే మసి చేస్తానని బెదిరిస్తోంది. సరే ఒకసారి ఏదో కన్విన్స్ చేశాను. నడుంలో ఏదో కలుక్కుమంటే పక్కకు తిరిగాను. ఇంకా పట్టేసింది.

వెంటనే రిక్షా పిలిపించుకుని డాక్టర్ తిమిరం దగ్గరకు వెళ్లాను. ఆయన నా బతుకు చీకటైపోయే సంగతి చెప్పాడు. ఫ్యాన్‌లాగే నన్ను కూడా 'ఆ' విషయంలో ఏ డాక్టరూ రిపేర్ చేయలేడని నా గుండె పగిలేలా చెప్పాడు. అప్పటి నుంచీ నేను పగతో రగిలిపోతున్నాను. ఏ లవ్వు కారణంగా నా సంసారంలో నిప్పులు పోసాడో ఆ లవ్వునే తగలబెట్టాలని నిర్ణయించుకున్నాను. నన్ను కొట్టకూడని చోట దెబ్బకొట్టిన ఆ సూరిగాడి జీవితం మీద దెబ్బతీయాలని, వాడిని మానసికంగా చిత్రవధ చేయాలని కంకణం కట్టుకున్నాను'

మూడు నిమిషాల స్పీచ్ ముగించి ఓ సిప్ వేశాడు పెగ్గులోని రమ్ముని.

ఇక ఆనంద్ మొదలుపెట్టాడు. తనది ఫిజికల్ ప్రాబ్లెమ్ కాదు ఎమోషనల్ ప్రాబ్లెం. తొక్కలోది రాఘవేందర్‌కి ఆల్రెడీ సెవెంటీ పర్సెంట్ లైఫ్ అయిపోయింది. తన ఫ్యూచరే ఛకాభికా అయిపోయింది. తనెంత ప్రతీకారంతో రగలిపోవాలి ఈ లెక్కన!

'నేను మున్సిపల్ జూనియర్‌కాలేజీలో గత కొన్నేళ్లుగా చేస్తున్నాను' తన కథ విప్పుతున్నాడు ఆనంద్.

'ఏంటి ఉద్యోగమా' అడ్డుతగిలాడు రాఘవేందర్.

'కాదెహే సీనియర్ ఇంటర్. ఏడాదికో పేపర్ కంప్లీట్ చేసుకొస్తున్నాను'

'సరే చెప్పు'

'నా జూనియరొకమ్మాయిని నేను ప్రేమలో పడేశాను, నేను లవ్‌లో బిజీగా ఉంటే ఆ అమ్మాయి చదువులో బిజీ అయిపోయి నన్ను దాటి నాకు సీనియరైపోయింది. అయినప్పటికీ లవ్ మాత్రం చేస్తూనే ఉంది. లవ్ గురించి తనకు కొన్ని ఖచ్చితమైన అభిప్రాయాలున్నాయి'

'ఖచ్చితమైన అభిప్రాయాలున్నాయి.....ఈ డైలాగ్ వేరే అకేషన్లో కూడా విన్నట్టుందే' బుర్రగోక్కున్నాడు రాఘవేందర్.

'బుర్రగోక్కోకు సార్ ఉన్న వెంట్రుకలు ఊడిపోతాయి, మామూలుగా సినిమా హీరోయిన్లు ఎక్స్‌పోజింగ్‌పై నాకు కొన్ని ఖచ్చితమైన అభిప్రాయాలున్నాయి. పాత్ర డిమాండ్ చేస్తే తప్ప ఎక్స్‌పోజింగ్ చేయను అని ఇంటర్వ్యూల్లో చెబుతుంటారు. ఇప్పుడు నీకదే గుర్తొచ్చిఉంటుంది'

'కరెక్టే. కరక్టే. ప్రొసీడ్' సిగ్నలిచ్చాడు రాఘవేందర్.

'ఆ అమ్మాయి ఎంతటి నిరుపేదనైనా ప్రేమిస్తుంది కానీ టైం పాటించకపోతే వదిలేస్తుంది. అంతకు ముందు ఒకరిద్దరు ఇలా దెబ్బతిన్నారు. ఒకడైతే ఈమె చెప్పిన టైంకి ఇంకో కాండేట్‌తో పార్కులో స్పెండ్ చేస్తూ టైం మర్చిపోయాడు. ఆ దెబ్బకు వాడ్ని తూచ్ అనేసింది. నేను చాలా కష్టపడి ఆమెను లైన్లో పెట్టాను. నా బాడీకి ఏమాత్రం పడని పంక్చువాలిటీని అలవాటు చేశాను. ఒక్కసారి నేను మూడు నిమిషాల ఇరవైమూడు సెకండ్లు లేటు చేస్తే చుక్కలు చూపించింది. ఎలాగో బతిమాలి సెట్ చేసుకున్నాను. కానీ, మొన్న ఆ సూరిగాడు టెలీఫోన్ బూత్‌లో దూరాడు. లోపల తలుపేసుకున్నాడు. గంటసేపు ఏడ్చుకుంటూ ఎవరికో ఫోన్ చేశాడు. తలుపులు బాదుతున్నా వాడు

తీయలేదు. సో నేను చెప్పిన టైంకి నా గాళ్‌ఫ్రెండుకి ఫోన్ చేయలేకపోయాను. తను అక్కడ బూత్ ముందు వెయిట్ చేసీ చేసీ కోపంతో వెళ్లిపోయింది. దాంతో ఆ అమ్మాయి నన్ను కూడా అంతకు ముందు డింకీ ఇచ్చినోడితో కలిపేసింది. నా జీవితం నుంచి దూరంగా వెళ్లిపోయింది' గొంతుపూడుకు పోయి కళ్లల్లో నీళ్లు తిరుగుతుండగా తన కథ చెప్పాడు ఆనంద్.

ఇద్దరూ అక్కడున్న టిష్యూ పేపర్ తీసుకుని కళ్లు తుడుచుకున్నారు. విషాదంలో తాగేశారు. కానీ, ఒకరి కథలు ఒకరు విన్నాక విషాదం పెరిగింది. అందుకని ఆ బాధలో మరో రెండేసి పెగ్గుల రమ్ము ఆర్డరిచ్చారు. కాస్త జోష్ వచ్చాక. ఇక సూరీ జీవితంలో నిప్పులు పోసే పథకానికి ప్రాణప్రతిష్ట చేయడం మొదలుపెట్టారు. ఒకరి చెవిలో ఒకరు చాలా ఐడియాలు చెప్పుకున్నారు. కానీ, దేనిమీదా టార్గెట్ కుదరలేదు. చివరికి రాఘవేందర్ ఎగ్గిరి గంతేశాడు.

'కమాన్! కత్తి లాంటి ఆలోచన వచ్చింది' అంటూ ఆనంద్ చెవిలో గుడుగుడుమని చెప్పాడు.

ఆనంద్‌కి ఎక్కడో కొట్టింది. ఇది కొంచెం పాతయిడియానేమో అనిపించింది. కానీ క్లిక్కయితే వన్‌షాట్ టూ బర్డ్స్ అని ఎక్సయిటయిపోయాడు.

'అబ్బ! నీ డిప్పకాయలో ఉంది మెదడా ప్లాటినం ముద్దా, సూపర్ ఐడియా బాబాయ్. ఈ దెబ్బతో సూరిగాడి ప్రేమ బార్ అండ్ రెస్టారెంట్‌కు చేరాల్సిందే. ఎంతయినా సీనియార్టీ సీనియార్టీయే' మెచ్చుకున్నాడు ఆనంద్.

'మనం ఒకర్నొకరు లీజర్‌గా పొడుగుకుందాం. ఇప్పుడు ఈ పథకం ఆచరణలో పెట్టడం గురించి ఆలోచించు'

'ఆలోచించడానికేముంది. ఇవాళే ఈ రాత్రికే'

బదులుగా థమ్సప్ చూపించాడు రాఘవేందర్.

రిటన్‌లో థమ్సప్ చూపించాడు ఆనంద్.

గ్లాసుల్లో మిగిలిన ఆఖరి రమ్ముని బాటమ్స్ అప్ చెప్పి మింగేసి ఇద్దరూ లేచారు. ఒకళ్ల వీపుకి ఒకళ్లు ఆనుకున్నారు. వెనక్కి చూడకుండా ఆనందంతో గెంతుకుంటూ బయటకు వెళ్లిపోయారు–పథకాన్ని ఆచరణలో పెట్టడాన్కి.

–కట్.

**పద్నాలుగోరీలు**

టిర్రింగ్ టిర్రింగ్.....

మోగుతున్న ఫోనుకేసి చదువుతున్న పేపర్లోంచి కళ్లు పక్కకి తిప్పిచూశాడు పీటాంబర్ అను సూరిబాబు గారి పిత.

జస్ట్ అంతకు ముందే బియస్సెన్నెల్ వాళ్లొచ్చి లాండ్‌లైన్ ఫిక్స్‌చేసి వెళ్లారు.

‘ఇదేందిరోయ్ బాబో, అప్పుడే మన్నెంబరు ఎలా తెలిసిపోయిందీ జనాలికీ’ అని ఆశ్చర్యపడిపోతూ ఫోనెత్తాడు పీటాంబర్ ఉరఫ్ పీతాంబరం.
‘హలో ఎవరు’
‘నేనెవరో తర్వాత తెలుస్తుందిగానీ, మాట్లాడేది పీతాంబరమేనా’
‘యేస్ పీటాంబర్ స్పీకింగ్’
‘స్పీకుదువుగాన్లేరా ముందు నీ నోట్లో పైపుతో ఓ గట్టి దమ్ములాగించు. నేను చెప్పేది విన్నాక దమ్ముకొట్టడానికి నువ్వు బతికుండవ్’
‘ఏయ్ ఎవడ్రా నువ్వు రాస్కెల్, ఈ పీటాంబర్ అంటే ఎవడో తెలిసే మాట్లాడుతున్నావురా’
‘ఆగక్కడ....ఇది తమిళ్నాడు కాదు ఓవరాక్షన్ చైకు. ముందు నేన్చెప్పేదిను. నీ ఆస్తి మొత్తం కలిపితే ఎంత?’
‘రెండు కోట్ల డెబ్బయిమూడు లక్షల పదిహేడు వేల ఆరొందల నలభైఎనిమిది రుపాయలు’
‘నువ్వు టాపు, కరెక్టు ఫిగర్ మెయింటేన్ చేస్తున్నావ్, సరేవిను. నువ్వింతకాలం గోర్నమెంట్ సర్వీస్‌లో కష్టపడి పోగేసిన ఎమౌంటుంది చూశావ్, దానికి నీ కుమారరాజా ఎర్త్ పెట్టాడు. ఒకసారి లెఫ్ట్‌సైడు కిటికీలోంచి చూడు. కన్పిస్తుందా పక్కిల్లు? అందులో ఉండే ముసలాయన కూతురు నీ కిస్సుల సన్ను సూరిబాబుని విజయవంతంగా లైన్లోపెట్టింది. లక్షల కట్నం తెస్తాడనుకున్న కొడుకు పైసా కూడా మిగల్చడు. చివరికి నీ కొడుకు ఓ అనామకురాలికి నీ ఆస్తంతా ధారపోస్తాడు. అదసలే మంచిది కాదు. ఎన్నో సంబంధాలొచ్చి ఎగురుకుంటూ తిరిగెళ్లిపోయాయి. అదువులో పెట్టుకో నీ కొడుకుని. లేకపోతే చివరికి వాడు ఆరిపోడమే కాదు నిన్ను కూడా డింగుమని ముంచేస్తాడు’
వార్నింగ్ ముగించి ఫోన్ పెట్టేద్దామకుంటున్న మూమెంట్‌లో రాఘవేందర్ చెవులు పిక్కటిల్లేలా, దిక్కులు చిల్లుపడేలా వినిపించింది వికటాట్టహాసపు నవ్వు.
రాఘవేందర్ ఆశ్చర్యపోయాడు. ‘నీ కొడుకు చేస్తున్న నిర్వాకం తెలిసి పిచ్చిపట్టి ఏడవలేక నవ్వుతున్నావా’ అనడిగాడు పీటాంబర్‌ని.
‘లేదురా వెర్రిఫేసోడా, శుభవార్తని హెచ్చరికలా చెప్పిన నీ సెన్సాఫ్ హ్యూమర్‌కి నవ్వుకాక వెక్కిళ్ళొస్తాయా ఏంటిరా’ హుంకరించాడు పీటాంబర్.
‘ఏంటీ ఇది శుభవార్తా? సీరియస్‌గా చెబితే సెన్సాఫ్ హ్యూమరంటావా. మతిపోయిందా’
‘మతిపోయింది నాక్కాదురా నీకు. సూరిబాబు పుట్టినప్పడి నుంచి వాడి షేడూ బాడీ చూసి పెళ్లి చేసుకోడానికి ఏ పిల్ల ముందుకొస్తుందా అనే దిగులుతోనే ఇన్నాళ్లూ గడిపాను. ఇప్పుడు ఓ అమ్మాయి ఏకంగా వాడితోనే లవ్వులో పడిందంటే, శుభవార్త కాక ఇంకేంటిరా’ చెప్పుకుంటూ పోతున్నాడు పీటాంబర్. కానీ రాఘవేందర్ వినడం ఎప్పుడో మానేశాడు. రిసీవర్ పబ్లిక్‌బూత్‌లో వేలాడుతూనేఉంది. పీటాంబర్ క్యాసెట్ నడుస్తూనే ఉంది.

----

'బాబాయ్ ఏమైంది?' తింటున్న పల్లీల పొట్లం బెంచీ మీదే వదిలేసి రాఘవేందర్‌కి ఎదురెళ్లాడు ఆనంద్.

'అంతా ఛకాభికా అయిపోయింది' వచ్చి నీరసంగా పార్కుబెంచీ మీద కూలబడ్డాడు రాఘవేందర్. ఫాలో అయ్యాడు ఆనంద్.

'హుహ్....మా వాడి ఫేసు ఒకమ్మాయికి నచ్చడమే రికార్డు ప్రేమలో పడటం గిన్నిస్‌కన్నా గ్రేట్ రికార్డు. ఏం చేస్కుంటావో చేస్కో ఫో అన్నాడు వాడి బాబు. అది సరే నీ పథకం ఏమైంది. ఏమన్నాడు భాగీ వాళ్ల పిత?' ఎంక్వైరీ చేశాడు రాఘవేందర్.

'హుమ్...ఏం చెప్పను బాబాయ్. నేనూ నీలాగే దెబ్బతిన్నాను' నిట్టూర్చాడు ఆనంద్.

'ఏంటి నీ ప్లాన్ కూడా డెడ్ అయిందా...'

'క్రిమేషన్ కూడా అయిపోయింది.....అనుకున్న ప్లాను రివర్స్‌గేర్‌లో పడింది. భాగీ వాళ్ల నాన్నని డైరెక్టుగా ఇంటికెళ్లి కలిశాను. నీ కూతుర్ని పక్కింటి 'గ్లామర్‌బోయ్' వల్లో వేసుకున్నాడు. వాడసలే మంచోడు కాడు వాడుకుని వదిలేసే టైపోడు. మీ అమ్మాయి నా చెల్లెలితో సమానం. తన జీవితాన్ని కాపాడాలనే ఉద్దేశంతోనే మీకు చెబుతున్నా. అని రెండు టన్నుల సెంటిమెంట్‌ని లారీలోంచి సిమెంటు బస్తాలు దించినట్టు దించాను. కానీ వాడు ఉఫ్ మని ఊదేసి ఉరుములా నవ్వేసరికి ఆ సౌండుకి ఇంటిముందున్న షెడ్డు కూలింది. ఇదిగో దెబ్బ' అంటూ బొప్పికట్టిన తలకాయ్ చూపించాడు ఆనంద్.

'పిచ్చోడా అంతా నాకు తెలుసురా. కొంచెం స్ట్రాంగ్‌గా చెప్పాలంటే, నా కోపరేషన్‌తోనే అది ఈ లవ్ ఆపరేషన్ చేస్తుంది' అని సీక్రెట్ చెప్పాడు. ఇంకా ఏమన్నాడో తెలుసా, 'నా కూతురు ఐదు సమత్సరాలుగా ఎవర్నైనా ప్రేమిద్దామని ఎతుకుతుంది. ఇన్నాళ్లకు ఒకడు పడ్డాడు వాడిని కూడా విడదీద్దామని వచ్చావా నీలాంటి దొంగ అన్నయ్యల్ని చాలామందిని చూశా॥నా' అని నడ్డిమీద ఒకటిచ్చాడు. ఐరన్ ఫ్రేం లాంటి నా నడ్డి నాలుగు ముక్కలైంది. వాడి ప్రేమ కూలిపోను. ఇప్పుడు నా నడుం కూడా నీ నడుంలానే అయితే నా భవిష్యత్తేంటి బాబాయ్' అని ఏడవడం మొదలుపెట్టాడు ఆనంద్.

'డోంట్ వర్రీ. నాకంటే ఎలాగూ వయసయిపోయింది. ఒకవేళ నీ నడుంకు జరగరాని డామేజ్ జరిగినా భయం లేదు. మంచి డాక్టర్లున్నారు. ఆపరేషన్ చేసి సెట్ చేస్తారు. ఏజ్ ఈజ్ ఆన్ యువర్‌సైడ్' ఆనంద్ భుజం మీద చెయ్యేసి భరోసా ఇస్తూ చెప్పాడు రాఘవేందర్.

'ఓకే టాంక్యూ, మరి మన పగతీరేదెలా! వాడి బతుకులో నిప్పులు పోయాలనే మన ఆశయం నెరవేరదా?' నిరాశగా అడిగాడు ఆనంద్.

'డోంట్‌వర్రీ ఇంత పెద్దప్లానే ఫెయిలైందంటే కథ క్లయిమాక్స్‌కు కొంచెం ఎర్లీగానే వచ్చేసిందన్నట్టు. బ్లాక్‌మెయిలింగ్ ఫెయిలయితే హింసని ప్రవేశపెట్టాలి. ఇలాంటి టైంలోనే మా జబ్బల్ భాయ్ ఇక్కడుండాలి. వాడు జబ్బ చరిస్తే గుండాగి ఛస్తారు శత్రువులు' చెప్పాడు రాఘవేందర్.

'జబ్బలా వాడెవడు?' అడిగాడు ఆనంద్.

'వాడు నా క్లాస్‌మేట్. బాబీ అని నిక్‌నేమ్‌తో పిలిచే వాళ్లం అంటే బాడీ బిల్డర్‌కి షార్ట్‌ఫామ్. ఆంధ్రాయూనివర్సిటీలో ఆంత్రోపాలజీ చదువుతున్న రోజుల్లో ఫిజికల్ ఆంత్రోపాలజీ లాబ్‌లోంచి ఓ ఆస్ట్రలోపితికస్ జాతి మానవుడి పుర్రెని కొట్టేసి కోట్లు సంపాదించాడు. ఆ తర్వాత ఇలా యాంటిక్ పుర్రెల స్మగ్లింగ్‌లో ప్రపంచంలోనే పెద్ద మాఫియాగా ఎదిగాడు. లాస్టియర్ కాంటాక్టులోకి వచ్చాడు. నీకేం ప్రాబ్లెమున్నా ఫోన్ చేయమన్నాడు. పద బోంబే ఫోన్ చేసి జబ్బల్‌సింగ్‌ని పిలిపిద్దాం' ఫోన్‌బూత్ దిశగా దారితీశాడు రాఘవేందర్.

'యస్టీడీ అంటే బిల్ ఎక్కువౌద్దిగా...' నసిగాడు ఆనంద్.

'ఇద్దరం ఫిఫ్టీఫిఫ్టీ పెట్టుకుందాం' పరిష్కరించాడు రాఘవేందర్.

ఇద్దరూ ముందుకు కదిలార్.

–కట్.

## పదహైదోరీలు

ఇక శాడ్‌పేటకెళ్తే యానండ్‌పూర్‌లో ఇంత లస్కుటపా జరుగుతున్న సంగతి చందూకి తెలియదు. సూరికి ట్రాన్స్‌ఫర్ అయిన తర్వాత చందూ కూడా తీవ్ర మానసిక క్షోభకి గురయ్యాడు. ఎడబాటు భరించలేక ఎండురొయ్యలా తయారయ్యాడు. దానికితోడు బయటెక్కడో పెసరట్టు తినడంతో స్టమక్ అప్‌సెట్ అయింది. కుంగిపోయాడు. కుళ్లిపోయాడు. ఫలితంగా సూరికి ఉత్తరం రాయలేకపోయాడు. రాద్దామని ప్రయత్నించినా ఉత్తరం చూసి, వాడు ఎక్కడ తనను చూడ్డానికి వచ్చేస్తాడో, వచ్చి ఈ స్థితిలో చూడలేక ఎంతగా కుమిలిపోతాడోననే భయంతో ఉత్తరం రాయలేదు. పోనీ రాద్దామని ప్రయత్నిస్తే కన్నీళ్లకు తడిసిపోతున్న కాగితాలను వాడలేక వాయిదా వేశాడు. విచిత్రమేంటంటే సూరి కూడా ఇంతే మానసికక్షోభ అనుభవించాడనీ తనుకూడా ఎడబాటు భరించలేక ఎండిపోయి ఎండురొయ్యలా బక్కగా కుంగిపోయాడనీ ఒకమ్మాయి లవ్వ్యూ చెప్పాకే తిరిగి లావయ్యాడనీ చందూకి కూడా తెలియదు. ముందే చెప్పుకున్నట్టు తెలిస్తే ఇంత స్టోరీ కూడా ఉండదు.

––––

బోన్స్ అండ్ బ్లడ్ జిమ్‌లోంచి బయటకు వచ్చేముందు ఒక్కసారి అద్దంలో కండలు చూసుకున్నాడు చందూ. మొత్తం మీద అక్కడక్కడా రెండు మూడు చెమ్పాలు పెరిగాయి. ఇక యానండ్‌పూర్ వెళ్లి సూరితో పాటూ స్నేహజీవితం గడపాల్సిన టైమొచ్చేసిందని చందూకి అనిపించింది. దానికి తోడు రెండు మూడు రోజులుగా హెల్ప్ హెల్ప్ అని సూరి అరుస్తున్నట్టు కలలొస్తున్నాయి. ఈ కండలతో వాడికి ఏ ఆపదొచ్చినా సాయం చేయొచ్చు. 'ఇక ఆలస్యమెందుకు సూరి మీద వాలిపోవడమే, వాడు చదివే కాలేజీలో చేరిపోవడమే' అనుకున్నాడు చందూ. 'రైట్ ఈ రోజే ప్రయాణం' మనసులో డిసైడ్ చేసుకుని ముందుకు కదిలాడ్.

–కట్.

**పదహారోరీలు**

ఇక యానండ్‌పూర్‌లో అదే టయానికి....

డోయ్‌య్య్‌ య్య్‌ య్య్‌ డర్‌డగ డర్‌డగ డర్‌డగ అంటూ ఉరుముల సౌండ్ వినిపించేసరికి...సముద్రం ఒడ్డున ఉన్న టెంట్‌లోంచి బయటకు వచ్చి ఆకాశంలోకి చూశారు ఆనంద్, రాఘవేందర్. ఎర్రటి ఎండలో ఎగురుతున్న నల్లటి హెలికాప్టర్ కనిపించింది. దాని మీద యెల్లో రంగులో పుర్రె బొమ్మ ఉంది. దానికి రెండు పక్కలా ఎముకల బొమ్మలున్నాయి గానీ ఆ ఎముకల హెడ్స్ మాత్రం లవ్‌సింబల్ షేపులో ఉన్నాయి. అదే ఇక్కడ వెరయిటీ.

దుమ్ములేపుకుంటూ లాండ్ అయిన హెలికాప్టర్ లోంచి చేతిలో వెండి కోటింగ్ వేసిన పుర్రె పట్టుకుని నిమురుకుంటూ దిగాడు జబ్బల్‌సింగ్. అతని జబ్బలమీద కూడా సేమ్‌టైపు పుర్రెబొమ్మా ఎముకల బొమ్మలూ ఉన్నాయి. నల్ల కళ్లజోడు అతని కళ్లలోని భావాలు బయటకు కనిపించకుండా అడ్డుపడుతోంది.

జబ్బల్, రాఘవేందర్ ఇద్దరూ కాంపస్‌లో గాలికి తిరిగేవాళ్లు. జబ్బల్ అప్పట్లోనే పుర్రెల మాఫియాలో చేరిపోయాడు. బాంబే నుంచి ఆఫర్ రావడంతో షిఫ్టయిపోయాడు. ఎన్నో ఏళ్ల తర్వాత రెండుమూడేళ్ళ క్రితం రాఘవేందర్‌కు కాంటాక్ట్‌లోకి వచ్చాడు. రాఘవేందర్ మీద ప్రేమతో యానండ్‌పూర్‌లో ఓ చిన్న పేకాట క్లబ్ పెట్టించాడు. ఇప్పుడు రాఘవేందర్ పగలో పాలుపంచుకోడానికి ఏకంగా హెలికాప్టరేసుకుని వచ్చేశాడు.

జబ్బల్ ముఖం తెల్లకాగితంలా ఏ ఫీలింగూ లేకుండా ఉంది. ఇద్దరు బాడీ గార్డులు చేతిలో ఏకె57లు పట్టుకుని రెండు వేపులా నడిచిరాగా రాఘవేందర్ ఎదురెళ్లి వాటేసుకున్నాడు. పక్కనే ఉన్న ఆనంద్ అప్పుడే తెచ్చిన గోలీసోడా సుయ్‌మని కొట్టి ఇచ్చాడు. జబ్బల్ ఎంతో హ్యాపీగా సోడా తాగాడు. కాలేజీ రోజుల్లో రాఘవేందర్–జబ్బల్ ఒకే సోడాని పంచుకుని తాగేవారు. అదన్నట్టు వాళ్ల అనుబంధం!

అందరూ కలిసి టెంట్‌లోకి వెళ్లారు.

'ఆపరేషన్ లస్కుటపా అయ్యేవరకూ ఇదే మన రహస్యస్థావరం! అంటే డెన్' అంటూ జబ్బల్‌కి టెంట్ చూపించాడు రాఘవేందర్.

'దీన్ని యల్‌టీటియ్యీ వాళ్లు కూడా కనిపెట్టలేరు' యాడ్ చేశాడు ఆనంద్.

వీడెవడు మధ్యలో–అన్నట్టు చూశాడు జబ్బల్.

'ఇతని పేరు ఆనంద్. నాతో పాటూ పగబట్టాడు. ఫర్ సేమ్‌రీజన్, సేమ్ పర్సన్. నాకా వయసయిపోయింది. నా తర్వాత మన పేకాటక్లబ్‌ని చూసుకుంటాడనీ మన గ్యాంగ్‌ని మేనేజ్ చేస్తాడనీ డెవలప్ చేస్తన్నా' పరిచయం చేశాడు రాఘవేందర్.

'ఓకే దట్సోకే, ఇంతకీ గొడవేంటి' చికెన్ జాయింట్‌ను పరపరా నోటితో పీకుతూ అడిగాడు జబ్బల్‌సింగ్.

రాఘవేందర్ మొత్తం స్టోరీ ప్లే చేశాడు. సూరి వల్ల తనదీ ఆనంద్‌దీ ప్రెజెంట్ అండ్ ఫ్యూచర్‌లైఫ్ ఎలా మటాషైపోయిందీ కడుపు రగిలేలా వివరించాడు. అంతా విని జబ్బల్ సౌండ్ చేసుకుంటూ త్రేన్చాడు. ఆ తర్వాత పెద్దగా ఆవలించాడు. టెంట్ కొంచెం మూవయింది. గార్డు లిద్దరూ కర్రలు పట్టుకుని నిలబెట్టి సర్దారు.
నోరు కప్పలా తెరిచి 'జబ్బల్ కీ బబ్బల్ బబ్బల్ కీ జబ్బల్' అని అరిచాడు జబ్బల్. ఆనంద్ కొంచెం షేకయ్యాడు. రాఘవేందర్ నార్మల్‌గానే ఉన్నాడు–అలవాటే కాబట్టి! గార్డులు కూడా ముందు జాగ్రత్తతో టెంట్ పోల్స్ పడిపోకుండా చూశారు.
సౌండు ఫేడవగానే జబ్బల్ అన్నాడు–'ఈ మాత్రం దానికి నేనిక్కడికి రావాలా, ఇదంతా ఫోన్‌లో చెప్పుంటే బోంబే నుంచే బబ్బుల్‌కీ అబ్బల్ లాంటి ఐడియా చెప్పేవాడ్ని కదా' అని.
'ఆ అదీ...అంతా ఫోన్‌లో చెప్పేస్తే ఫోన్ బిల్ ఎక్కువై పోద్దనీ...' అనబోయి నాలిక్కరుచుకున్నాడు రాఘవేందర్. 'ఏం లేదు నిన్ను చూడక చాలారోజులైంది కదా...చూసినట్టు, కలిసి సోడా తాగినట్టూ ఉంటుందని రమ్మన్నా' అంటూ కవర్ చేశాడు.
'ఓకే దట్సోకే. ఇప్పుడు వాళ్లిద్దర్నీ ఒకరికొకర్ని దూరం చేయాలి అంతేకదా. ఆ సూరిబాబు గాడ్ని జబ్బల్‌కీ బబ్బల్ చేద్దాం. ఆపై హెలికాప్టర్ నుంచి సముద్రంలో ఆక్టోపస్‌లకి ఆహారంగా విసిరేద్దాం' ప్లాన్ చెప్పాడు జబ్బల్.
'వద్దూ వద్దూ వాడ్ని చంపకూడదు. జీవితాంతం కుళ్లిపోయేలా చేయాలి. బతుకులో నిప్పులు పోయాలి. అప్పుడుగానీ నా గుండెమంట చల్లారదు. ముక్కుపచ్చలారని పసిపిల్లాడు లాంటి ఆనంద్ పగతీరదు' భాఘూ ఆవేశం ప్రదర్శించాడు రాఘవేందర్.
'ఊరుకో ఊరుకో ఆవేశం తగ్గించుకో. ఇప్పుడు కావాల్సింది ఆవేశం కాదు ఆలోచన. మనం పగబట్టామంటే జబ్బల్‌కీ బబ్బల్ చేసేదాకా నిద్రపోం' అంటూ తన చేతిలో ఉన్న వెండి పుర్రెను బాగా నిమురుతూ రుద్దుతూ గుద్దుతూ ఆలోచించాడు జబ్బల్.
గంటకూడా గడవకముందే ఐడియా మొలిచింది జబ్బల్ పుర్రెలో. 'ఇహియహ్యా జబ్బల్‌కీ బబ్బల్' అని వికటాట్టహాసం కాంబినేషన్‌తో అరిచాడు జబ్బల్.
ఆ అరుపుకు ఓ అరగంట కునుకు తీద్దామని పడుకున్న రాఘవేందర్ జడుసుకుని లేస్తే, చేత్తో గోలీసోడా పట్టుకుని వెయిట్ చేస్తున్న ఆనంద్ భయంతో సోడా కొట్టేశాడు.
'జబ్బల్! ఐడియా వచ్చేసిందా!' ఆత్రంగా అడిగాడు రాఘవేందర్.
'వచ్చింది గురూ వచ్చింది. ఇది సూరిగాడి జీవితాన్నే మటాష్ చేస్తుంది' పాతాళభైరవి విలన్‌లెక్క అరిచాడు జబ్బల్.
'కోఠీ ఫుట్‌పాత్ మీద మనం ఒకడికి సంవత్సరం పాటూ ఫ్రీగా పడుకోడానికి ప్లేసిచ్చాం గుర్తుందా'
'ఆ ఆ..గుర్తుంది. సత్తిగాడేనా'
'య్యా, వాడే ఇప్పుడు సత్తార్ అని పేరు మార్చుకుని కతార్ వెళ్లిపోయాడు. అక్కడ్నించి దుబాయ్ వచ్చి అమ్మాయిల బిజినెస్ చేస్తున్నాడు'
'వాడేం చేస్తాడు' వెర్రోడిలా పెట్టబడిన ఫేసుతో అడిగాడు రాఘవేందర్.

'చెయ్యాల్సిందే చేస్తాడు. వాడికెలాగో లడ్కీదందా ఉంది. భాగ్యలక్ష్మిని తీసుకుపోయి వాడికి ఎక్స్‌పోర్ట్ చేసేస్తా. అటు వాడికీ మాల్ సప్లయి చేసి సాయం చేసినట్టవుద్ది. ఇటు మనకీ పైసలొస్తయ్'

'య్య య్య య్య...ఈ విషయం సూరిబాబుకి తెలిసేలా చేస్తే చాలు. లవరుని తలుచుకుని తలుచుకుని కుంగి కృశించి చెదలుపట్టి చచ్చిపోతాడు' ఆనందంగా అరుస్తూ డైలాగ్ చెప్పాడు ఆనంద్. రాఘవేందర్ కూడా శాటిస్ఫై అయ్యాడు ఈ ఐడియాతో. ఇంకా ఈ ప్లాన్ అమలు కాకముందే వాళ్ల పగ సగం తీరిన ఫీలింగ్ వచ్చింది.

'అప్పుడే ఫీలైపోకు. రేపు దాన్ని కిడ్నాప్ చేసింతర్వాత నీకిష్టమొచ్చినంత సేపు టార్జాన్ టైపులో అరుచుకుందువుగాని. ముందు పనిచూడు. లేటయితే జబ్బల్‌కి బబ్బల్ అయిపోద్ది. ఒకవేళ ఎవడైనా చీకట్లో మన బ్లాక్‌హెలికాప్టర్‌ని కనిపెట్టాడంటే డబల్ బబ్బల్ అయిపోద్ది' అంటూ కాషనిచ్చాడు జబ్బల్.

ఇక వెంటనే రంగంలోకి దిగారు ఆనంద్ అండ్ రాఘవేందర్ కంబైన్స్.

–కట్.

## పదిహేడోరీలు

అది యానండ్‌పూర్ స్టేషన్. టైం పన్నెండయింది. సరిగ్గా నిమిషం తేడా లేకుండా పన్నెండింటికల్లా ఉరుము సౌండు చేసుకుంటూ వచ్చేసింది హింసాద్రి ఎక్స్‌ప్రెస్. జనరల్‌బోగీ లోంచి స్లోమోషన్‌లో దిగుతూ యానండ్‌పూర్ ప్లాట్‌ఫాం మీద లెగ్ పెట్టాడు చందూ.

––––

సూరీ.....సు సు సూరీ....స్సుస్సు స్సూ సూరీ.....మృదువైన గొంతు వినబడేసరికి వెనక్కి తిరిగిన సూరి తన కళ్లమీద తానే నమ్మకం కోల్పోయాడు.

ఎదురుగా చందు. గుర్తు పట్టలేనంతగా మారిపోయిన చందు. బక్కనాగన్నలా ఉండే చందూ ఓ మాదిరిగా రెండు మూడు కేజీల బరువు పెరగడంతో కలా నిజమా అని డౌటొచ్చి సూరి తనను తాను గిల్లి చూసుకున్నాడు. తనది అసలే తోలుమందం కావడంతో  సూరి చేతికి ఏమీ స్పర్శ తగల్లేదు. 'ఆ ఇదంతా డ్రీం లే' అనుకుని మళ్లీ కుర్చీలో కూలబడి పక్కింటి కిటికీ సైడు చూడసా....గాడు.

ఈసారి స్టన్నయిపోడం చందూ వంతయింది. కోపమొచ్చి సూరిబాబు నెత్తిమీద బండలా సూట్‌కేసు పడేశాడు. అప్పటికిగానీ సూరికి ఇది

'కలకానిదీ నిజమైనదీ' అని అర్ధమైంది.

సూరీ దిగ్గున లేచి డగ్గున చందూని వాటేసుకున్నాడు.

'చందూ మేరా యార్. వచ్చేశావా నీ స్నేహితుడి కోసం ప్రాణాలకు తెగించి రైలు ప్రయాణం చేసి వచ్చేశావా' చెమ్మగిల్లిన నయనాలతో అడిగాడు సూరి.

‘నీ కోసం మందుపాతర్లున్న అడవిలోంచి నడిచైనా వస్తాన్రా నా మిత్రా’ అని ఆనందంగా చెప్పాడు చందూ.
‘ఇక నుంచి నేనిక్కడే ఉంటాన్రా నీ తోడులా షాడోలా మధుబాబులా నిన్ను కాపాడుకుంటూ మీ డాడీ మీద వాలిపోయి ఆయన ఖర్చుతోనే నీ కాలేజీలో నీకు క్లాసుమేట్ అవుతాన్రా’ యాడ్ చేశాడు చందూ.
సూరి ఆనందంతో హతాశుడైపోయాడు...చిన్నప్పుడు తప్పిపోయిన బావ క్లయిమాక్సొచ్చే కాలానికి నడిచొచ్చినట్టు అనిపించింది, సూరీకి చందూని చూస్తే.
ఇంతలో చందూ మళ్లీ అడిగాడు.
‘అవతల ఎండమండిపోయి మొహం మీద పడుతుంటే నువ్వేంట్రా ఏసీ ముందు కూచున్నట్టు కూచున్నావ్, కనీసం ఆ కిటికీ కర్టెన్ అయినా లాగేయొచ్చుగా..’
‘లాగేస్తే మీ సిస్టరెలా కనిపిస్తది రా’
‘సిస్టరా, ఏంట్రోయ్ ఏదో లస్కుటపా జరిగినట్టుంది. ఏంటి సంగతి’ కొశనేశాడు చందూ.
లవ్‌స్టోరీ అంతా రీవైండ్ చేశాడు సూరి. అలాగే తన కొచ్చిన వార్నింగుల్ని కూడా వివరించాడు. కాసేపటికి ఆశ్చర్యంలోంచి తేరుకున్నాడు చందూ.
‘నీ లాంటి ఉత్తముడైన కుమారుడ్ని ప్రేమించిందంటేనే తెలుస్తోంది–మా సిస్టర్‌ది ఎంత మంచి టేస్టో. ఎంత జాలి హృదయమో. పద నాకు ఇప్పుడంటే ఇప్పుడు పరిచయం చేయాలంతే....నేనూరుకోను నేనూరుకోను’ గొడవపెట్టాడు చందూ.
‘ఇప్పుడంటే ఇప్పుడే అంటే ఎలారా...దానికో ప్రోసెసుంది. ముందు కనీసం ఫేసుకడిగి కొంచెం చార్లీ సెంటయినా కొట్టుకోవాలిగా..’
‘సరే సింకెక్కడ’
‘ఇంకెక్కడ ఇదిగో ఇక్కడ’
ఇద్దరూ ఫేసు బాగా వాషు చేసుకోడంలో నిమగ్నమయ్యారు.
కానీ, సూరి ఊహించలేదు. ఆ అయిదునిమిషాలే తన ప్రేమకు విషమపరీక్ష పెడతాయని. ఆ ఆలస్యమే ఒక చరిత్ర ఎరుగని క్లయిమాక్స్‌కు కారణమవుతుందని. ఊహించి ఉంటే అసలు ఫేసే కడుక్కునేవాడు కాదు.

----

ఇద్దరూ కలిసి వీలవేసుకుంటూ గోలగోలగా మెట్లు దిగారు. సూరి అయితే ఆనందంలో షేక్‌డాన్సు కూడా చేశాడు. సూరీ బండి సీటు చుట్టూ కుడికాలు తిప్పి కూర్చుని స్టయిల్‌గా స్టాండ్ తీశాడు.
‘పక్కింటికే కదరా బైకెందుకు’ డౌటుపడ్డాడు చందూ.
‘ఈ బండి సౌండే మనం ఎదురుచూస్తున్నట్టు సిగ్నల్’ టెక్నిక్‌బయటపెట్టాడు సూరి.
ఇద్దరూ కలిసి ఇంటిముందు మూడురౌండ్లేసినా లోపల్నించి భాగీ బయటకు రాలేదు.
ఈ సిగ్నల్‌ని కొంచెం లేటుగా రిసీవ్ చేసుకున్న భాగీ వాళ్ల డాడీ స్వామినాథం లబోదిబో మంటూ బయటకొచ్చాడు. రెండుచేతులూ చాచి ఏడ్చుకుంటూ పరిగెత్తుకొచ్చాడు.

'బాబూ సూరిబాబూ నీ హృదయరాణిని తీసుకెళ్ళిపోయారు బాబూ ఆ ఆనంద్‌గాడి మనుషులూ వాళ్లతో పాటూ మీ ఇంటి ఓనర్ రాఘవేందర్ కూడా ఉన్నాడు బాబూ. వెళ్లు బాబూ వెళ్లు. నీ ప్రేమని దక్కించుకో. నీ మామగారి కన్నీళ్లు తుడవడానికైనా వెళ్లు బాబూ వెళ్లు' అంటూ స్వామినాథం భోరుమన్నాడు.

'ఎంతసేపయిందండీ ఈ కిడ్నాప్ జరిగి' చందూ అడిగాడు.

స్వామినాథం విలపిస్తూనే 'సరిగ్గా ఆరునిమిషాలు బాబూ' అని చెప్పాడు.

సూరీ చందూ ఫేసులు చూసుకున్నారు. అంటే వీళ్లు ఫేసులు కడుక్కోకుండా ఉంటే భాగీని రక్షించేవాళ్లన్నమాట. తమ తప్పు తాము తెలుసుకునే లోపులోనే బాల్కనీలోంచి 'ఒరే సూరిగా నీకు ఫోనురా' అని అరిచింది నాగలక్ష్మక్క.

సూరి ఒక్క ఉదుటున మెట్లెక్కి దూసుకెళ్లి ఫోనెత్తాడు.

'హలో'

'హలో నేనేరా. నీ గుండెల్లో నిద్రపోతానన్న గడ్డంగాడ్ని. అనగా ఆనంద్‌ని. నీ ఫోన్‌కాల్ వల్ల లవ్వు డిస్‌కనెక్ట్ అయిపోయిన రివెంజ్ లవర్‌ని'

వెంటనే సూరిబాబుకి ఏంజరిగిపోతోందో పూర్తిగా అర్థమైంది.

'ఒరేయ్ రాస్కెల్, ఎక్కడ దాచావ్‌రా నా స్వీట్‌హార్ట్‌ని. భాగీకేమైనా అయిందో చూడు నిన్ను నరికేస్తా' ఓంద్రించాడు సూరి.

'హహ హహ... నీ లవర్‌ని నేనూ, నీ వల్ల నడుందెబ్బ తిన్న ఇంకో విలను, అంటే మీ ఇంటి ఓనరూ కలిసి మాఫియా సాయంతో దుబాయ్‌కి ఎక్స్‌పోర్ట్ చేస్తున్నాం రా. కావాలంటే మరో 36 నిమిషాలాగి హోటల్ సప్తగిరికి రా. కింద నిల్చో. అక్కడ ఏడో అంతస్తు లోంచి నీ భాగీని హెలికాప్టర్‌లోకి లాగేసి ఎత్తుకుపోయే భారీ దృశ్యాల్ని చూసి పిచ్చెక్కి చచ్చిపోదువుగాని రారా...రా.'

ఫోన్ కట్.

సూరీకి మైండ్ బ్లాకయింది. వెంటనే క్లియరైంది.

ఇంతలో భుజం మీద చెయ్యేసి అడిగాడు చందూ.

'ఆ ఆనంద్ గాడి వివరాలేమైనా తెలుసా'

'తెలీదురా నా వల్ల లేటయి వాడి లవ్‌స్టోరీ షిఫ్టు డిలీటయిపోయిందని మాత్రమే తెలుసు'

'పద ముందు ఆ వివరాలు తెలుసుకుందాం'

'ఇప్పుడవన్నీ ఏంట్రా బాబూ అవతల గొడవైపోతుంటే' కసురుకున్నాడు సూరి.

'సరే ఆ సంగతి నేను చూసుకుంటా గానీ నువ్వు అర్జెంటుగా ఇంటి ఓనర్ రాఘవేందర్‌గాడి వైఫుని రిక్షా ఎక్కించి సప్తగిరి సెంటర్ కొచ్చెయ్. ఈ లోగా నేను ఆ ఆనంద్‌గాడి లవర్‌ని వెతికి తీసుకొస్తా, బండి తాళాలివ్వు'

'వాళ్లెందుకురా ఇప్పుడు'

'నా స్కెచ్ నీకర్థం కాదురా. పిచ్చివాడా విషానికి విషమే విరుగుడురా. చాకుని చాకుతోనే రుద్దాలి. బయల్దేరు ఇప్పటికే ఆరునిమిషాలు గడిచిపోయాయి. ఇంకా ముప్పయినిమిషాలే మిగిలాయి' అంటూ జప్‌మని బండేసుకు వెళ్లిపోయాడు చందూ.

----

సూరి గేటు తీసుకుని లోపలికెళ్లి ఇంటి ఓనర్ ఇల్లు బెల్లు కొట్టాడు. తలుపు తీసింది–వెంగమాంబ. అంటే రాఘవేందర్ భార్య. చేతిలో చీపురుకట్టుంది. సూరి కొంచెం కంగారు పడ్డాడు. వెంటనే తేరుకున్నాడు.

'ఓహో నువ్వా, మా ఆయనేమో అనుకున్నా. నిన్న రాత్రనగా పోయాడు. ఇంతవరకూ తగలడలేదు. నాలుగు జాడిద్దామని చీపురు తెచ్చా. అది సరేగానీ ఏంటీ ఈ టైంలో కొట్టావ్ తలుపు' సౌమ్యంగానే అడిగింది వెంగమాంబ.

'రాఘవేందర్ అంకుల్‌కి యాక్సిడెంట్ అయింది. చావు బతుకుల్లో ఉన్నాడు. మీరు అర్జెంటుగా రావాలి. మీ బాడీ బైక్‌మీద పట్టదని రిక్షా తెచ్చా. మీరు సీట్లో కూర్చోండి, నేను రిక్షా అబ్బాయి సీటు మీద కూచుంటా' గుక్క తిప్పుకోకుండా డైలాగ్ చెప్పేశాడు సూరి.

ఈ మాటలు వినగానే వెంగమాంబ గట్టిగా శోకాలు పెట్టడం మొదలుపెట్టింది. ఆ ప్రాంతమంతా రీసౌండ్ మొదలైంది. సూరి తొందర పెట్టి రిక్షా ఎక్కించేశాడు.

రిక్షా హాస్పిటల్ వేపు కాకుండా సప్తగిరి సెంటర్ సైడు తిరగడంతో వెంగమాంబకు డౌటొచ్చింది. నోరు విప్పకముందే సూరి చూపిన కత్తి పొడుగు చూసి ఆమె తన కప్పనోరు లాంటి నోరును మూసేసింది.

----

వరసగా ఆ కాలనీలో ఉన్న టెలీఫోన్ బూతులన్నీ పిచ్చి స్పీడుగా వెతికేసరికి సూరికి ఆనంద్‌గాడి లవర్ అడ్రస్ దొరికింది. డోర్‌బెల్ కొట్టాడు ఆమె వచ్చింది. వెంటనే చందూ, జరిగిన కథనీ జరగబోతున్న అన్యాయాన్నీ ఫోర్‌మినిట్స్ డ్యూరేషన్‌లో చెప్పాడు.

'చూడండీ, ప్రేమ అనేది భగవంతుని స్వరూపం. కేవలం టైంకి ఫోన్ రాలేదనే చిన్న కారణం వల్ల జీవితాన్ని నాశనం చేసుకుంటామా? పండులాంటి ప్రేమని ఎండుటాకులా ఎండబెట్టుకుంటామా? ఇంత వరకూ కేవలం ఒక్క అబ్బాయిని మాత్రమే ప్రేమించారేమో, అందుకే మీకు లవ్‌లోని డెప్త్ అందలేదేమో. పోతేపోనీండి మీ ప్రేమని మీరు ఏం చేసుకున్నా మీ ఇష్టం. కానీ, మీ వల్ల మరో ఇద్దరు ప్రేమికులు శాశ్వతంగా దూరమవుతున్నారనీ, ఓ ఆడపిల్లని దుబాయ్ లడ్కీమార్కెట్లో అమ్మేస్తున్నారనీ తెలిస్తే ఊరుకోగలరా. మీకు దోమ కుట్టినట్టయినా లేదా?' సూటిగా ప్రశ్నించాడు చందూ.

తల ఊపింది ఆ అమ్మాయి. అవునంటుందో కాదంటుందో అర్థం కాకుండా.

'మీలో స్త్రీత్వం మానవత్వం ఏ మాత్రం మిగిలి ఉన్నా నాతో సప్తగిరి హోటల్‌కి రండి. తిరిగి మళ్లీ ప్రేమిస్తున్నట్టు ఆనంద్‌తో ఒక్కమాట చెప్పండి చాలు. ఈ ఘోరకలిని ఆపండి చాలు. ఇంతకన్నా మిమ్మల్నేమీ కోరను' చేతులు జోడించాడు చందూ.

ఆమెలోని స్త్రీ హృదయం వెంటనే కరిగింది. అందుకు గుర్తుగా ఆమె చెంపల మీద నుంచి కన్నీళ్లు జలజలా రాలి నేలను తడిపాయి. వాటిని చున్నీ కొంగుతో తుడిచి లేచి నుంచుంది.

'పదండి' చందూని అనుసరించింది.

----

మరోవైపు పీటాంబర్ అప్పుడే ఆఫీసు నుంచి ఇంటికొచ్చాడు. ఆయన్ను చూడగానే సూరీవాళ్ల మమ్మీ నోట్లో కొంగుపెట్టుకుని ఏడుస్తూ జరిగిందంతా చెప్పింది. పీటాంబర్ ఉగ్రనరసింహుడయ్యాడు. అప్పుడే పంపించేసిన ఆఫీసు జీపుని వెనక్కు పిలిపించాడు. జీపెక్కి పద సప్తగిరి హోటల్‌కి అన్నాడు.

----

చందూ సప్తగిరి హోటల్‌లో బండి పార్క్ చేశాడు. ఆనంద్‌గాడి లవర్‌ని పట్టుకుని లిఫ్టెక్కి ఏడో ఫ్లోరు దిశగా బయల్దేరాడు.

----

సప్తగిరి హోటల్ సెంటర్లో దిగి, రిక్షావాడి చేతిలో అయిదురుపాయలు పెట్టి, కండువాతో కన్నీళ్లు తుడుచుకుంటూ సప్తగిరి హోటల్ ఏడో అంతస్తు వేపు ఏడ్చుకుంటూ చూడసా..గాడు స్వామినాధం అంటే భాగీ వాళ్ల నాన్న.

----

మరో నిమిషంలో వెంగమాంబని ఎక్కించుకుని వచ్చిన సూరి రిక్షా కూడా అక్కడికే చేరింది. ఈలోగా వెంగమాంబకి దారిలో స్టోరీ మొత్తం చెప్పి కన్విన్స్ చేయడంతో ఆమె కూడా కోపరేట్ చేసి లిఫ్టెక్కి సెవెంత్ ఫ్లోర్‌కు బయలు దేరింది.

----

టెర్రెస్ మీద ఆనంద్, రాఘవేందర్ నిలుచున్నారు. రాఘవేందర్ టైం చూసుకున్నాడు. ఆనంద్ కొత్తగా పట్టుకున్న ఏకె57ని ముద్దుగా నిమిరాడు. ఇంకా ఏడునిమిషాలుంది హెలీకాప్టర్ రాడానికి. ప్లానేంటంటే...హెలీకాప్టర్ రాగానే అందులోంచి ఓ టబ్బు లాంటి తట్టని కిందకి తాళ్లతో దించుతారు. దాంట్లో భాగీని పడేసి పైకి లాగి గల్ఫ్‌దేశాల దిశగా డైరెక్టుగా ఎగిరిపోవాలన్నది జబ్బల్ వేసిన స్కెచ్. ఇదంతా సూరిబాబు స్వయంగా కళ్లతో చూసి కుమిలిపోవాలనీ ఆ సీన్‌ను జీవితాంతం మర్చిపోలేక కుళ్లిపోయి చచ్చిపోవాలనీ వాళ్ల ఆలోచన. అందుకే ఈ భారీ క్లయిమాక్స్ దృశ్యాన్ని ఊరి మధ్యలోని ఈ హోటల్‌కు మార్చారు. అంతేకానీ రహస్యస్థావరం నుంచి అట్నుంచి అటే భాగీని ఎత్తుకుపోయే అవకాశం లేక కాదు.

మరో నిమిషం మాత్రమే టైముంది. గన్ను పట్టుకుని గగనం వేపు చూస్తున్నాడు ఆనంద్. ఇంతలో దూరంగా హెలికాప్టర్ కనిపించింది–బ్లాక్‌కాప్టర్ విత్ యెల్లో పుర్రె గుర్తు. బహుశా సెకండ్‌హ్యాండ్‌లో కొన్నారేమో అంతదూరాన ఉన్నా పక్కనే ఉన్నంత సౌండొచ్చింది.

‘జబ్బల్‌కి బబ్బల్! ఇక రెడీ చేయండ్రా పిల్లని’ అందరికీ వినపడేలా అరిచాడు జబ్బల్.
హెలికాప్టర్ సౌండ్ వల్ల అంతా గట్టిగా అరుచుకుంటూ మాట్లాడుతున్నారు. ఎవరు ఏమంటున్నారో ఎవడికీ అర్థం కాడంలేదు. దాంతో ఇంకా గొంతు చించుకుంటున్నారు.
భాగ్యలక్ష్మి ఉరఫ్ భాగీ రెండు చేతులూ కట్టేసి నోటికి నేచురల్‌గానే బ్యాండేజి కట్టేసి నడిపించుకుని తీసుకెళ్తున్నారు పిట్టగోడ దగ్గరకి.
ఇంతలో అంత ఘోరమైన సౌండునూ మించి వినిపించిందొక గర్జన. సింహగర్జన.
అందరూ అటువేపు చూశారు. రాఘవేందర్ కూడా. అక్కడ కింద ఫ్లోరు బాల్కనీలో కనిపించాడు సూరి–ఎర్రబడ్డ కళ్లతో, చేతిలో కత్తితో, ఆ కత్తిని వెంగమాంబ వైఫ్ ఆఫ్ రాఘవేందర్ మెడమీద పెట్టిన చేతితో! రాఘవేందర్ ఖంగు తిన్నాడు.
ఆనంద్ మాత్రం ఇవేమీ పట్టించుకోకుండా భాగీ వీపుమీద ఎకె 57 పెట్టి నడిపిస్తూనే ఉన్నాడు.
రాఘవేందర్ గట్టిగా అరిచాడు ‘ఆనంద్ ఆగు, ఉండు ఉండు వాడు నా వైఫ్ మెడమీద కత్తి పెట్టాడు ఆగూ.... ఆగు!’
కానీ, ఆనంద్ ఆగలేదు. ‘వాడి పెళ్లాం మెడమీద కత్తున్నందుకు నేను పగ మానుకోవాలా! నో వీల్లేదు నా ప్రతీకారం తీరాల్సిందే’ అనుకుని ముందుకు తోసుకువెళ్తున్నాడు భాగీని.
ఇంతలో ‘ఆనంద్ ఆగు’ అని ఓ లేడీ వాయిస్ లౌడ్‌గా వినిపించింది. వెనక్కి తిరిగేసరికి చాందిని.
‘ఆనంద్. వద్దు ఆనంద్! నేను చేసిన తప్పుకి ఆ అమ్మాయిని బలిచేయకు ఆ జంటను విడదీయకు’ అంటూ గాట్టిగా అరిచింది.
ఆనంద్‌కు ఏమీ అర్థం కాలేదు. చాందినీ పక్కన రివాల్వర్‌ను గురిపెట్టిన చందూని చూశాడు– వాడెవడో అస్సలు అర్థం కాలేదు.
ఇదంతా చూస్తున్న సూరీకి మతిపోయింది. నా చిట్టి చెల్లెలు చాందినీయే ఆనంద్‌గాడి లవరా అని ఆశ్చర్యపోయాడు. చాందినీ కూడా సూరీని చూసి బిత్తర్‌పోయింది. నా ముద్దుల అన్నయ్యే ఈ స్టోరీలో హీరోనా అని ఆశ్చర్యపోయింది. వీళ్లిద్దరూ ఇలా ఆశ్చర్యపోడం వల్ల మరో ముప్పయ్యేడు సెకండ్ల టైం వేస్టయిపోయింది.
‘ఇదిగో ఆనంద్ నా పంక్చువాలిటీయే కదూ మన ప్రేమని దెబ్బకొట్టిందీ వీళ్లందరి జీవితాలమీదా దెబ్బేసిందీ! ఇదిగో అందుకే నీ ముందే ఈ క్షణంలోనే నా వాచీని తీసి ఆరంతస్తుల కింద పడేస్తున్నా చూడు’ అంటూ తను సుల్తాన్‌బజార్‌లో కొనుక్కున్న వాచీని తీసి విసిరేసింది చాందిని. ఈలోగా ఈ కన్ఫ్యూజనంతా చూసిన జబ్బల్, పరిస్థితిని తన కంట్రోల్ లోకి తీసుకున్నాడు. స్టన్నయిపోయి చూస్తున్న ఆనంద్ చేతిలోంచి గన్ను లాక్కున్నాడు. ఒకచేత్తో గన్ను పట్టుకుని మరోచేత్తో తన వెండి ఫ్రెర పడిపోకుండా బ్యాలెన్స్ చేస్తూ భాగీని ముందుకు తోశాడు.

'ఆనంద్ ఆయ్ లావ్‌యూ, ఆ అమ్మాయి కట్లు విప్పేయ్' అని అరిచింది చాందిని. కానీ ఆనంద్ అదేం పట్టించుకోకుండా రెండు చేతులూ సాచి వాటేసుకోడానికి చాందినీ వేపు వచ్చేస్తున్నాడు.
ఇంతలో జబ్బల్ భాగీని పట్టుకుని హెలీకాప్టర్ నుంచి వేలాడుతున్న తట్టలో తోసేస్తున్నాడు. భాగీ స్లిప్పయిపోయింది. కాలుతప్పి టెర్రస్ మీద నుంచి పడిపోయింది. లాస్ట్ మినిట్లో చేతికి దొరికిన పిట్టగోడపట్టుకుని వేలాడుతోంది. కిందకు చూస్తే ఏడుఫ్లోర్లు. నేల మీద స్విమ్మింగ్ పూల్. సడన్‌గా చేతిలోంచి భాగీ జారిపోడం చూసి జబ్బల్ డిజప్పాయింట్ అయ్యాడు.
సడన్‌గా ఓ వ్యక్తి జబ్బల్ మీద చిరుతపులిలా దాడి చేశాడు. ఆ దెబ్బకు షాక్ తిన్నాడు జబ్బల్. ఆ చిరుతపులి ఎవరో కాదు... పీటాంబర్! ఈ దాడితో జబ్బల్ చేతిలోని వెండిపుర్రె నేలమీద పడిపోయింది. ఆ పుర్రె ఏనాడైతే తన చేయి జారుతుందో ఆనాడే తన ప్రాణాలు పోతాయని జబ్బల్‌కి తెలుసు. అందుకే వాడు భాగీ సంగతి వదిలేసి పుర్రె కోసం దేవులాడ్డం మొదలుపెట్టాడు. ఈలోగా పీటాంబర్ ఒక్క ఉదుటున లంఘించి తుపాకీ గుంజుకున్నాడు. వెంటనే జబ్బల్ తేరుకుని ఆ తుపాకీని తిరిగి లాక్కొని గుళ్లవర్షం కురిపించాడు. అయినా పీటాంబర్ ఆగలేదు. బుల్లెట్ల వర్షాన్ని లెక్కచేయకుండా జబ్బల్‌గాడి పీక పట్టుకున్నాడు. జబ్బల్ పీక్కొని పీక్కొని పిట్టగోడ వరకూ వెళ్లి లక్కీగా హెలికాప్టర్ తట్టలో పడ్డాడు. పడేటపుడు వెండి పుర్రెను మాత్రం పట్టుకోలేకపోయాడు. పీటాంబర్ నేలమీద రక్తపు మడుగులో పడిఉన్నాడు.
'డాడీ' అంటూ సూరీ అరుచుకుంటూ వచ్చి ఆయన తలని ఒళ్లో పెట్టుకుని కూచోడానికి రెడీ అవుతుండగా పీటాంబర్ కళ్లు తెరిచి–
'బాబూ నేను చచ్చిపోయినా ఫర్వాలేదు. కానీ ఆ నీచుడ్ని మాత్రం వదలకు బాబూ..వ వ వదలకు...' అంటున్నాడు.
'లేదు నాన్నా లేదు' అంటూ శోకాలు పెట్టడం మొదలుపెట్టాడు సూరి. ఇంతలో భుజం మీద చేయిపడింది. వెనక్కి చూస్తే ఆనంద్ చాందిని చిలకాగోరింకల్లా ఉన్నారు.
'ఏం భయపడకన్నయ్యా మీ డాడీకి ఏమీ కాదు ముందు నువ్వూ ఆ కొత్తగా వచ్చిన చందూగారూ కలిసి భాగీని రక్షించి ఆ జబ్బల్ గాడిని ఎలాగైనా చంపేయండి' అని బూస్టింగిచ్చింది చాందిని.
ఈలోగా జబ్బల్ తన తొట్టిలోంచి హెలికాప్టర్‌లోకి పైకి పాకుతున్నాడు. కానీ ఒక తాడు తెగడంతో తొట్టి కొంచెం బెండయింది. దాంతో హెలికాప్టర్ మెల్లగా ఎగరాల్సివస్తోంది. సూరీ చందూ ముందు భాగీని రక్షించాలని డిసైడయ్యారు. ఈలోగా స్వామినాధం ఫైరింజనోళ్లని పిలిపించి కిందనుంచి నిచ్చెనలు వేయించాడు. చందూ ఆ టెర్రెస్ మీదున్న జబ్బల్‌గాడి బాడీగార్డులతో ఫైటింగ్‌లో మునిగిపోయాడు. సూరి తన కాళ్లకు తాళ్లు కట్టుకుని పిట్టగోడ మీదకు దిగాడు. అతను పడిపోకుండా ఆ తాళ్లను ఆనంద్, రాఘవేందర్ పట్టుకున్నారు. ఈలోగా తలకు దెబ్బ తగిలి స్పృహలోకి వచ్చిన జబ్బల్‌గాడి

బాడీ గార్డుల్లో ఒకడికి తెలివొచ్చింది. వాడు ఉన్నచోటు ఉండకుండా పిట్టగోడ దగ్గరకొచ్చి భాగీని లాగడానికి సూరీకట్టుకున్న తాళ్లను కోసేయడం మొదలుపెట్టాడు. వాడితో ఫైటింగ్ చేయాలంటే ఆనంద్, రాఘవేందర్ తాడు వదిలేయాలి. వదిలేస్తే సూరికింద పడి తలపగిలి చచ్చిపోతాడు. సరే దేవుడిదే భారం అనుకుని వాళ్లు ఆ తాడు అలాగే పట్టుకున్నారు. బాడీగార్డు గాడు తాడు కోస్తూనే ఉన్నాడు.

ఈలోగా జబ్బల్ హెలీకాప్టర్‌కు వేలాడుతున్న తొట్టిలోంచి బుల్లెట్‌వర్షం కురిపించడం మొదలుపెట్టాడు. సరిగ్గా అదే టైంకి ఆఖరితాడు ముక్క తెగడంతో సూరీ కంగారుపడ్డాడు. భాగీ నుంచి ఒక చేతిని విడిపించుకుని మరో చేత్తో టపుక్కుమని పిట్టగోడ పట్టుకున్నాడు. ఈ కంగారులో అతని చెయిపట్టుకుని వేలాడుతున్న భాగీ ఒక్కసారిగా చెయ్యి వదిలేసింది. సూరీ అని అరుచుకుంటూ ఏడంతస్తుల హైటు నుంచి కిందకు పడిపోసా...గింది. సూరిబాబు గుండెజారిపోయింది. అలా కిందకు పడిపోతున్న భాగీని నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయాడు. కానీ, స్వామినాధం వేయించిన ఒక నిచ్చెన రాడ్‌కు భాగీ చుడీదార్‌కున్న చున్నీ చిక్కుకుని తను నిచ్చెన అంచునుంచి వేలాడ్డం మొదలుపెట్టింది. అది కరెంట్ కోత సమయం కావడంతో లిఫ్టు లేదు. అందుకని, సూరీ శరవేగంతో పరిగెత్తుకుంటూ ఆరుఫ్లోర్లు దిగాడు. అలా దిగాడో లేదో, భాగీ చుడీదార్ చున్నీ చిరిగిపోడం, తను నిచ్చెనతో సహా కిందపడిపోడం, అదే సెకండ్‌కి సూరి కిందకు చేరడం, అతని చేతుల్లో భాగీపడిపోడం....యమా డ్రమెటిక్‌గా జరిగిపోయింది. 'హమ్మయ్య బతికింది' అనుకున్నాడు సూరి.

మరోవైపు జబ్బల్ హెలీకాప్టర్ ఇంకా అక్కడే గాల్లోనే ఉంది. బయల్దేరలేదు. తన వెండి పుర్రె ఇంకా హోటల్ టెర్రేస్ మీదే ఉండటంతో దాన్ని తీసుకురమ్మని టెర్రేస్ మీద మిగిలిపోయిన బాడీగార్డుని అరుస్తున్నాడు. ఇక పుర్రెమీద ఆశ వదులుకున్న జబ్బల్ తొట్టిలోంచి పైకిపాకి హెలీకాప్టర్‌లోకి చేరాడు.

కానీ వాడినలా చంపకుండా వదిలేయడం చందూకి నచ్చలేదు. ఎగిరి ఏడో అంతస్తు పిట్టగోడ మీద నుంచున్నాడు. పిట్టగోడ అంచునే పరిగెట్టుకుంటూ హెలీకాప్టర్‌ని ఫాలో అవ్వసాగాడు. ఎడంవేపు క్యుములోనింబస్ మేఘాలు ఉండటంతో హెలికాప్టర్ కుడివేపుకు తిరిగింది. ఇదే ఛాన్స్‌గా తీసుకున్న చందూ హోటల్ పిట్టగోడ మీద నుంచి డైరెక్టుగా హెలికాప్టర్‌లోకి నిప్పురవ్వలా దూకాడు. ఏక్‌దమ్ జబ్బల్ మీద పడి పీకపట్టుకున్నాడు. జబ్బల్ పెనుగులాడాడు. ఈలోగా హెలీకాప్టర్‌లో డీజిల్ రిజర్వ్‌లో పడటంతో పైలెట్ బజాజ్ స్కూటర్‌ని వంచినట్టు గాలిలోనే కాప్టర్‌ను వంచాడు. సరిగ్గా ఆ క్షణంలోనే జబ్బల్ తన మీద పడ్డ చందూని ఆ బెండయిన సైడుకి తోసేశాడు. దాంతో చందూ పట్టుజారిపోయాడు. హెలీకాప్టర్ స్టాండ్‌ను దొరికించుకుని వేలాడసాగాడు. ఇది చూసిన ఆనంద్ పిట్టగోడ దగ్గరకు పరిగెత్తుకు వెళ్లి హెలీకాప్టర్ మీదకు ఓ గొట్టం అందించాడు. ఆ గొట్టం పట్టుకుని చందూ నాక్‌గా టెర్రేస్ మీదకు దూకేశాడు. హెలీకాప్టర్ స్పీడందుకుంది. రయ్యిమని దూసుకుపోతోంది.

సూరీ ఇదంతా గమనించాడు. వెంటనే విజిలేశాడు. చందూ ఆ బిల్డింగ్ వాటర్ గొట్టాలు పట్టుకుని చరచరా ఏడంతస్తులూ జారిపోయి, సూరిబైకు బ్యాక్ సీటు మీద పడ్డాడు. సూరి యెక్సెలేటర్ రైజ్ చేశాడు. ఆనంద్ పైనుంచి ఓ ఏకె57 విసిరేశాడు. చందూ దాన్ని కేచ్ చేశాడు. ఇద్దరూ కలిసి హెలికాప్టర్‌ను ఛేజ్ చేశారు. జబ్బల్ వీళ్లని చూసి హెలికాప్టర్ లోంచి కన్నుకొట్టాడు. నన్నేంచేయగలర్రా మీరు అన్నట్టు పడీ పడీ పిచ్చోడిలా నవ్వడం మొదలుపెట్టాడు. కానీ జబ్బల్‌కు చందూ ఎంత షార్ప్ షూటరో తెలీదు. సూరీ బైకు నడుపుతుంటే చందూ ఫుట్‌రెస్ట్‌ల మీద కాళ్లు పెట్టి మెల్లగా నుంచున్నాడు. ఎకె57 ని గురిపెట్టి హెలీకాప్టర్‌ని ఫాలో అవడం మొదలుపెట్టారు. కానీ ఆ పైలెట్ హెలీకాప్టర్‌ని హైదరాబాద్ ఓల్డ్‌సిటీలో బజాజ్ స్కూటర్ నడిపినట్టు వంచుతూ వంగుతూ తిప్పుతూ లేపుతూ నడుపుతున్నాడు. ఏంచేయాలో కన్‌ఫ్యూజన్‌లో పడిపోయాడు చందు. ఇంతలో హెలీకాప్టర్ ఆ పక్కనే ఉన్న క్యుములోనింబస్ మేఘాలవేపు కొంచెం టర్న్ తిరిగింది. చందూ ఆ అవకాశాన్ని వదలదలుచుకోలేదు. గన్‌తో ఆ మేఘం మీదకు బుల్లెట్ల వర్షం కురిపించాడు. దెబ్బకు మేఘం బ్లాస్ట్ అయిపోయింది. దాంతో వర్షం మొదలైంది. వర్షపునీళ్లు హెలీకాప్టర్ లోపలున్న వాళ్లను తడిపేయడం మొదలుపెట్టింది. ఆ పైలెట్‌కి అసలే బ్రాంకియల్ ఎలర్జీ. ఆ చినుకుల ఎఫెక్ట్‌కి అతను తుమ్ములు ఆపుకోలేక కాప్టర్ మీద కంట్రోలు కోల్పోయాడు. సడన్‌గా స్లో చేశాడు. ఇది కిందనుంచి గమనించిన సూరి బండాపాడు. చందూ స్టాండేసిన బైకు సీటు మీద ఎక్కి నిలుచున్నాడు. గురిపెట్టాడు. ట్రిగ్గర్ నొక్కాడు. అంతే! బుల్లెట్ దూసుకుంటూ వెళ్లి హెలికాప్టర్ డీజిల్ ట్యాంక్‌ను పేల్చేసింది. మటాష్! నిప్పులు చిమ్ముకుంటూ ముక్కలు ముక్కలైంది ఆ హెలీకాప్టర్. దాంతో పాటూ జబ్బల్‌కూడా జబ్బల్‌కీ బబ్బల్ అయిపోయాడు. వాడి మాంసఖండాలు చెల్లాచెదురుగా నేలమీద పడ్డాయి. హెలీకాప్టర్ తగలబడిపోతోంది.

బ్యాక్‌గ్రౌండ్‌లో మంటలు రేగుతుంటే ఆ షాట్ మీద, భుజాన తుపాకి వేసుకుని చందూ, బైక్ తాళాలు తిప్పుకుంటూ సూరీ –చార్మినార్ సిగరెట్ తాక్కుంటూ ముందుకువచ్చారు.

––––

ఆపరేషన్ థియేటర్ తలుపు ముందు వెలుగుతున్న రెడ్‌లైట్ ఆరిపోయింది. ఒక్కసారిగా అక్కడ వెయిట్ చేస్తున్నవారి గుండెలు గుభేల్‌మన్నాయి. ఇంతలోనే గ్రీన్‌లైట్ వెలిగింది. ఒకటి ఆపి రెండోది వేసేలోపులో పుట్టిన టెన్షనది.

'ఆపరేషన్ సక్సెస్. మీ ఫాదర్‌కేం పర్వాలేదోయ్, తొడలో ఇరుక్కున్న బుల్లెట్ తీసేశాం' అన్న డాక్టర్ మాటలు వినగానే నాన్న బతికిన ఆనందంలో ఒక్కసారిగా ఎగ్గిరి గెంతుగెంత బోయాడు సూరి. ధన్‌మని చేయిపట్టుకుని ఆపాడు చందూ.

'ష్... కింద ఫ్లోర్లలో వార్డులున్నాయి జాగ్రత్త' అన్నాడు. అందరూ కితకితలు పెట్టినట్టు పడీపడీ నవ్వేశారు.

ఇంతలో అటొచ్చిన వీల్‌ఛైర్‌లో రాఘవేందర్‌కూడా కనిపించాడు.

'అదేంటంకుల్ మీరు ఇక్కడ'

రాఘవేందర్ నవ్వుకుంటూ చెప్పాడు–'వాడెవడో పిచ్చిడాక్టరు. నాకు ఆపరేషన్ చేసినా ఆ 'ఇది' తిరిగిరాదని చెప్పాడు. వాడివల్లే ఇంత అనర్థం జరిగింది. ఈ ఆస్పత్రిలో సింపుల్‌గా ఆక్యుపంక్చర్ చేశారు. నేనిప్పుడు 'అందులో' కూడా ఫిట్' అంటూ వెంగమాంగ వేపు చూశాడు.
'ఛీపొండీ ఈ వయసులో కూడా మీరేం తగ్గలేదు' అంటూ సిగ్గుపడింది ఆమె. మళ్లీ అందరూ కడుపుబ్బా పిచ్చిపిచ్చిగా నవ్వేశారు.

––––

స్పృహవచ్చిన పీటాంబర్ ముందు ఓ పాతికమంది నిలబడ్డారు. కానీ ఒక వ్యక్తిని చూసి మాత్రం ఆయన నిశ్చేష్టుడయ్యాడు.
'ఒరే స్వామినాథం నువ్వట్రా...ఒరే సూరీ ఈనెవరనుకున్నావ్‌రా? నీ మేనమామ! చిన్నప్పుడు వేరే కేస్టమ్మాయిని పెళ్లిచేసుకుని గొడవొచ్చి వెళ్లిపోయాడు. ఇప్పుడిలా టచ్‌లోకొచ్చాడు' ఆనందంతో పొంగిపోయాడు పీటాంబర్.
'అవునా, అంటే నా మేనమామే నా మామా' సూరి నమ్మలేకపోయాడు.
'ఏంటీ వీడి కూతుర్నా నువ్వు ప్రేమించింది? నో వీల్లేదు! కుదర్దంటే కుదర్దు' సీరియస్ అయ్యాడు పీటాంబర్.
స్టన్నయిపోయాడు సూరి.
చందూ కూడా.
భాగీ అయితే ఈసారి కూడా తనకు పెళ్లికాదా అన్నట్టు భయపడిపోయింది.
ఇంతలో పీటాంబర్ గంభీరమైన నిశబ్దాన్ని భీకరంగా ఛేదిస్తూ చెప్పాడు.
'అవును ఈ అమ్మాయిని ప్రేమించడానికి వీల్లేదంతే పెళ్లి చేసుకోవాల్సిందే అంతే...' అని హాస్పిటల్ దద్దరిల్లేలా నవ్వాడు తన జోకుకి తానే.
'ముసలోడికి జోకులకేం తక్కువ లేదు' మనసులో అనుకున్నాడు చందూ.
ఇంతలో ఇక ఫ్రేము ఫ్రీజయి గ్రూప్ ఫొటో పడుతుందనగా పోలీస్ సైరన్లు కుయ్ కుయ్ కుయ్ మని వినిపించాయి.

––––

వ్యాన్లన్నీ వచ్చి హాస్పిటల్ కారిడార్‌లో ఆగాయి. అందులో ఒకదాన్లోంచి హోం మినిస్టర్ దిగాడు. ఆయనతో పాటూ డిజిపి కూడా! ఇద్దరూ వార్డులోపలికి డైరెక్టుగా పీటాంబర్ ఉన్న రూంకి వచ్చేశారు. వీళ్లని చూసి అక్కడున్నవారంతా తీవ్రమైన టెన్షన్‌లో పడిపోయారు. లాస్ట్‌లో ఇదేంగోలరా బాబూ అని సస్పెన్స్ ఫీలవుతున్నారు.
హోం మినిస్టర్, డిజిపి సూరీకేసీ చందూకేసి చూశారు.
'కానిస్టేబుల్స్!' అనగానే ఓ కానిస్టేబుల్ రెండు దండలు తెచ్చి ఇద్దరు డిగ్నిటరీలకూ చెరొకటి ఇచ్చాడు. వాళ్లు తనకే దండవేస్తారేమోనని పీటాంబర్ ఎంబరాస్ అయిపోయి ముందుకు వంగబోయాడు.
కానీ వాళ్లు బాయేముడ్ అని తిరిగి చందూ సూరీల మెడలో దండలు వేశారు.

హోం మినిస్టర్ వాళ్లకేసి చూసి–
'ప్రపంచంలోనే అరుదైన ఆస్ట్రలోపితికస్ పుర్రెను సరిగ్గా ఇరవైఏళ్లక్రితం యూనివర్సిటీ ఆంత్రోపాలజీ లాబ్‌లోంచి ఎవరో దొంగిలించారు. అప్పటి నుంచీ ఇంటర్‌పోల్ సాయంతో మనపోలీసులు దేశవ్యాప్తంగానూ విదేశాల్లోనూ వెతుకుతున్నారు. మీ ఇద్దరి సాహసంతో ఇది తిరిగి మన భారతజాతికి దక్కింది' అని జగ్గయ్యని ఇమిటేట్ చేస్తూ చెప్పి షేక్ హ్యాండిచ్చాడు.
ఇంతలో డిజిపి మొదలుపెట్టాడు
'ఈ సందర్భంగా మీ సాహసాన్ని గుర్తిస్తూ ప్రభుత్వం మీకో అద్భుతమైన కానుక ఇవ్వదలుచుకుంది. ఆ పుర్రెకున్న వెండికోటింగ్ మొత్తం కరిగించి మీకే ఇవ్వాలని నిర్ణయించింది' అని కైకాల సత్యనారాయణ మాడ్యులేషన్‌లో చెప్పి షేక్‌హ్యాండిచ్చాడు.
'ఈ మాత్రానికి ఇంత బిల్డప్పా' అని అక్కడున్నోళ్లందరూ మనసులో అనుకున్నారు.
----
పోలీసులు ఫ్రేములోంచి గడబిడగా వెళ్లిపోయి ఫీల్డ్ క్లియరవగానే....
సూరిబాబు మమ్మీ ఫీల్డ్‌లోకొచ్చింది.... సూరి బుగ్గలు పిండి ముద్దుగా 'మా వెండికొండే!' అంది.
అప్పుడు మాత్రం ఇక అందరూ నవ్వాపుకోలేకపోయారు. పొట్టచెక్కలయ్యేలా నవ్వుతూనే ఉన్నారు–ఫ్రేము ఫేడయ్యేదాకా.....!
–ఆల్‌రీల్స్ ఓవర్!
ఎండ్స్